సంకలనం

**యం.ఎ. వనజ**

అడ్వకేట్

**బొమ్మలు : అన్వర్**

**ఎడిటోరియల్ టీం :**

**వి. ఉషారాణి** సన్నిహిత

**పి. పవన్**


## కృతజ్ఞతలు


ఆర్థిక సహకారం అందించిన ఆస్ఎయిడ్ కి, కవిత ఇచ్చి పుస్తకానికి వన్నెతెచ్చిన రత్నమాలకు, ఈ పుస్తకం లేఔట్ తయారీలో సహకరించిన జ్యోతి (రౌష్ని గ్రాఫిక్స్)కి, వనజ (అడ్వకేట్)కు ముఖచిత్రంకై ఫోటోకు సహకరించిన ఇబ్రహీపట్నం ద్వాక్రా గ్రూపు మహిళలు లక్ష్మి, ఇతరులకు, గౌసియా ఆపాకు, పద్మ (తర్జని), మా కార్యకర్తలు శంకర్ మరియు అనురాధలకు మంచి బొమ్మలను సమయానికి అందించిన అన్వర్‌కు, కౌన్సిలింగ్ సెంటర్ నిర్వాహణ ఖర్చుకు ఆర్థిక సహాయం అందించిన నిర్ణయ ఉమెన్స్ ట్రస్ట్‌కు మిగిలిన అందరికీ మా కృతజ్ఞతలు.

బిల్లు రూపకల్పనలో ప్రధాన పాత్ర వహించి ఈ పుస్తకానికి అభినందన వాక్యాన్ని అందించిన ఇందిరా జయ్‌సింగ్ (సుప్రీంకోర్టు న్యాయవాది)కు తమ పుస్తకంలో నుండి ఎదురయ్యే ప్రశ్నల చాప్టర్‌ని తెలుగులో అనువాదానికి అనుమతించిన లాయర్స్ కలెక్టివ్‌కు డి.వి చట్టం, నిబంధనలు తెలుగు అనువాదాన్ని ఇచ్చిన తర్జని పత్రికకు మా అభినందనలు.

అన్నిటికన్నా ముందు, స్త్రీలు తమ జీవిత అనుభవాలను, మానసిక సంఘర్షణలను, పోరాటాలను, ధైర్యంతో మాతో పంచుకొని మాపై నమ్మకంతో సహాయం కోసం వచ్చినందుకు మా కృతజ్ఞతలు.

# అభినందన

2006లో అమలుల్లోకి వచ్చిన 'కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005' ఈ దేశంలోని వేలాది మహిళల కలలకు రూపం. ఈ చట్టం కోసం ఉద్యమం చేయడంలో 2005లో ఈ చట్టం రూపొందడంలో భాగస్వామ్యం వహించినందుకు 'లాయర్స్ కలెక్టివ్'గా మేం గర్విస్తున్నాం.

కుటుంబంలో జరిగే భావోద్రేక, మానసిక, శారీరక, లైంగిక హింసా రూపాలన్నిటినీ మొట్టమొదటి సారిగా గుర్తించినది ఈ కొత్త చట్టం. కుటుంబ హింసను మానవహక్కుల ఉల్లంఘనగా పరిగణించి, అలాంటి ఉల్లంఘనలకు పరిష్కారాలు, ఉపశమనాలను చూపిన చట్టమిది. కలసివుండే ఇంటిలో (షేర్డ్ హౌస్ హోల్డ్) నివసించే హక్కు మహిళకు ఉందని గుర్తించిన మొదటి చట్టం కూడా ఇదే. వివాహ సంబంధాన్నే కాక, పెళ్ళికాని మహిళలు, కూతుళ్ళు తమపుట్టింటిలోనే ఉపశమనం పొందడానికి, తమ సొంత కొడుకు నిర్లక్ష్యానికే గురై, ఇంటి నుంచి గెంటివేయబడిన వృద్ధతల్లులకు ఉపశమనం అందుకోవడానికి అవకాశం కల్పించిన మొట్టమొదటి చట్టంగా కూడా దీనికి ప్రత్యేకత ఉంది.

నిస్పృహలో ఉన్న మహిళలకు చేయూతనందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఈ చట్టం ప్రభుత్వానికి నిర్దేశించింది. కోర్టు ద్వారా ఉపశమనం కోరే మహిళల తరఫున రక్షణాధికారులు కుటుంబ హింస సంఘటనా నివేదికలను తయారు చేసి, కోర్టుకు దరఖాస్తు చేయాలి. కుటుంబంలో స్త్రీలు హింసకు గురైతే న్యాయ సహాయం ఒక హక్కుగా కల్పించారు. ఈ చట్టంకింద మహిళలకు ఏఏ ఉపశమనాలు లభిస్తాయో పోలీసులు మహిళలకు తెలియజేయాలి. ఈ చట్టం కింద సహాయం కోరే మహిళల కోసం సర్వీస్ ప్రొవైడర్లు, కౌన్సిలర్లు, షెల్టర్లు, షెల్టర్ హోమ్‌లను ఏర్పాటు చేయాలి.

ఈ చట్టం ఇంకా ఏడాది పాప. దీని అమలులో ప్రాంతాల వారీ ఉల్లంఘనలు జరిగాయని మా అధ్యయనంలో వెల్లడైంది. ఈ చట్టం అమలులో ఆంధ్ర ప్రదేశ్ ముందంజలో ఉంది. జెండర్ సున్నితత్వంలో శిక్షితులైన రక్షణాధికారులను నియమించింది.

అయినా, చేయాల్సింది చాలా ఉంది. చట్టాన్ని అర్థం చేసుకోవడంలో కోర్టులు ఇంకా తంటాలు పడుతున్నాయి. పలు రాష్ట్రాలలో ఈ చట్టం అమలు అంతంత మాత్రంగా ఉంది. ఇంకా చాలా రాష్ట్రాలు రక్షణాధికారులను నియమించనేలేదు.

ఈ చట్టం గురించి అవగాహన కోసం ప్రశంసనీయమైన కృషి చేస్తూ, అందులో భాగంగా ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్న సన్నిహిత సంస్థకు నా అభినందనలు, భవిష్యత్తులో ఫలవంతమైన రీతిలో కలసి పనిచేసే బంధంకోసం ఎదురుచూస్తున్నాం.

హింస లేని జీవితం గడిపేందుకు మహిళలను సాధికారపరచడంలో ఈ పుస్తకం సఫలమవుతుందని విశ్వసిస్తున్నాను.

ఇందిరా జైసింగ్
డైరెక్టర్
విమెన్స్ రైట్స్ ఇనిషియేటివ్ , లాయర్స్ కలెక్టివ్
63 మసీద్, రోడ్, జంగ్‌పూరా ఎక్స్‌టెన్షన్, న్యూఢిల్లీ.

# ఆకాంక్ష

గత ఏడు సంవత్సరాలలో సన్నిహిత కుటుంబ హింసను ఎదుర్కొన్న అనేక మంది స్త్రీల వ్యధలు, గాధలు, విన్నది. వారి పేరు, ఊరు, కులం, మతం, రంగు, రూపు, వర్గం, వర్ణంలో చాలా తేడాలున్నాయి. కాని వారికి ఎదురయిన హింసలో మాత్రం తేడా కనబడలేదు. కొందరికి ఒక విషయం అయితే, ఇంకొందరికి ఇంకో విషయం. కొందరికి ఎక్కువగా ఉంటే కొందరికి తక్కువ, అంతే స్త్రీలు హింసననుభవించే అంశాలు మానసిక సంబంధమైనవి, చాలాసార్లు శారీరక సంబంధమైనవి. హింస మొదలైన సందర్భాలు, రోజులు, నెలలు, సంవత్సరాలలో తేడా వుంది. భర్త అతని తరపు బంధువులు పెట్టే హింసను భరించలేక పోయినరోజున, పుట్టింటిని, కుల సంఘాలను, గ్రామపెద్దలను, బస్తీ పెద్దలను, కార్పొరేటర్లను, పంచాయితీలను ఆశ్రయించి, చేతిలోంచి డబ్బు ఖర్చయి, బోల్డంత సమయం వృధాగాపోయి, తప్పనపుడు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినా, అక్కడా పంచాయతీ పెట్టి 'కాపురాలు నిలబెట్టే' బాధ్యతను పోలీసు వారు మీద వేసుకోవడంతో తమ సమస్యకు పరిష్కారం దొరకక కృంగిపోయారు. ఆ పరిస్థితిలో తమ మాటను ఎవరూ అర్థం చేసుకోవడం లేదని భావించినపుడు స్త్రీలు మహిళా సంఘాలను ఆశ్రయిస్తారు. స్వచ్ఛంధ సంస్థలను వెతుక్కుంటారు. మావద్దకు మహిళలు చాలాసార్లు ఆపరిస్థితిలోనే వస్తారు.

అన్నిచోట్ల వారు అడిగే సహాయం ఒక్కటే.

తన భర్త తనను కొట్టడం, తిట్టడం మానేస్తే బావుండని, తాగకుండా పనిచేసి తనను పిల్లల్ని పోషించాలనీ, ఫీజులు కట్టడం, ఇంటి అద్దె చెల్లించడం, సరకులు తీసుకురావడం, పనిలో సాయం చేయడం ఇత్యాది అంశాలు. వీరిలో చాలామంది కూలీ నాలీ చేసుకునే పేద స్త్రీలు.

ఇంకా చాలా సందర్భాల్లో తన భర్త తనను (కొన్ని సార్లు తన ఆడపిల్లలను కూడా) లైంగికంగా వేధించటం, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం చేయడం, వారిని కాదందని అనుమానంతో వేధించటం, ఇంట్లోంచి గెంటించటం, కట్నం తీసుకురమ్మని, టీ.వీ., ఫ్రిజ్, ఉద్యోగం, బిజినెస్ కోసం డబ్బులు తెమ్మని చావబాదడం అలా ఎన్నో అంశాలలో హింసను ఎలా వదిలించుకోవాలో అర్థం కాక ఆత్మహత్యలకు, హత్యలకు గురయిన స్త్రీలు గత పదేళ్ళలో లక్షల్లో ఉన్నారని అనేక లెక్కలు చెపుతున్నాయి.

వీటన్నిటినీ తట్టుకుని ఐదేళ్ళు, పదేళ్ళు కాపురం చేశాక నువ్వొద్దు ఫో, నువ్వునాకు నచ్చలేదు అని ఛీత్కరించే భర్తతో కాపురం చేయలేక, ఎక్కడికి పోవాలో తెలియక, రోడ్లపాలైన స్త్రీలు అనేకం, పిచ్చివారైన స్త్రీలు కోకొల్లలు. డిప్రెషన్‌కు గురై తన భర్త అన్యాయాన్ని ఎదిరించే శక్తికోసం తడుముకున్న స్త్రీలు అనేకం.

ఈ అనంతమైన హింసను సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలతో జోడించి అర్థంచేసుకుంటూ, స్త్రీలపై హింసను వ్యతిరేకిస్తూ స్త్రీలకు అండగా నిలబడే మా ప్రయత్నంలో, మా పరిధిలో మా సంస్థ స్త్రీలకు సాయం చేయడానికి, వ్యక్తిగత కౌన్సిలింగ్, కుటుంబానికి కౌన్సిలింగ్ నిర్వహించాం. పోలీసులతో మాట్లాడి, స్త్రీలకు న్యాయం అందించే ప్రయత్నం చేశాము.

ఈ అంశాలన్నీ మానవహక్కుల కోణంలో విశ్లేషించి పరిష్కరించే ప్రయత్నం చేస్తూ వచ్చాము. స్త్రీలు ఎదుర్కొనే హింసకు హోంలు, పోలీసులు, మానసిక వైద్యులు పూర్తిస్థాయి పరిష్కారం ఎన్నటికీ కాదు. ఈ నేపథ్యంలో స్త్రీలకు వారి హక్కులను తెలుపుతూ చైతన్యవంతులను చేస్తూ కుటుంబంలో, కుటుంబం ఆవల అందుబాటులో ఉన్న సేవలు, సహాయ సహకారాల గురించి తెల్పడం, వారి తరఫున పోలీసులతో, కుటుంబాలతో మాట్లాడటం అనే పనిని చేస్తూ వచ్చాము. ఈ నేపథ్యంలో స్త్రీల సంఘాల పోరాట ఫలితంగా అక్టోబర్ 2005లో డి.వి. చట్టం వచ్చింది. ఇందుకోసం చాలా ఎదురుచూశాం. ఈ చట్టాన్ని స్త్రీలకు అందుబాటులోకి తేవడం, స్త్రీల సంఘాలకు, సంబంధిత ప్రభుత్వ శాఖలకు కోర్టులకు, లాయర్లకు కూడా ఒక ఛాలెంజ్. చట్టం వచ్చినప్పటినుంచి చట్టాన్ని అమలు చేసే విధానాలు పద్ధతులను పరిశీలిస్తున్నాం. అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. కరపత్రాలను పంచుతున్నాం. ఇలా చేయడం వెనక ఈ చట్టం కూడా మిగిలిన చట్టాలవలె నీరుగారకుండా, పటిష్టంగా అమలు జరగాలని మా ఆకాంక్ష.

ఈ నేపథ్యంలో స్త్రీ అభివృద్ధి, శిశుసంక్షేమశాఖ, హైదరాబాద్ వారి పిలుపును ఆధారం చేసుకొని సర్వీస్ ప్రొవైడర్‌గా నమోదు చేసుకున్నాం. అనేక సంవత్సరాలుగా స్త్రీలకు సంబంధించిన  కేసులు చేపడుతున్నప్పటికీ స్త్రీలు హింసకు గురికాకుండా చేయడానికి, బాధిత స్త్రీలు కనీసం బతికిఉండాలన్నా, పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చేది. మా పరిధిలో స్త్రీల హక్కులను వారికి అందుబాటులోకి తీసుకురావడానికి అనేక మార్గాలను, వ్యూహాలను చేపట్టేవాళ్ళం. అయితే ఈ చట్టం వచ్చాక  మాకూ పరిమితులు, పరిధులు ఏర్పడ్డాయి. చట్టానికి బద్ధులమై స్త్రీల కుటుంబహింస కేసుల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులపై, కోర్టులపై, లీగల్ సర్వీసెస్ అథారిటీలపై ఆధారపడాల్సి వస్తుంది. ఈ ప్రక్రియలో మేము ఈ చట్టంవలన కలిగే ప్రయోజనంతో పాటు, చట్టం అమలు చేసే ప్రక్రియలో భాగస్వాములయ్యే ప్రయత్నం చేస్తున్నాం. ఈ అనుభవాలను ప్రాథమిక స్థాయిలోనే పరిశీలించుకుంటూ విశ్లేషించుకుంటూ, చట్టాన్ని అమలు చేయడం అవసరమని భావిస్తున్నాం. స్త్రీల హక్కుల సంస్థగా మాస్థాయిలో చేయగలిగిన పనిని చేస్తూ, ఈ అంశాలన్నిటినీ మీ అందరితో పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని తీసుకొస్తున్నాం.

ఈ పుస్తకంలో ఇప్పటివరకు ఈ చట్టంనుండి ఫలితం పొందిన కొన్ని మహిళల కేసులు, తీర్పులు, డి.వి. చట్టం తెలుగులో, రక్షణాధికారుల, లీగల్ సర్వీస్ అధికారుల వివరాలు, శాంతమ్మ కథ, ఇస్తున్నాం. ఈ వివరాలు ఇవ్వడంలో ముఖ్య ఉద్దేశ్యం–కుటుంబ హింసను ఎదుర్కొంటున్న స్త్రీలకు వారి సమస్యలు 'వ్యక్తిగతం' కావని, 'ఖర్మఫలం', కాదని సహాయం పొందటానికి మార్గాలున్నాయనే ధైర్యాన్ని ఇవ్వాలని మా లక్ష్యం.

మేము ఈ పుస్తకంలో పొందుపరుస్తున్న కొన్ని కేస్‌స్టడీస్ చదివి స్త్రీలు  వివిధ రకాలుగా ఎదుర్కొంటున్న కుటుంబ హింసతో, తమ పరిస్థితిని పోల్చుకోగలుగుతారు. అప్పుడే తమ పరిస్థితిని సమాజ పరిస్థితిలో భాగంగా అర్థం చేసుకోగల్గుతారు. ఎందుకంటే, కుటుంబ పరిధిలో వ్యక్తిగతమంతా రాజకీయమే. కుటుంబ సంబంధాలలో ఆర్థిక సంబంధాలు, అధికార సంబంధాలు వ్యవస్థీకృత హింసలో భాగమే.

స్త్రీలు ఎదుర్కొనే హింస కుటుంబ పరిధిలో ఎన్ని రకాలుగా ఉన్నా, అవన్నీ కూడా ఈ ఒక్క చట్టం కిందికే వస్తాయని చెప్పడం కూడా మా ఉద్దేశం. కుటుంబ హింసను ఎదుర్కోవడానికి ఈ చట్టంలో ఉన్న ఒక వెసులుబాటు అతి తక్కువ సమయంలో అతి తక్కువ వ్యయ ప్రయాసలతో న్యాయాన్ని (Immediate relief) పొందగలగడం ఈ చట్టం రూపకల్పనలో ప్రధాన ఉద్దేశం అదే. ఆ విధంగా ఈ చట్టం సామాన్య స్త్రీలకు అందుబాటులోనే ఉందని తెలియజేయడం అవసరం. చట్టం సామాన్య స్త్రీలకు, కుటుంబాలలో పురుషులకు అర్థం అవ్వాలనే ఉద్దేశంతో చాలా సులభశైలిలో అనువదించడం జరిగింది.

ఈ చట్టం వచ్చినప్పట్నించీ, ఈ పుస్తకం ద్వారా మేము స్త్రీ పురుషులందరితో పంచుకోవాలనుకుంటున్న అంశాలు – ఈ చట్టంలోనూ మరియు ఈ మధ్యే వచ్చిన కొత్త బాల్యవివాహ నిరోధక చట్టంలో కూడా, నిందితులు మగవారే ఎందుకు అవుతున్నారు, అనే ప్రశ్నలను అనేకసార్లు, చర్చలలో సమావేశాలలో ఎదుర్కోవడం జరుగుతోంది. అంతేకాక స్త్రీలు చట్టాలను దురుపయోగం చేయడంలేదా? దీనిని ఆయుధంగా చేసుకొని భర్తలను, అన్నలను, తండ్రులను వేధించరా? స్త్రీలు తప్పులు చేయరా? స్త్రీలంతా చిన్నచిన్న విషయాలకు పోలీస్‌స్టేషన్‌లకు, కోర్టులకు వెళ్తే ఇంటి పరువు పోదా? కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నంకాదా? పిల్లల గతి ఏమవుతుంది? అనే ప్రశ్నలను తరచుగా ఎదుర్కొంటున్నాం. ఈ మధ్య అనేక చర్చల్లో స్త్రీలు హక్కులు అడగడంవల్ల, ఎక్కువగా చదువుకోవడంవల్ల, కుటుంబాల్లో, గొడవలొస్తున్నాయని డైరెక్ట్‌గా వాదిస్తున్నారు. సమానత్వ పోరాటాలు, ఉద్యమాలు చేసే కొంత మంది పురుషులు కూడా అటూ ఇటూగా ఈ అభిప్రాయాన్ని కలిగిఉంటున్నారు. మధ్య తరగతి కుటుంబాల్లో, అయితే జాతకాలుచూడడం, అమ్మాయిలపై సి.ఐ.డీలను నియమించడం, అమ్మాయిల ప్రవర్తనపై ఎంక్వైరీలు ఎక్కువగా వింటున్నాం.

"స్త్రీలు చదువుకోవాలి. మోడర్న్‌గా ఉండాలి. తమతో క్లబ్‌లకు, పబ్‌లకు వచ్చి తమ స్టేటస్ నిలబెట్టాలి. కాని జాగ్రత్తగా 'శీలం', 'పాతివ్రత్యం' కాపాడుకుంటూ, వారికి అనుకూలంగా బ్రతికేయాలి. చదువు, జ్ఞానం, అవగాహన ఆమేరకే ఉపయోగపడాలి. వంట చేయడం ముఖ్యబాధ్యత తనదే. మగ పిల్లల్ని తప్పక కనాలి. అందుకు ఆధునిక పరిజ్ఞానాన్ని కలిగిఉండాలి. పెళ్ళి, పురుళ్ళు, పండుగలు పుట్టిన పిల్లల ఖర్చు పుట్టింటివారే భరించాలి. కాని పుట్టింటివారికి ఆర్థిక సహాయం చేయకూడదు. చాలా సార్లు వారి ఊసుకూడా ఎత్తకూడదు". వారు మాత్రం ఇతర స్త్రీలతో సంబంధాలను కలిగిఉండవచ్చు. అదంతా ఆధునికత. వీరు మాత్రం సాంప్రదాయబద్ధంగా ఉండాలి. "స్త్రీత్వ" లక్షణాలతో ఉండాలి. లేకపోతే వదిలేస్తారు. లైంగిక ఆసక్తులు కలవక కూడా చాలా మంది విడిపోతున్నారు. పైకి వేరే కారణాలు చెబుతారు. మారుతున్న పరిస్థితితో పాటు పురుషుల ధోరణి ఎక్కడో కొందరిలో తప్ప ఎక్కువ మందిలో చైతన్యవంతంగా లేదు. ఆధునికంగా సమానత్వంగా తమ ప్రవర్తనను అలవర్చుకోవాలనుకుంటున్న పురుషులు అనేక మంది ద్వైదీ భావనతో మూసలో పడి నలిగిపోతున్నారు.

పురుషులనే ప్రతివాదులుగా చూపడానికి వెనక వందల వేల సంవత్సరాలనుండి స్త్రీలపై అణచివేతకు, సమాజంలో ఉన్న అనేక రకాల అసమానతలకు, హింసకు పునాది పురుషస్వామ్య వ్యవస్థ అని మా అవగాహన. కుటుంబాలలో, సమాజంలో నిర్ణయాధికారం,

పురుషులదే అనీ, స్త్రీలు, పిల్లలు ఆ చట్రం పరిధిలోకే వస్తారనీ వారు ఆ అవగాహనతోనే, పితృస్వామ్య భావ జాలంతోనే పెరుగుతారనీ, అందుచేత అంతిమ బాధ్యత వ్యవస్థలోని పురుషాధిపత్య భావజాలం వహించాల్సి ఉంటుందని మా అభిప్రాయం, అందువల్లనే మన వ్యవస్థలోని ఈ మూస పురుషస్వామ్య భావజాలాన్ని ఎదిరించాల్సిన అన్ని సందర్భాలను, అవకాశాలను ఉపయోగించుకునే క్రమంలో ఈ చట్టం అందుకు దోహదపడాలని మా అకాంక్ష. కానీ, చట్టం వచ్చినప్పట్నించీ, దాన్ని అమలు చేసే యంత్రాంగం మధ్య సమన్వయం, లేక, బాధ్యతలపై అవగాహన లేక పోవటంతో చట్టాన్ని ఆశ్రయించిన బాధిత మహిళలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. అమలు యంత్రాంగం, పాలనా భారం, మానవ వనరుల ఆర్థిక వనరుల లేమితో ఇబ్బందులకు గురవుతోంది. ప్రభావం బాధిత స్త్రీలపై పడుతుంది. ఈ చట్టాన్ని ఆశ్రయించిన స్త్రీలను కొందరు లాయర్లు పెద్ద మొత్తాలలో ఫీజు అడుగుతున్నారు.

చట్టం యొక్క విధానాన్ని తెలపడం, సరి అయిన మార్గం చూపడం, బాధితులకు అవగాహనను కల్పించడం, ఎప్పటికప్పుడు వారేం చేయాలో చెప్పడం వలన స్త్రీలకు కాస్త ఆత్మస్థైర్యం వస్తుంది. మానసిక హింస తగ్గుతుంది. ఆర్డర్స్ వచ్చినాక వాటి అమలుకై ఎవరేం చేయాలనే అంశంలో సందేహాలెదురవుతున్నాయి.

కొన్నిచోట్ల లాయర్లు ఉంటేనే కేసు ఫైల్ చేస్తున్నారు. స్త్రీల సమస్యలను, స్త్రీల దృక్పధంలేని లాయర్లు తీసుకుంటున్నారు.

పాత పద్ధతిలో, సాంకేతిక పరమైన భాషతో కేసును వేయాలని సూత్రీకరణ చేస్తున్నారు. బాధితమహిళ – రక్షణాధికారి మెజిస్ట్రేట్‌తో అవ్వాల్సిన అంశం, ఏవేవో మలుపులు తీసుకుంటోంది.

ఫలితం స్త్రీలను ఇబ్బందులకు గురిచేస్తుంది.

ఈలోపాలను కాస్త, సమన్వయంతో జండర్ దృక్పధంతో సులభంగా సవరించుకోవచ్చునని మా నమ్మకం. కుటుంబంలో సహకారం మహిళలకు మరియు పురుషులకు ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది. విజయాన్ని అందుబాటులోకి తెస్తుంది.

ఈ పుస్తకం కార్యకర్తలకు, సంస్థలకు, స్త్రీల జీవితాలలో శాంతి కోరుకునే వారికీ ఉపయోగపడగలిగితే మా ప్రయత్నం నెరవేరినట్లే.

తేది :

**వి. ఉషారాణి**
డైరెక్టర్
సన్నిహిత, హైదరాబాద్.

# మహిళల పట్ల అన్నిరకాల వివక్షానిర్మూలనకు ఒప్పందం

ఐక్యరాజ్యసమితి 1979 లో స్త్రీల పట్ల ఉన్న అన్నిరకాల వివక్షతలకు వ్యతిరేకంగా ఒక అంతర్జాతీయ ఒప్పందాన్ని చేసింది. దీనినే సీడా (Convention on Elimination of Discrimination of all forms against women) అంటారు. దీనిని స్త్రీల హక్కుల బిల్లు అని కూడా అంటుంటారు. దీనిలో 30 ఆర్టికల్స్ ఉన్నాయి. ఇది ఏ అంశాలు విక్షతకు దారితీస్తాయో తెలుపుతాయి. అంతేకాక సీడా వివక్షతను రూపుమాపేందుకు ఒక ప్రణాళికను ఏర్పరిచింది.

స్త్రీలకు ఓటు వేసే హక్కు, ఎన్నికలలో నిలబడే హక్కు, ఉద్యోగ హక్కు, ఆరోగ్యహక్కు, విద్యను పొందే హక్కులను కల్పిస్తామని తద్వారా స్త్రీలు తమ మానవ హక్కులను అనుభవించే దిశగా కార్యక్రమాలను చేపడతామని సభ్యదేశాలు సంతకం చేశాయి. భారత దేశం 1993న సంతకం చేసింది.

స్త్రీలు పిల్లలను కనడం, పిల్లల మధ్య ఎడం, గర్భనివారణ, గర్భదారణ, మొదలైన అంశాలలో నిర్ణయ అధికార హక్కులను గుర్తించింది. స్త్రీలు తమ పిల్లల హక్కులు కాపాడుకునేందుకు, మతం మార్చుకునేందుకు, కొత్త మతం స్వీకరించేందుకు వీలు కల్పించింది. పెళ్ళి విషయంలో, స్త్రీల ఎంపిక, ఆమోదం, కనీస వయోపరిమితి, పెళ్ళి రిజిస్ట్రేషన్, మొదలైన అంశాలను నవంబర్ 1, 1965లో ఆమోదించారు. స్త్రీల హక్కులను మానవ హక్కులుగా గుర్తించిన మొట్టమొదటి అంతర్జాతీయ చట్టబద్ధ ఒప్పందం ఇది.

## లోపలి పేజీల్లో...


- డి.వి.చట్టం వచ్చిందిలా ... 1
- మచ్చుకు కొన్ని తీర్పులు ... 3

  1. భర్త లేకుంటే మామ, బావగార్లదే బాధ్యత ... 4
  2. నిత్యపెళ్ళికొడుకుల బాధితులకూ డి.వి చట్టం ఊరట ...6
  3. జిందా తిలిస్మాత్‌లా పనిచేసిన డి.వి చట్టం ...8
  4. భర్త హోదాతో సమానంగా బతికేహక్కు ... 10
  5. తండ్రి వేధించేవాడు... డివిఏ ఉపశమనమిచ్చింది ... 12
  6. మాయచేసి ఛాయమయ్యాడు, డివిఏతో ఉపశమనం దొరికింది ... 12

- కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005 (డి.వి. చట్టం) ... 15
- డి.వి చట్టం ప్రకారం వేధింపులు–నిర్వచనాలు ... 21
- అమలు పరిచే యంత్రాంగం పాత్రలు – విధులు ... 35
- ఫిర్యాదు చేసే విధానం–జాగ్రత్తలు ... 45
- కుటుంబ హింస నుంచి రక్షణ కల్పించే కొన్ని ఐ.పి.సి సెక్షన్లు ... 49
- తరచూ తలెత్తే సందేహాలు ... 53
- రక్షణాధికారుల జాబితా ... 63
- నమూనా దరఖాస్తులు ... 67


**శాంతమ్మ కథ**





ఈ చట్టం ఒక్కరోజులో రాలేదు. దాదాపు 15 ఏళ్ళు పైగా చర్చలు, సమావేశాలు, విమర్శలు, భిన్నాభిప్రాయాలు, ఇక కుటుంబాలు ఉండవేమోననే భయాలు వీటన్నిటినీ అధిగమిస్తూ మహిళా ఉద్యమం సాధించుకున్నదే డి.వి చట్టం.

'కుటుంబ హింస' అనే పదం వినడానికే చాలా ఇబ్బందికరంగా ముఖం పెట్టినవారున్నారు. మన భారతదేశంలో కుటుంబాలు చాలా పవిత్రమైనవి. మహిళలను శక్తి స్వరూపిణులుగా పూజిస్తాము. ఇదంతా పాశ్చాత్య సంస్కృతి నుంచి నేర్చుకున్నది. 'బాబ్డ్‌హేర్ మహిళలు' ఎసి గదుల్లో కూర్చుని మాట్లాడే మాటలు, ఇట్లా రకరకాలుగా వాఖ్యానించినవారూ ఉన్నారు.

ఈ బిల్లు చట్టరూపం దాల్చడానికి రెండు ముఖ్య కారణాలు ఉన్నాయి. ఒకటి పట్టణ మహిళలతో పాటుగా గ్రామీణ మహిళలు కూడా ఈ చర్చల్లో పాల్గొని చట్టాన్ని డిమాండ్ చేయడం వలన విమర్శకులకు ఇక అభ్యంతరాలు పెట్టడానికి ఆస్కారం లేకుండా పోయింది. రెండవది హిందూ కుటుంబ వ్యవస్థను అతి పవిత్రంగా భావించి చాలా పతిష్టమైనదిగా చెప్పుకునే బిజెపి (తెరవెనుక ఆర్.ఎస్.ఎస్) ప్రభుత్వ హయాంలోనే బిల్లుగా రూపొందడం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం జరిగింది. దాంతో రాజకీయ వర్గాలలో కూడా దీనికి పెద్దగా అభ్యంతరాలు చెప్పేవారు లేకపోయారు. దీని చర్చను ప్రారంభించి, బిల్లు రూపొందించి, ప్రభుత్వంపైన ఒక పదేళ్ళకాలం పాటు చట్టం కోసం ఒత్తిడి తెచ్చిన 'లాయర్స్ కలెక్టివ్' (లాక్రి) అనే సంస్థ పలు మహిళా సంఘాలను కలుపుని చేసిన కృషి మరిచిపోలేనిది. లాక్రి సీనియర్ న్యాయవాది ఇందిరాజైసింగ్ ఆధ్వర్యంలో ఈ బిల్లు రూపొందింది.


మహిళలంతా ఒక తాటిపై నిలబడి తమకు కావలసిన విధంగా రూపొందించుకున్న చట్టం ఇది. కుటుంబ హింస (నిరోధక) బిల్లు 2000 పట్ల దాదాపు కొన్ని సూచనలతో అందరూ అమోదం తెలుపుతున్న సమయంలో కేంద్రప్రభుత్వం 2002 లో మరొక డ్రాఫ్ట్ ముందుకుతెచ్చింది. అందులో కుటుంబహింస నిర్వచనాన్నే పూర్తిగా మార్చి, మహిళా వ్యతిరేక అంశాలను పెట్టారు. కుటుంబంలోని పురుషుడు తనతో కుటుంబసంబంధంలో ఉన్న మహిళపై హింస జరుపకూడదని చెప్పింది. కాని అంతలోనే పురుషుడు కుటుంబంలోని మహిళను అలవాటుగా కొట్టకూడదని, తన ఆత్మరక్షణ కోసంగాని, ఇతరుల ఆస్తి రక్షణకోసం గాని నిరభ్యంతరంగా కొట్టవచ్చునని లైసెన్స్ ఇచ్చింది. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా నిరసనలు వ్యతిరేక ప్రదర్శనలలో చివరికి ప్రభుత్వం దిగి రాక తప్పలేదు. 2005లో ప్రస్తుత చట్టం అమోదం పొందింది. అక్టోబర్ 2006 నుంచి అమలులోకి వచ్చింది.

ఈ ప్రస్తానం ఇక్కడితో ఆగక చట్ట.. పటిష్టంగా అమలు జరిగేలా చూసే దిశగా ముందుకు సాగుతూవుంది. మిగిలిన చట్టాలు, కొన్ని ఐపిసి సెక్షన్లు ప్రతివాదులకు శిక్షలు వేయించడానికి ఉద్దేశించినవి. ఈ చట్టం మాత్రం మహిళలకు స్వాంతననిచ్చేది. కోర్టు ఉత్తర్వులను ప్రతివాది ఉల్లంఘిస్తేనే శిక్షల అపసరం ఏర్పడుతుంది.



# మచ్చుకు కొన్ని తీర్పులు

# 1. భర్త లేకుంటే మామ, బావగార్లదే బాధ్యత



భర్త మరణించిన మహిళను మెట్టినింటి నుంచి వెళ్ళగొట్టడాన్ని తరచు చూస్తుంటాం. అయితే, భర్త మరణిస్తే ఆమె పోషణ, సంరక్షణ బాధ్యత ఆమె మామగారు, బావగారు చూడాల్సి ఉంటుందని చెబుతూ డి.వి.చట్టం కింద వెలువడిన ఒక తీర్పును పరిశీలిద్దాం..

హైదరాబాద్‌లో రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఒక యువతి, తన భర్త మరణించాక సాంప్రదాయం ప్రకారం పుట్టింటిలో ఒక రోజు నిద్ర చేసి రావడానికి వెళ్ళింది. లాంఛనం పూర్తయ్యాక ఆమె తిరిగి మెట్టినింటికి రాగా మామగారు, బావగారు, ఇతర కుటుంబ సభ్యులు ఆమెను లోనికి రానీయలేదు. పుట్టింటికే పొమ్మని తరిమేశారు. తమ కొడుకు లేడు కాబట్టి కోడలికి ఆ ఇంట్లో స్థానం లేదని తేల్చి చెప్పారు. తండ్రి లేని ఈ బాధితురాలు, భర్త చిన్న ఉద్యోగం చేసి సంపాదించిన కొద్ది మొత్తాన్ని ఆయన తండ్రి స్థలంలో ఇల్లు కట్టడానికే వెచ్చించడం, ఆమెకు ఏమీమిగల్చక పోవడంతో దిక్కులేని స్థితిలో పడింది. కుటుంబంలోని ఏ పురుష బంధువు నుంచి అయినా రక్షణ, భరణం, ఆర్థిక పరిహారం వంటి ఉపశమనాలు పొంద వచ్చని, షేర్డ్ హౌస్‌హోల్డ్ (భాగస్వామ్య నివాస ప్రదేశం, లేదా, కలసి వుండే ఇల్లు)లో కొనసాగే హక్కును సాధించుకోవచ్చని డి.వి.చట్టం చెబుతుంది. ఈ చట్టం కింద తాను భర్త, అత్తమామలతో కలసిఉన్న ఇంటిలో కొనసాగేందుకు, మామ, బావగార్ల వేధింపుల నుంచి రక్షణకోసం, తన నెల వారి పోషణ కోసం ఉత్తర్వులు కావాలని కోరుతూ రక్షణాధికారి ద్వారా హైదరాబాద్ IVవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించింది.

రిటైర్డ్ రైల్వే ఉద్యోగి అయిన మామగారు తన ప్రతివాదనలో ఆమె ఫిర్యాదులోని అంశాలను అసత్యాలుగా పేర్కొనడంతోపాటు తాను 68ఏళ్ళ వృద్ధుడనని, తాను ఆమెను పోషించే స్థితిలో లేనని వాదించారు.

రెండు పక్షాల వాదనలు విన్న మీదట మేజిస్ట్రేటు ఆమెకు షేర్డ్ హౌస్‌హోల్డ్‌లో టాయ్‌లెట్ సదుపాయంతో కూడిన ఒక గదిని ఇవ్వాలని, పిటిషన్ దాఖలైన నాటి నుంచి నెలకు వెయ్యి రూపాయల భరణం ఇవ్వాలని, ఆమె ప్రశాంత జీవనంలో ప్రతివాదులు ఎలాంటి జోక్యం చేసుకోరాదని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

**కేసు నెంబరు :** డివిసి 7 ఆఫ్ 2007

**కోర్టు :** IV వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు, హైదరాబాద్.


**మేజిస్ట్రేట్ :** శ్రీమతి ఎస్.ప్రవీణ

**బాధితురాలి తరపు న్యాయవాది :** కె. సంపూర్ణాదేవి, కె. నారాయణరావు

**ఉత్తర్వు వెలువడిన తేదీ :** జులై 26, 2007.

> "తీర్పు సంతృప్తికరంగా ఉంది. కానీ, మా మామగారు దానిని అమలు చేయట్లేదు. పోలీసులూ సహకరించలేదు. అమలు చేయించుకోవడం గురించి నాకు తెలియడంలేదు".

## 2. నిత్యపెళ్ళికొడుకుల బాధితులకూ డి.వి చట్టం ఊరట



మొదటి పెళ్ళి గురించి దాచిపెట్టో, అబద్ధంచెప్పో రెండోపెళ్ళికి సిద్దమయ్యే ప్రబుద్ధుల వలలోపడే అమాయక మహిళలకు ఇంతకాలం చట్టబద్ధ స్వాంతన లేకపోయేది. మొదటి పెళ్ళి గురించి బయట పడగానే ఈమె పెట్టె సర్దుకుని వెళ్ళి పోవడమో, దిక్కులేని పరిస్థితిలో అఘాయిత్యానికి పాల్పడటమో జరిగేది. అయితే, ఈ 'బంధానికి' కూడా చట్టబద్ధత కల్పించిన తొలిచట్టంగా డి.వి. యాక్ట్ మోసపోయిన మహిళలకు చాలా ఉపశమనాలు కల్పిస్తుంది.

ఈ కేసు రంగారెడ్డి జిల్లాకు సంబంధించినది. 36 ఏళ్ళ మహిళ తన మొదటి భర్త వేధింపులు భరించలేక విడాకులు తీసుకుంది. ఇద్దరు పాపలు, ఒక బాబుతో దర్జీపని చేస్తూకాలం వెళ్ళబుచ్చుతున్న ఈమెకు జీవితంలో ఒకతోడు కావాలనిపించింది. ఒక మ్యారేజ్ బ్యూరోను సంప్రదించింది. భార్యకు విడాకులు ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగం నుంచి రిటైరై ఒంటరిగా ఉన్నానని, వంట చేసిపెడుతూ తనతో జీవితం పంచుకోవడానికి సిద్దంగా ఉన్న మహిళ కోసం ఎదురు చూస్తున్నానని, ఒకాయన చేసుకున్న దరఖాస్తును ఆ బ్యూరోవారు ఆమెకు చూపారు. ఇద్దరూ మాట్లాడుకున్నాక ఎలాంటి ఆడంబరం లేకుండా పెళ్ళి చేసుకుందామని ఆయన ప్రతిపాదించారు. ఎలాగూ ఇంత వయసులో అందర్నీపిలిచి పెళ్ళి పీటలమీద కూర్చోవడం ఇబ్బందికరమని భావించిన ఆమె అందుకు ఒప్పుకుంది. గుళ్ళోపెళ్ళి. గుడులూ, ప్రదేశాలను సందర్శించి కాపురం ప్రారంభించారు.

కొన్ని రోజులకి ఒక మహిళ వీరి ఇంటికివచ్చి ఆమెను తిట్టిపోసింది. తన భర్తపైతాను వేధింపుల కేసు (498 ఎ) నమోదుచేసి, పోరాడుతుండగా ఆయనతో ఈమె రహస్యంగా ఉంటోందని ఆమె నిందించింది. ఈమె పోలీసుస్టేషన్‌కి వెళ్ళి వాకబు చేస్తే 498 ఎ కింద ఆయనపై కేసునడుస్తున్న సంగతి నిజమేనని తేలింది. తాను మోసపోయానని ఆమె గుర్తించింది. న్యాయంకోసం పోలీసుల్ని ఆశ్రయిస్తే మొదటి భార్య ఉండగా అతను

చేసుకున్న రెండోపెళ్ళి చెల్లదు కాబట్టి ఆమెకి అతనితో ఉన్న వివాహసంబంధానికి చట్టబద్ధత లేదని తేల్చి చెప్పారు. బైగమి (ద్విభార్యాత్వం) కింద కేసుపెడతారని భయపడిన అతను, తనను నమ్మాలని, అవసరమైతే ఆమె పేరకొంత డబ్బును బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తానని ఆమెకు నచ్చజెప్పి, 2.5 లక్షల రూపాయలు ఇచ్చాడు. ఆమె ఆడబ్బును బ్యాంకులో డిపాజిట్ చేసుకున్న కొద్దిరోజులకే ఇంకో మహిళ వచ్చి మళ్ళీ ఈమెపై విరుచుకుపడింది. ఆయన చట్టబద్ధంగా తనను పెళ్ళి చేసుకున్నాడని, ఈమె కాపురం చేయడం అన్యాయమని ఆమె గొడవ చేసింది.

తన పరిస్థితి మరింత దయనీయంగా మారడంతో, ఈమె అతనికి దూరంగా ఉండటం ప్రారంభించింది. అయితే, ఆమె పేరిట ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్ సొమ్మును ఇస్తే మొదటి ఇద్దరు భార్యలను "వదిలించుకుని" వస్తానని ఆశచూపి అతను ఆ డబ్బులు తీసుకుని వెళ్ళడమేకాక, వేరుగా ఉంటున్న సమయంలో తన సెక్స్ కోరికలు, తీర్చాలని ఆమెను వత్తిడి చేయడం, కొట్టడం, మానసికంగా, లైంగికంగా వేధించడం చేశాడు. తరచు ఆమె నిస్సహాయురాలు అయ్యేది. ఇదే సమయంలో "భర్త" కళ్ళు ఎదిగిన తన కూతుళ్ళమీద కూడా పడుతున్నాయని గుర్తించిన ఆమెకు అప్పుడే అమలులోకి వచ్చిన కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం ఒక ఆధారంలా కనిపించింది.

ఈచట్టంకింద నియమితులైన రంగారెడ్డి జిల్లా రక్షణ అధికారిని ఆమె ఆశ్రయించింది. ఆమెపై జరిగిన మానసిక, ఆర్థిక, శారీరక వేధింపులను ధృవీకరిస్తూ రక్షణాధికారి కుటుంబ సంఘటన నివేదిక (డిఐఆర్)ను రంగారెడ్డి జిల్లా కోర్టుకు సమర్పించారు.

వాదనలు విన్నతర్వాత మేజిస్ట్రేట్ ఈమెకు నాలుగు లక్షల రూపాయల నష్టపరిహారం, భర్తవేధింపుల నుంచి రక్షణ మంజూరు చేయడంతోపాటు, అతనితో కలసివున్న ఇంటిలో (షేర్‌డ్ హౌస్‌హోల్డ్) ఉండే హక్కును కూడా ఈ చట్టం కింద ఆమెకు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.

డి.వి. చట్టం అమలులోకి వచ్చాక రాష్ట్రంలో మొట్టమొదటి తీర్పు ఈమె కేసులోనే వెలువడటం ఒక సంచనలమైతే, ఒక పురుషుడితో కలసివున్న బంధాన్ని చట్టబద్ధంగా గుర్తించిన మొదటి కేసుగా కూడా ఇది చరిత్రాత్మకమైంది. మహిళపై జరిగే నాలుగు రకాల మానసిక, శారీరక, లైంగిక, ఆర్థిక–హింసలను ఒకే కేసులో గుర్తించడం కూడా మరోముఖ్యాంశం.


**కేసు నెంబరు :** డివిసి 5 ఆఫ్ 2007

**కోర్టు :** III వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు, రంగారెడ్డి జిల్లా

**మేజిస్ట్రేట్ :** శ్రీమతి రోజారమణి

**బాధితురాలి తరపు న్యాయవాది :** పి. సరళ

# 3. జిందా తిలిస్మాత్‌లా పనిచేసిన డి.వి చట్టం



ఆమె కేంద్ర ప్రభుత్వశాఖ ఉద్యోగి, దాదాపు 20 ఏళ్ళక్రితం పెళ్ళయింది, పెళ్ళయిన ...లోపే బాధలు మొదలయ్యాయి. బ్యాంకులో పని చేసే భర్త తన జీతం లాక్కోవడం, ...బ్బుకోసం వేధించడం, కొట్టడం, నలుగురిలో తిట్టడం భరించలేక 1990లో మహిళా ...స్టేషన్‌ని ఆశ్రయించింది. వేధింపుల కేసు (498 ఎ-ఐపిసి) కోసం ఫిర్యాదు దాఖలు చేసింది. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిస్తే భర్త తాను చేసిన తప్పులన్నిటినీ ఒప్పుకున్నాడు. ఇకపై ఇలాంటి తప్పులు చేయనని, తన వల్ల ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తానని లిఖిత పూర్వక హామీ ఇచ్చి ఆమెను మళ్ళీ కాపురానికి తీసుకువెళ్ళాడు. ఈలోగా ఆమె ఇద్దరు పిల్లల్ని (బాబు, పాప) ప్రసవించింది. భర్త సొంత ఇల్లు కూడా కొన్నాడు. ఇంటిని తనపేర కొన్నాడుగానీ, బ్యాంకు రుణం కోసం ఆమెను కో-అప్లికెంట్‌గా చేర్చాడు.

సొంత ఇంటిలో చిన్న కాపురం సజావుగా సాగుతోందనుకుంటున్న సమయంలో ఆయన ఓ రోజు ఆమెలో కొత్త ఆలోచన పుట్టించాడు. "నీ సంస్థ వాళ్ళు నీకు క్వార్టర్ ఇస్తారుకదా, మనం అందులోకి మారదాం. "ఈ ఇంటిని కిరాయికి ఇస్తే, ఆ డబ్బులతో మరింత సుఖంగా బతకవచ్చు" అని ఆయన చేసిన ప్రతిపాదన ఆమెకి "మెరుగైన జీవితం" మీద ఆశలు కలిగించాయి. వెంటనే ఆమె తన కార్యాలయంలో దరఖాస్తు చేయడం, క్వార్టర్ మంజూరుకావడం, మకాం అందులోకి మార్చడం జరిగిపోయాయి.

అ తర్వాత ప్రతినెల ఆమె సొంత ఇంటినుంచి రావాల్సిన అద్దె గురించి ప్రస్తావించడం, "అద్దె వసూలు చేశా.... బ్యాంక్‌లోన్ కట్టాను" అని ఆయన చెప్పడం ఒక లాంఛనంగా జరిగేది. అయినా, జీవితంలో మెరుగుదలలూ, మార్పులూ ఏమీ సంభవించలేదామెకి.

ఏడాది తర్వాత కిరాయికి ఉన్నవాళ్ళు తమ ఇంటిని ఎలా ఉంచుతున్నారోచూడాలని ఆమెకి ఒక రోజుకోరిక కలిగింది. ఆఫీసునుంచి ఇంటికి వెడుతూ ఆమె ఆ ఇంటికి వెళ్ళింది. తాళం వేసిఉన్న ఇంటిలో ఒకటిరెండు కుర్చీలు, చాప లాంటి చాలా తక్కువ సామానే కనిపించాయి. పక్కింటి వారిని అడిగితే "అద్దెకి ఎక్కడిచ్చారు? మీ భర్త గారు, మీపాత పనిమనిషి ఇందులోనే ఉంటున్నారు కదా?" అని వాళ్ళు వాపోవడం, ఈమె ఖంగుతినడం,

విషయం తెలిసిన భర్తగారు ఇంటికి రోజూ రావడాన్ని తగ్గించడం వరుసక్రమంతో జరిగిపోయాయి.

గతంలో వేధింపుల కేసుపై పుట్టింటివారి ఇష్టానికి వ్యతిరేకంగా రాజీపడినందున తనకి ఇప్పుడు ఎవరి అండా లేదని, ఒంటరి దానినని నిస్పృహలోకి వెళ్ళిపోయిన ఆమె చాలా రోజుల తర్వాత ఒక లాయర్‌ని సంప్రదించింది. లాయర్ సహాయంతో మైనర్ పిల్లలిద్దరి భరణం కోసం కోర్టులో కేసుదాఖలు చేసింది. సమన్లు అందుకున్నా భర్త కోర్టుకి రాకపోవడం, బ్యాంకులో నిరవధికంగా సెలవుపై వెళ్ళడం, అడ్రస్ తెలియకుండా పోవడంతో, పిల్లలిద్దరికీ తలకు 2,500 రూపాయల వంతున నెలవారీ భరణాన్ని మంజూరు చేస్తూ ఫ్యామిలీకోర్టు ఎక్స్-పార్టీ ఉత్తర్వులు జారీచేసింది. అయినా ఉత్తర్వులు అమలు కాలేదు.

అప్పుడే కొత్తగా అమలులోకి వచ్చిన కుటుంబ హింసనుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005 ఆమెకి ఒక ఆశాకిరణంలా కనిపించింది. తాను భర్తతో కలసివున్న ఇంటిలో (షేర్‌డ్ హౌస్‌హోల్డ్) కలసివుండే హక్కు కావాలంటూ డి.వి. చట్టం కింద ఆమె భర్త, భర్త అన్నగారిని బాధ్యులుగా చేసి కేసువేసింది.

భర్త అన్నగారిని కూడా బాధ్యులను చేయడంతో ఇద్దరూ గత్యంతరం లేక కోర్టు వాయిదాలకి హాజరయ్యారు. అయితే, ఆమెకు అతని నుంచి వేధింపులు ఎదురైంది డి.వి. చట్టం అమలులోకి రాకముంధు కాబట్టి, ఈ చట్టం వర్తించదని వారితరపు న్యాయవాది వాదించగా, "షేర్డ్ హౌస్‌హోల్డ్" (కలసివున్న ఇల్లు) నిర్వచనం కింద ఈ కేసు చెల్లుతుందని ఆమె తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. విచారణ పూర్తయింది, తీర్పు వెలువడాల్సివుంది. ఈలోగా బ్యాంకు వాయిదాలు కట్టనందుకు ఆ ఇంటిని బ్యాంకు వాళ్ళు వేలానికి పెట్టారు.

పరిస్థితులు ఎలా ఉన్నా, కోర్టును తప్పించుకు తిరుగుతున్న భర్తను, ఆయన సోదరుడితో సహా కోర్టుకు రప్పించడం, డి.వి. చట్టం వల్లనే సాధ్యమైందన్న సంతృప్తిని ఆమె వ్యక్తం చేసింది. ఈ చట్టాన్ని ఉపయోగించుకోకపోతే అటు పిల్లల భరణమూ వచ్చేదికాదు, భర్త ఇంటిలో కలసివుండే హక్కూ వచ్చేదికాదు. అంతేకాదు ఇప్పుడతను పిల్లలకు భరణం చెక్కులను నెలనెలా ఠంచనుగా ఇస్తున్నాడు.

**కేసు నెంబరు :** డివిసి 2 ఆఫ్ 2007

**కోర్టు :** X మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, సికింద్రాబాద్.

**మేజిస్ట్రేట్ :** శ్రీమతి రోజారమణి

**బాధితురాలి తరపు న్యాయవాదులు :** యం.ఎ. వనజ, మంజులావాణి

> **"ఆయన పథకం ప్రకారమే నడిచి నన్ను, పిల్లల్ని కష్టాలలో పడేశారు. డి.వి. చట్టం వల్ల ఆయనని, ఆయన అన్నగారిని కోర్టుకి తేగలిగాను. పాత కేసుకూ ఇది ఉపయోగపడింది".**

# 4. భర్త హోదాతో సమానంగా బతికేహక్కు



భర్తతో కలసివున్నపుడు మహిళ ఏ సాంఘిక, ఆర్థిక హోదాతో జీవిస్తుందో, ఆయనతో ఎడబాటు సమయంలో కూడా అంతే స్థాయి జీవనాన్ని సాగించే హక్కును డి.వి. చట్టం కల్పించింది.

**ఈ కోణంలో ఒక తీర్పును పరిశీలిద్దాం.**

ఈ కేసులో మహిళకు 2000 సంవత్సరంలో పెళ్ళయిన నాటినుంచే వేధింపులు మొదలయ్యాయి. అయినా సర్దుకుంటూ 2001 జూలై కల్లా వేధింపు పెరుగుతూ పోవడంతో పుట్టింటికి వెళ్ళిపోయింది. చాలా సార్లు రాజీప్రయత్నాలు జరిగాయిగానీ, సఫలం కాలేదు. చివరికి 2004 నవంబర్‌లో ఆమె ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌కు ఫిర్యాదు చేసింది. ఇక్కడ ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇవ్వగా, 2005 ఫిబ్రవరి నుంచి మళ్ళీ కలసివుండటం ప్రారంభించారు. కొద్దిరోజులకి అతని ఉద్యోగం కోసం లండన్ వెళ్ళారు. అక్కడ ఆమె గర్భం దాల్చింది. సహాయం అవసరమని అతను తన తల్లిదండ్రులనే లండన్ రప్పించుకున్నాడు. అక్కడ ప్రసవం అయ్యేలోగా ఆమెను వేధింపులకు గురిచేయడంతో పాటు, 10లక్షల రూపాయల అదనపు కట్నం తీసుకురావాలని వేధించారు. పథకం వేసి అతను తల్లిదండ్రుల్ని స్వదేశానికి పంపేశాడు. 2006 ఏప్రిల్‌లో ఈ దంపతులు కూడా తమ మగపిల్లవాడిని తీసుకుని హైదరాబాద్ వచ్చేశారు. ఆమెను, బాబుని ఆమె పుట్టింటిలో దింపిన భర్త, మళ్ళీ ఆమెను చూడటానికి రాలేదు, ఫోన్లు చేస్తే తీయడం మానేశాడు. చివరికి తన ఆచూకీ కూడా తెలియకుండా మకాం మార్చాడు.

దీనితో ఆమె 2006 డిసెంబర్‌లో డి.వి. చట్టం కింద రక్షణాధికారికి ఫిర్యాదు చేసింది. ఎల్.బి.నగర్ కోర్టులో కుటుంబ సంఘటన నివేదిక దాఖలైంది. అత్తమామలను కూడ ప్రతివాదులుగా చేర్చింది.

వాదప్రతివాదనలు విన్నాక, మేజిస్ట్రేట్ ఈమెకు, బాబుకి మూడు ఉపశమనాలు కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆమెకు ఎలాంటి వేధింపులు ఎదురుకారాదని, భర్తతో కలిసివుంటే ఎంతటి స్థాయిలో ఉండేదో అదేస్థాయికి తగిన ఇంటిలో ఆమెను ఉంచాలని, లేదా, అంతకు సరిపడ అద్దెను అతను చెల్లించాలని, భార్య, కొడుకులిద్దరికీ కలిపి నెలకు 10,000 రూపాయలను నెలవారి ఖర్చులకింద చెల్లించాలని మేజిస్ట్రేట్ ఆదేశించారు. డి.వి. చట్టంలోని 18,19,20,21 సెక్షన్ల కింద ఆమెకు ఈ ఉపశమనాలు మంజూరయ్యాయి.

కాగా, ఈ మహిళకు ఎదురైన వేధింపులకు ఆమె భర్తే తప్ప, అత్తమామల పాత్ర కనిపించలేదని అభిప్రాయం వ్యక్తం చేస్తూ మేజిస్ట్రేట్ వారిని ప్రతివాదులుగా తొలగించారు.

**కేసు నెంబరు :** డివిసి 1 ఆఫ్ 2007

**కోర్టు :** III మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు, ఎల్.బి.నగర్.

**మేజిస్ట్రేట్ :** శ్రీమతి ఎన్. రోజారమణి

**బాధితురాలి తరపు న్యాయవాదులు :** ఎన్.ఆర్. భగవాన్

**ఉత్తర్వు వెలువడిన తేదీ :** ఫిబ్రవరి 26, 2007.

> **"మగవాళ్లు చాలా ప్లాన్డ్‌గా ఉంటారు. ఊహించని రీతిలో మోసం చేస్తారు. అయితే ఈ చట్టం ప్రకారం న్యాయం జరిగింది. నెలకు భరణం రావటం, ఇల్లు ఉండడం వల్ల ఒంటరిగా బతకగలనని ధైర్యం వచ్చింది."**

## 5. తండ్రి వేధించేవాడు... డివిఎ ఉపశమనమిచ్చింది

అపాపకి 13 ఏళ్ళు. పుష్పవతై కొద్దినెలలైంది. అప్పటి నుంచి తండ్రి కళ్ళు ఆమెపై పడ్డాయి. నమ్మడానికి కూడా వీల్లేని ఈ పరిణామం, తండ్రి ఆపిల్లకు "నేను స్నానం చేయిస్తా" ననే వరకు వెళ్ళింది. తల్లిచాటుగా ఆమెని తాకడం, తల్లిలేనపుడు ఆమెను బాత్రూంలోకి తీసుకువెళ్ళి స్నానం చేయించడాన్ని భరించలేక చివరికి తల్లికి చెప్పుకుంటే మిగతా ప్రపంచంలాగే ఆమె కూడా నమ్మలేదు. దిగమింగుకుంటూ భరిస్తున్న ఆ చిన్నారి, ఒక రోజు తన పదేళ్ళ చెల్లిపై కూడా తండ్రి కన్నుపడటాన్ని గమనించింది. దిక్కులేక ఎదురింటి ఆంటీకి చెప్పింది. ఆమె ఈ బాలిక తల్లిని పిలిపించి, విషయం వివరించడంతో పాటు తల్లిగా అప్రమత్తంగా ఉండాలని హితవు చెప్పింది.

చాటుగా కొంత మేరకు విషయం గమనించిన తర్వాత తల్లి తన కూతురు ఫిర్యాదు నిజమని అర్థంచేసుకుంది. రెండో కూతుర్ని అతని బారి నుంచి రక్షించడానికి తల్లీకూతుళ్ళు పొరుగింటి మహిళ ఒక రాత్రంతా జాగారం చేశారు. మర్నాడు ఉదయమే మలక్‌పేట పోలీసు స్టేషన్‌కి వెళ్ళి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ ఏడాది మార్చి 29న ఐపిసి 498ఎ, 354 సెక్షన్ల కింద తండ్రిపై కేసు నమోదు చేశారు. దీనితోపాటు, కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం (డి.వి.యాక్ట్) కింద కూడా అతని వేధింపుల నుంచి రక్షణ కోరుతూ రక్షణాధికారికి ఫిర్యాదు చేయవచ్చని పోలీసులు సలహా ఇచ్చారు.

తల్లీ కూతుళ్ళు హైదరాబాద్ రక్షణాధికారి వద్దకు వెళ్ళి గోడు వినిపించారు. ఈ కేసు డిఐఆర్ (డొమెస్టిక్ ఇన్సిడెంట్ రిపోర్ట్) తయారు చేసే బాధ్యతను రక్షణాధికారి, సర్వీస్ ప్రొవైడర్‌గా సేవలందిస్తున్న సన్నిహిత సెంటర్ ఫర్ విమెన్' కు అప్పగించారు.

డిఐఆర్‌ను కోర్టులో దాఖలు చేస్తూ, తండ్రి నుంచి రక్షణ కావాలని, అతను తమ ఇంటికి రాకుండా ఆదేశాలు కావాలని, ఆయన తమకు కలిగించిన వేదనకు 50 వేల రూపాయల పరిహారం కావాలని పిల్లల తరపున తల్లి దరఖాస్తు చేశారు.

ఇంటికి వెళ్ళవద్దని అతనికి ఆంక్షలు విధించడంతోపాటు, కూతురికి 5,000 రూపాయల పరిహారం చెల్లించాలని కోర్టు అతనిని ఆదేశించింది. టెలిఫోన్‌బూత్ నుంచి వచ్చే ఆదాయం అతని భార్య తీసుకుంటుంది.

**కేసు నంబరు :** డివిఎ / ఆఫ్ 2007
**కోర్టు :** VII అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు కోర్టు, హైదరాబాద్
**జడ్జి :** శ్రీ వెంకట ప్రసాద్
**తీర్పు తేదీ :** జూలై 6, 2007

> "ఎదిగిన ఆడపిల్లను తండ్రి లైంగిక వేధింపుల నుంచి కాపాడుకోవడానికి నాకీచట్టం ఉపయోగపడింది."

# 6. మాయచేసి మాయమయ్యాడు, డివిఏతో ఉపశమనం దొరికింది

ఆమె ఓ ప్రైవేటు స్కూలు ఉద్యోగిని. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలోని నాలుగో తరగతి ఉద్యోగితో సుమారు 23 ఏళ్ళ క్రితం పెళ్ళయింది. వీళ్ళకి ఒక అబ్బాయి. హైదరాబాద్‌లో ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఉండేవారు.

ఆమె 2003లో ఒక రోజు తన పుట్టింటికి వెళ్ళడానికి బయలుదేరితే, భర్త ఆమెను దింపడానికి బస్టాండ్‌కి వచ్చి, "మెడలో నగలెందుకు, ఇంట్లో దాచిపెట్టివెళ్ళు" అని చెప్పాడు. ఆమె సరేనని, వాటిని ఒలిచి భర్త చేతిలో పెట్టింది.

రెండురోజుల తర్వాత ఆమె తిరిగి హైదరాబాద్ వచ్చే సరికి ఇల్లు తాళం వేసివుంది. అతని ఆఫీసుకి వెళ్ళి అడిగితే రెండ్రోజుల నుంచి రావట్లేదని చెప్పారు. అతను ఒక బ్యాగు, కొన్ని సామాన్లు తీసుకువెడుతుంటే చూశామని పొరుగింటి వాళ్ళొకరు చెప్పారు. ఇంట్లోని బీరువాలో ఆమె నగలు, మూడు వేల రూపాయల నగదు కూడా అదృశ్యమయ్యాయి. అంతకు ముందు ఆమె స్థలం కొనమని డబ్బిస్తే అతని పేరుతో ఒకటి, కొడుకు పేరుతో ఒకటిగా కొన్న స్థలాల డాక్యుమెంట్లు కూడా మాయం అయ్యాయి.

ఆరా తీస్తే, అతను మరో మహిళతో సాన్నిహిత్యం ఏర్పరచుకుని, ఆమెతో బెంగుళూరు వెళ్ళాడని తెలిసింది. ఎలాగో అతన్ని పట్టుకుంటే, "నువ్వూ ఇక్కడికి వచ్చెయ్" అని చెప్పాడు. "నువ్వు నాకు సరిపోయినట్టు ఉండవు, తక్కువ స్థాయిదానివి" అని అంతకుముందూ, ఇప్పుడూ కూడా తిట్టాడు. ఉద్యోగం, పిల్లవాడి చదువు వదులుకుని బెంగుళూరుకు మకాం మార్చడానికి ఇష్టంలేని ఆమె, అతనిని వెనక్కి తెచ్చేందుకు ప్రయత్నిస్తుండగా, అతను రెండు సార్లు వచ్చి రెండు ప్లాట్లను అమ్మేసి వెనక్కి వెళ్ళిపోయాడు. ఉద్యోగం పోయే పరిస్థితి వచ్చేసరికి స్వచ్ఛంద పదవీవిరమణ (విఆర్ఎస్) కోసం దరఖాస్తు చేశాడు. అధికారులు అతనికి 'కంపల్సరీ రిటైర్‌మెంట్' వర్తింపజేశారు.

ఆమె అభ్యర్థన మేరకు అధికారులు అతని ' రిటైర్మెంట్ బెనిఫిట్స్ ' ని కొంతకాలం నిలుపు చేశారు. చివరికి 2007 జనవరి చివరిలోగా ఆమె కోర్టు నుంచి ఆదేశాలేవైనా తెచ్చుకోకపోతే అతనికి రావలసిన సొమ్మంతటినీ అతనికి చెల్లించేస్తామంటూ అధికారులు హెచ్చరిక జారీ చేశారు.


డివి చట్టం కింద ఉపశమనం కావాలంటూ ఆమె రక్షణాధికారిని ఆశ్రయించింది. రక్షణాధికారి సూచనల మేరకు (ఆ ప్రాంతంలోని) సర్వీస్ ప్రొవైడర్ డిఐఆర్‌ను రూపొందించి ప్రొటక్షన్ ఆఫీసర్‌కి ఇచ్చారు.

అతనికి వచ్చే ' రిటైర్మెంట్ బెనిఫిట్స్ ' లో ఆమెకూ వాటా ఇవ్వాలని కోర్టు నేరుగా ఎన్ఐఎన్‌కు ఆదేశాలు జారీచేసింది. ఆమెకు ఎంత ఇవ్వాలన్నది ఇంకా నిర్ణయించవలసి ఉంది.

కేసు నంబరు : ఎంపి 425 ఆఫ్ 2007
కోర్టు : IV అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు కోర్టు, హైదరాబాద్
జడ్జి : శ్రీమతి ఎస్. ప్రవీణ

**" చట్టం బావుంది, తీర్పు సరిగానే ఉంది. కానీ, అమలు విషయంలో ఎవరికీ అవగాహన లేదనిపిస్తోంది. అమలు చేసే అధికారులలో మహిళల సమస్యలు, పరిస్థితుల పట్ల అవగాహన ఉండేలా చేస్తే ఈ చట్టం నిజంగా ఆలంబనగా నిలుస్తుంది".**

# కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005 (డి.వి. చట్టం)



# కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005

## చాప్టర్ - I

***1-. ఈ చట్టం పేరేమిటి ?***

కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005.

***2. దీని పరిధి ఏమిటి?***

జమ్మూకాశ్మీర్ రాష్ట్రం మినహా భారతదేశం మొత్తానికి వర్తిస్తుంది.

***ఈ చట్టం ఎప్పటినుంచి అమలులోకి వచ్చింది ?***

2006 అక్టోబర్ 26 నుంచి.

***ఈ చట్టంలోని ముఖ్యమైన నిర్వచనాలు ఏమిటి ?***

(a) 'బాధితురాలు' అంటే, ఒకవ్యక్తితో కుటుంబ సంబంధంలో ఉండి, ప్రతివాదిచేత కుటుంబ హింసకు గురయ్యానని ఆరోపించే ఏ మహిళ అయినా.

(b) పిల్లలు అంటే 18ఏళ్ళ లోపువారెవరైనా, దత్తత ద్వారా, సవతి బిడ్డగా లేదా సంరక్షణలో ఉన్న పిల్లలు.

(c) "పరిహార ఉత్తర్వు" అంటే ఈ చట్టంలోని సెక్షన్ 22 ప్రకారం జారీ చేసే ఉత్తర్వు.

(d) "అధీన (కస్టడీ) ఉత్తర్వు" అంటే, సెక్షన్ 21 ప్రకారం జారీ చేసే ఉత్తర్వు.

(e) "కుటుంబ సంఘటన నివేదిక" అంటే, కుటుంబ హింస జరిగినట్లు బాధితురాలు ఇచ్చే ఫిర్యాదుపై నిర్ణీత పత్రం (ఫాం)లో తయారు చేసే నివేదిక.

(f) 'కుటుంబ సంబంధం' అంటే జన్మత: లేదా రక్త సంబంధం, వివాహం, పెళ్ళి తరహా సంబంధం, దత్తత, లేదా ఉమ్మడి కుటుంబంగా కలసి ఉండే కుటుంబ సభ్యుల ఒకే ఇంట్లో ప్రస్తుతం కలసి ఉన్న లేదా, గతంలో కలసి ఉన్న ఇద్దరి మధ్య సంబంధం.

(g) "కుటుంబ హింస"కు, ఈ చట్టంలోని సెక్షన్ 3లో ఇచ్చిన నిర్వచనమే వర్తిస్తుంది.

(h) "వరకట్నం" అంటే, వరకట్న నిషేధ చట్టం, 1961లోని సెక్షన్ 2లో వివరించిన ప్రకారమే వర్తిస్తుంది.

(i) 'మేజిస్ట్రేట్' అంటే, బాధితురాలు ప్రస్తుతం నివసించే ప్రదేశం, ఇతర విధంగాగాని, ప్రతివాది నివసించే ప్రదేశం లేదా కుటుంబ హింస జరిగినట్లు చెప్పే ప్రదేశపు పరిధిపై క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 పరిధికలిగి ఉన్న ఒకటవ తరగతి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ లేదా, పరిస్థితినిబట్టి, మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్.

(j) 'వైద్య సదుపాయం' అంటే, ఈచట్టం ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవల నిమిత్తం గుర్తించే వైద్యసేవల కేంద్రం.

(k) "ఆర్థిక ఉపశమనం" అంటే, కుటుంబ హింసవల్ల బాధితురాలికి జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు, అయిన ఖర్చులను భరించేందుకు ఈ చట్టం కింద దాఖలైన దరఖాస్తుననుసరించి, కేసు విచారణ సమయంలో ఎప్పుడైనా, బాధితురాలికి పరిహారం చెల్లించమని ప్రతివాదికి మేజిస్ట్రేట్ జారీ చేసే ఆదేశం.

(l) 'నోటిఫికేషన్' అంటే, అధికార గెజిట్‌లో ప్రచురించే ఒక నోటిఫికేషన్ (ప్రకటన).

(m) 'నిర్దేశిత' అంటే, ఈచట్టం కింద రూపొందించిన నిబంధనల ప్రకారం 'నిర్దేశించిన' విధంగా.

(n) 'రక్షణాధికారి' అంటే, ఈ చట్టంలోని సెక్షన్ 8, సబ్ – సెక్షన్ (1) కింద రాష్ట్రప్రభుత్వం నియమించే అధికారి.

(o) 'రక్షణ ఉత్తర్వు' అంటే, సెక్షన్ 18 కింద జారీచేసిన ఒక ఉత్తర్వు.

(p) 'నివాస ఉత్తర్వు' అంటే, సెక్షన్ 19లోని సబ్ – సెక్షన్ (1) కింద మంజూరు చేసే ఉత్తర్వు.

(q) ప్రతివాది' అంటే, బాధితురాలితో కుటుంబ సంబంధం కలిగి ఉండి, ఏ మేజర్ పురుషునికి వ్యతిరేకంగానయితే బాధిత మహిళ ఉపశమన ఉత్తర్వులు కోరారో, వారు.

(r) 'సేవలందించేవారు' అంటే, ఈచట్టం సెక్షన్ 10లోని సబ్ – సెక్షన్ (1) కింద నమోదు చేసుకున్న ఏ సంస్థ అయినా.

(n) 'కలసి ఉన్న ఇల్లు' అంటే, బాధితురాలు కుటుంబ సంబంధం ద్వారా ఒంటరిగాగాని, లేదా, ప్రతివాదితో కలసిగాని జీవిస్తున్న లేదా గతంలో జీవించిన ఇద్దరి సొంత లేదా అద్దె ఇల్లు, లేదా వారిద్దరికీ లేదా, ఇద్దరిలో ఎవరికైనా దానిపై ఉమ్మడిగాలేదా ఒక్కరే హక్కు లేదా, అధికారం లేదా వాటా కలిగి ఉన్న ఇల్లు – లేదా, ప్రతివాది కుటుంబపు ఉమ్మడి ఆదాయం – ప్రతివాదికి లేదా, బాధితురాల్ని ఆ ఇంటిలో హక్కు, ప్రయోజనం లేదా అధికారం ఉందా, లేదా అనే దానితో సంబంధం లేకుండా.

(t) 'షెల్టర్ హోం' అంటే, ఈ చట్టం ప్రయోజనాలకోసం 'షెల్టర్‌హోం'గా రాష్ట్రప్రభుత్వం ప్రకటించే ఏషెల్టర్ హోం అయినా.

## చాప్టర్ - II

## కుటుంబ హింస

**3. కుటుంబ హింసకు నిర్వచనం ఏమిటి?**

ఈ చట్టం కింద, ఈ కింది ఫలితాలను కలిగించే ప్రతివాది చర్యలేవైనా కుటుంబ హింస కిందికి వస్తాయి :

(a) బాధితురాలి ఆరోగ్యం, భద్రత, శరీరభాగం, సంక్షేమం, – శారీరకంగాగాని, మానసికంగాగాని – హాని లేదా గాయం కలిగించడం, లేదా, అలా చేసేందుకు ఉద్యుక్తులు కావడం, భౌతిక, లైంగిక, మాటలు, భావోద్వేగ, ఆర్థిక దుర్వినియోగం. లేదా,

(b) చట్టవిరుద్ధంగా కట్నం, లేదా, ఇతర ఆస్తి, లేదా, విలువైన వస్తువులకోసం ఆమెను లేదా ఆమెకి సంబంధించిన వ్యక్తిని లొంగదీసుకోవడం కోసం ఆమెకు హాని చేయడం, వేధించడం, లేదా బెదిరించడం, లేదా,

(c) క్లాజ్ (ఎ) లేదా క్లాజ్ (బి) ఉదహరించిన ఏ విధంగానైనా, బాధితురాలిని, లేదా, ఆమెకు సంబంధించిన వారిని బెదిరించడం, లేదా,

(d) బాధితురాలికి మరే ఇతర విధంగానైనా శారీరక, లేదా, మానసిక గాయం, లేదా, హాని కలిగించడం.

వివరణ : ఈ సెక్షన్ కోసం :

(i) **'శారీరక హింస' అంటే ఏమిటి?**

శరీరానికి నొప్పి, హాని, ప్రాణహాని, శరీర భాగానికి హాని, లేదా ఆరోగ్యానికి హాని లేదా, బాధితురాలి ఆరోగ్యాన్ని లేదా అభివృద్ధిని విఘాతపరచడం వంటి నష్టం కలిగించే ఏ ప్రవర్తన (చర్య) అయినా.....దౌర్జన్యం, నేరపూరిత చొరబాటు, నేరపూరిత శక్తి ప్రయోగం.

(ii) **'లైంగిక హింస' అంటే ఏమిటి?**

మహిళకు ఇబ్బంది కలిగించే, అవమానపరిచే, కించపరిచే లేదా ఏవిధంగానైనా ఆమె గౌరవానికి భంగం కలిగించే ఏదైనా లైంగిక చర్య.

(iii) **మాటల, భావోద్రేక హింస అంటే ఏమిటి?**

(a) అవమానాలు, హేళన, చిన్నబుచ్చడం, మారుపేర్లతో పిలవడం, ప్రత్యేకించి పిల్లలులేని తనాన్నో, మగపిల్లలు లేని తనాన్నో అవమానించడం లేదా హేళన చేయడం.

(b) బాధితురాలికి ఇష్టమైన వ్యక్తికి శారీరక నొప్పి కలిగిస్తానని అదేపనిగా బెదిరించడం.

(iv) **ఆర్థిక హింస అంటే ఏమిటి?**

(a) ఏదేని చట్టప్రకారం, లేదా, సాంప్రదాయం ప్రకారం, లేదా, కోర్టు ఉత్తర్వు ప్రకారం, లేదా, మరే ఇతర విధంగా బాధితురాలికి ఉన్న ఆర్థిక, నగదు హక్కును ఆమెకు దక్కకుండా చేయడం (నిరాకరించడం), లేదా, బాధితురాలు ఆమెపిల్లల కుటుంబ అవసరాలకు – వీటికి మాత్రమే పరిమితం కాకుండా ఇతర అవసరాలకు కూడా – కావలసిన డబ్బును స్త్రీధనం, బాధితురాలు ఒక్కరే లేదా బాధితురాలూ, ప్రతివాది ఇద్దరూ ఉమ్మడిగా కలిగి ఉన్న ఉమ్మడి ఆస్తిని, లేదా వారు కలసి ఉండే ఇంటి అద్దెను, కుటుంబ నిర్వహణ వ్యయాన్ని ఆమెకు ఇవ్వక పోవడం.

(b) బాధితురాలు సంబంధం ఉన్న, లేదా, కుటుంబ సంబంధం ద్వారా ఆమెకి కూడా చెందిన, లేదా, బాధితురాలికి, ఆమె పిల్లలకి న్యాయబద్ధంగా అవసరం ఉండే ఇంటివస్తువులు, స్థిర చర ఆస్తులు, విలువైన వస్తువులు, షేర్లు, సెక్యూరిటీలు, బాండ్లు, వగైరా, ఇతర ఆస్థులు, స్త్రీధనం, బాధితురాలి సొంత, లేదా ఉమ్మడి ఆస్థి ఏదైనా విక్రయించడం :

(c) బాధితురాలు కలసివుండే ఇంటితో సహా హక్కుఉన్న వనరులు, సదుపాయాలను ఉపయోగించుకోనీయక పోవడం లేదా పరిమితులు విధించడం.

## చాప్టర్ - III

## రక్షణాధికారుల, సేవలందించేవారి అధికారాలు, విధులు

**4. రక్షణాధికారికి సమాచారం ఎలా? సమాచారం ఇచ్చినవారిపై బాధ్యతలేమిటి?**

(1) ఒక కుటుంబ హింసా సంఘటన కొంతకాలంగా జరుగుతూ ఉందనిగాని, ప్రస్తుతం జరుగుతోందని గాని, లేదా, జరిగే అవకాశం ఉందని గాని విశ్వసించడానికి తగిన కారణంకలిగిన వ్యక్తి, ఆ సమాచారాన్ని సంబంధిత రక్షణ అధికారికి ఇవ్వవచ్చు.

(2) మంచి ఉద్దేశంతో సబ్–సెక్షన్(1) కింద సమాచారం ఇచ్చే ఏవ్యక్తిపైనా సివిల్ లేదా క్రిమినల్ పరమైన బాధ్యతలేవీ ఉండవు.

**5. పోలీసు అధికారులు, సేవలందించే వారు, మేజిస్ట్రేట్ల విధులు:-**

కుటుంబ హింస గురించి ఫిర్యాదు అందుకున్న లేదా, సంఘటన జరిగిన ప్రదేశంలో ఉన్నా, లేదా, సంఘటన గురించి తనకు సమాచారం అందినపుడు, పోలీసు అధికారి, రక్షణాధికారి, సేవలందించేవారు లేదా మేజిస్ట్రేటు, బాధితురాలికి ఈ కింది విషయాలు తెలియజేయాలి :

(a) రక్షణ ఉత్తర్వు, ఆర్థిక ఉపశమనం కోసం ఉత్తర్వు, పిల్లల కస్టడీ ఉత్తర్వు, ఇంటిలో ఉండేందుకు ఉత్తర్వు, పరిహారం ఉత్తర్వులలో ఏవైనా లేదా ఒకటికంటే ఎక్కువ ఉత్తర్వుల ద్వారా ఉపశమనం పొందవచ్చని ;

(b) సేవలందించే వారిసేవల గురించి,

(c) రక్షణాధికారి సేవల గురించి,

(d) లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం, 1987 కింద ఆమెకు ఉచిత న్యాయసేవలు అందుతాయని,

(e) అవసరమైతే, భారత శిక్షాస్మృతి (ఐపిసి)లోని సెక్షన్ 498 ఎ కింద ఆమెకు ఫిర్యాదు చేసుకునే హక్కు ఉందని.

ఒక కాగ్నిజబుల్ నేరం జరిగినపుడు, చట్టప్రకారం చర్యతీసుకోవలసిన బాధ్యత నుంచి పోలీసు అధికారిని విముక్తి చేసేలా ఈ చట్టంలోని దేనినీ తప్పుగా అర్థంచేసుకునే వీలులేదు.

**6. షెల్టర్ హోంల విధులు ఏమిటి?**

బాధితురాలికి ఆశ్రయం కావాలని కోరుతూ ఒక బాధితురాలు, లేదా, ఆమెతరపున రక్షణాధికారి, లేదా, సేవలందించేవారు షెల్టర్‌హోం ఇన్‌ఛార్జికి దరఖాస్తు చేస్తే, ఇన్‌ఛార్జి ఆమెకు విధిగా ఆ హోంలో ఆశ్రయం కల్పించాలి.

**7. వైద్య సేవల కేంద్రాల విధులు ఏమిటి?**

బాధితురాలు, లేదా, ఆమెతరపున రక్షణాధికారి లేదా సేవలందించేవారు ఆమెకు వైద్య సహాయం కావాలని కోరుతూ వైద్య సేవల కేంద్రానికి దరఖాస్తు చేస్తే, ఆ ఇన్‌ఛార్జి ఆమెకు విధిగా వైద్య సహాయం అందించాలి.

**8. రక్షణాధికారులు ఎలా నియమితులవుతారు?**

(1) ప్రతిజిల్లాలో అవసరమైనంత మంది రక్షణాధికారులను, ప్రభుత్వం నిర్ణయించిన సంఖ్యలో, ఒక నోటిఫికేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది, ఈ చట్టం కింద ఏ ప్రాంతంలో / ప్రాంతాలలో విధులు నిర్వర్తిస్తారో ప్రకటిస్తుంది.

(2) రక్షణాధికారులు వీలైనంత వరకు మహిళలై ఉండాలి, నిర్దేశించిన అర్హతానుభవాలు కలిగి ఉండాలి.

(3) రక్షణాధికారి, వారికింది సిబ్బంది సర్వీసు నిబంధనలను రూపొందించాలి.

**9. రక్షణాధికారుల విధులు ఏమిటి?**

(a) ఈ చట్టం కింద మేజిస్ట్రేట్ బాధ్యతలను నిర్వర్తించడంలో సహకరించాలి.

(b) ఒక కుటుంబ హింస జరిగినట్లు ఫిర్యాదు అందగానే, కుటుంబ సంఘటన నివేదికను తయారుచేసి, మేజిస్ట్రేట్‌కి నివేదించాలి, వాటి నకళ్ళను సంబంధిత ప్రాంత పోలీసు స్టేషన్‌కు, సర్వీస్ ప్రొవైడర్‌కి పంపాలి.

(c) బాధితురాలు కోరిన ఉపశమనాల ప్రకారం రక్షణ ఉత్తర్వుల జారీకోసం మేజిస్ట్రేట్‌కి తగిన విధంగా దరఖాస్తు చేయాలి.

(d) లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం, 1987 ప్రకారం బాధితురాలికి న్యాయ సహాయం అందేలా చూడాలి, ఫిర్యాదులు చేయడానికి నిర్దేశించిన దరఖాస్తులు ఉచితంగా అందేలా ఏర్పాటు చేయాలి.

(e) మేజిస్ట్రేట్ పరిధిలోని ప్రాంతాలలో న్యాయసేవలు, కౌన్సెలింగ్, ఆశ్రయం, వైద్యసేవలు అందించేవారి జాబితాను నిర్వహించాలి.

(f) బాధితురాలు కోరితే సురక్షితమైన షెల్టర్‌హోంలో ఆమెకు ఆశ్రయం కల్పించి, అలా ఆశ్రయం కల్పించిన వివరాల నివేదికను స్థానిక పోలీస్ స్టేషన్, మేజిస్ట్రేట్‌కి అందజేయాలి.

(g) బాధితురాలికి శరీరంపై గాయాలైతే, ఆమెకు వైద్య పరీక్షలు జరిపించి, వైద్యపరీక్షల నివేదికను కుటుంబ హింస జరిగిన ప్రాంతంపై పరిధిలో ఉన్న మేజిస్ట్రేట్‌కీ, పోలీసు స్టేషన్‌కీ పంపాలి.

(h) సెక్షన్ 20 కింద జారీ అయిన ఆర్థిక ఉత్తర్వు సిఆర్‌పిసి, 1973 ప్రకారం నిర్దేశించిన పద్ధతిలో అమలయ్యేలా చూడాలి.

(i) నిర్దేశించిన ఇతర విధులను నిర్వర్తించాలి.

(2) రక్షణాధికారి మేజిస్ట్రేట్ నియంత్రణ, పర్యవేక్షణలో ఉంటారు. మేజిస్ట్రేట్, ప్రభుత్వం ఇద్దరూ ఈ చట్టం కింద తనపై మోపిన బాధ్యతలను నిర్వర్తించాలి.

**10. సర్వీస్ ప్రొవైడర్లు ఎవరు?**

(1) న్యాయ సహాయం, వైద్య, ఆర్థిక లేదా మరే ఇతరమైన చట్టబద్ధ మార్గాల ద్వారా మహిళల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించడం కోసం సొసైటీల రిజిష్ట్రేషన్ చట్టం, 1860 కింద రిజిష్టర్ అయిన స్వచ్ఛంద సంస్థలు, కంపెనీల చట్టం, 1956 కింద లేదా అమలులో ఉన్న మరే ఇతర చట్టం కింద రిజిష్టర్ అయిన కంపెనీలు ఈ చట్టం కింద సర్వీస్ ప్రొవైడర్లుగా నమోదు చేసుకోవచ్చు.

(2) సబ్ – సెక్షన్ (1) కింద రిజిష్టర్ అయిన సేవలందించే వారికి ఈ కింది అధికారులు ఉంటాయి :

(a) బాధితురాలు కోరితే, కుటుంబ హింస సంఘటన నివేదికను నిర్ణీత రూపంలో తయారు చేసి, సంఘటన జరిగిన ప్రాంతంపై అజమాయిషి ఉన్న మేజిస్ట్రేట్‌కి, రక్షణాధికారికి పంపాలి.

(b) బాధితురాలికి వైద్యపరీక్షలు జరిపించి, మెడికల్ రిపోర్టు కాపీని సంఘటన జరిగిన ప్రాంత రక్షణాధికారికి, పోలీసు స్టేషన్‌కి పంపాలి.

(c) బాధితురాలు కోరితే, ఆమెకు ఒక షెల్టర్ హోంలో ఆశ్రయం లభించేలా చూడాలి, షెల్టర్ హోంలో ఆమెను చేర్చిన విషయమై నివేదికను కుటుంబ హింస సంఘటన జరిగిన ప్రాంత పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలి.

(3) ఈ చట్టం కింద కుటుంబ హింసను నిరోధించడానికి మంచి ఉద్దేశంతో ఏపని చేసినా, చేయబోయినా, సేవలందించే సంస్థ లేదా ఆసంస్థ సభ్యులపై ఏవిధమైన దావాలు, ప్రాసిక్యూషన్, మరే ఇతర చట్టపరమైన చర్యలు తీసుకునే వీలు లేదు.

**11. ప్రభుత్వ విధులు ఏమిటి?**

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలు, ఈకింది విధంగా చూసేందుకు అవసరమైన అన్నిచర్యలూ తీసుకోవాలి :

(a) టెలివిజన్, రేడియో, పత్రికలలో తరచుగా ప్రచారం చేయడం ద్వారా ఈ చట్టం గురించి విస్తృత ప్రచారం చేయాలి.

(b) ఈ చట్టంలోని అంశాలపై పోలీసు అధికారులు, న్యాయసేవల సభ్యులతో సహా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులకు క్రమపద్ధతిలో శిక్షణ, అవగాహన కల్పించాలి.

(c) న్యాయ శాఖ, హోం శాఖ, శాంతిభద్రతలు, ఆరోగ్యం, మానవ వనరులు, సంబంధిత మంత్రిత్వశాఖలు కుటుంబహింసకు సంబంధించి అందించే సేవల మధ్య ప్రభావవంతమైన సమన్వయం ఏర్పరచి, క్రమపద్ధతిలో సమీక్షలు జరిగేలా చూడాలి.

(d) ఈ చట్టంకింద మహిళలకు సేవలందించేందుకు వివిధ మంత్రిత్వ శాఖలు, కోర్టులన్నిటిలో ప్రొటోకాల్స్ రూపొంది, అమలయ్యేలా చూడాలి.

## ఉపశమన ఉత్తర్వులు పొందే విధానం

**12. మేజిస్ట్రేట్‌కి దరఖాస్తు ఎలా చేయాలి?**

(1) బాధితురాలు, లేదా ఆమెతరపున రక్షణాధికారి లేదా మరే ఇతర వ్యక్తి అయినా, ఈ చట్టం కింద ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఉపశమనాల కోసం మేజిస్ట్రేట్‌కి దరఖాస్తు చేయవచ్చు.

ఈ దరఖాస్తుపై ఉత్తర్వులు జారీ చేసేముందు, మేజిస్ట్రేట్, రక్షణాధికారి నుంచి లేదా సేవలదించే వారినుంచి కుటుంబ సంఘటన నివేదికను పరిగణనలోకి తీసుకోవాలి.

(2) సబ్-సెక్షన్ (1) కింద కోరే ఉపశమనాలలో, ప్రతివాది (బాధ్యుడు) కుటుంబ హింసకు పాల్పడటం వల్ల బాధితురాలికి కలిగిన గాయాలకు నష్టపరిహారం లేదా పరువు నష్టం (కాంపెన్సేషన్ / డామేజస్) కోసం ఆవ్యక్తి (బాధితురాలు) దావా వేయడానికి గల హక్కు పట్ల ముందస్తు అభిప్రాయమేమిలేకుండా, నష్టపరిహారం లేదా పరువునష్టం చెల్లింపు కోసం ఉత్తర్వుకావాలని కూడా దరఖాస్తు చేయవచ్చు.

బాధితురాలికి అనుకూలంగా పరిహారం లేదా నష్టం మొత్తాన్ని చెల్లించడానికి ఏదైనా కోర్టు డిక్రీ జారీ చేసి ఉంటే, ఈ చట్టం కింద మేజిస్ట్రేట్ జారీ చేసిన ఆదేశం ప్రకారం పరిహారంనష్టం మొత్తాన్ని చెల్లించినా లేక చెల్లించవలసి ఉన్నా, ఈ మొత్తాన్ని, డిక్రీలోని

మొత్తం నుంచి మినహాయించి, సిఆర్‌పిసి, 1908 లేదా ప్రస్తుతం అమలులో ఉన్న మరే ఇతర చట్టం నిర్దేశాలతో ప్రమేయం లేకుండా, ఇంకా ఏమైనా మిగిలి ఉంటే, ఆ సొమ్మును వసూలు చేయించేలా డిక్రీని అమలు చేయాలి.

(3) సబ్-సెక్షన్ (1) కింద ప్రతి దరఖాస్తు నిర్ణీత పత్రంలో, లేదా, దానికి వీలైనంత దగ్గరగా ఉండాలి.

(4) దరఖాస్తు కోర్టుకి అందిన నాటినుంచి సాధారణంగా మూడు రోజులు దాటకుండా విచారణ (హియరింగ్) తేదీని మేజిస్ట్రేటు నిర్ణయించాలి.

(5) సబ్‌సెక్షన్ (1) కింద వచ్చే ప్రతి దరఖాస్తును తొలి హియరింగ్ నుంచి 60 రోజులలోగా పరిష్కరించేందుకు మేజిస్ట్రేట్ కృషి చేయాలి.

**13. నోటీసులు ఎలా జారీ చేస్తారు?**

(1) సెక్షన్ 12 కింద నిర్ణయించిన విచారణ తేది నోటీసును మేజిస్ట్రేటు రక్షణాధికారికి అందించాలి, రక్షణాధికారి నిర్దేశించిన మార్గంలో దానిని ప్రతివాదికి లేదా ప్రతివాది తరపు వారికి, మేజిస్ట్రేట్ నిర్దేశించిన ప్రకారం అది అందిన నాటినుంచి, గరిష్ఠం రెండురోజులలో అందేలా చేయాలి, లేదా మేజిస్ట్రేటు మంజూరు చేసిన వ్యవధిలోపు అందించాలి.

(2) నిర్దేశించిన ప్రకారం నోటీసును అందజేసినట్లు రక్షణాధికారి దాఖలు చేసే ధృవీకరణ (డిక్లరేషన్) ప్రకటనే బాధ్యునికి లేదా, ఆయన తరపు వ్యక్తికి జారీచేసినట్లు రుజువు.

**14. కౌన్సెలింగ్ చేస్తారా?**

(1) ఈ చట్టం కింద కార్యక్రమాలు జరుగుతున్న ఏదశలోనైనా మేజిస్ట్రేటు, బాధితురాలిని గాని లేదా బాధ్యుడిని గాని లేదా ఇద్దరినీ నిర్దేశిత అర్హతలు, అనుభం కలిగిన సర్వీస్ ప్రొవైడర్ వద్ద కౌన్సెలింగ్‌కి వెళ్ళాలని ఆదేశించవచ్చు.

(2) సబ్-సెక్షన్ (1) కింద మేజిస్ట్రేటు ఆదేశాలు జారీ చేసి ఉంటే, తదుపరి విచారణ తేదీని రెండునెలల లోపు నిర్ణయించాలి.

**15. సంక్షేమ నిపుణుల పాత్ర ఏమిటి?**

ఈ చట్టం కింద ఏ చర్య తీసుకోవడంలోనైనా, మేజిస్ట్రేటు తన విధులను నిర్వర్తించడంలో, కుటుంబ సంక్షేమం కోసం పని చేసే వ్యక్తి, వీలైనంతవరకు మహిళ బాధితురాలికి సంబంధం ఉన్నా, లేకపోయినా – సహాయం తీసుకోవచ్చు.

**16. రహస్య (ఇన్ కెమెరా) విచారణ చేస్తారా?**

ఇన్‌కెమెరా విచారణ జరపడం అవసరమని పరిస్థితుల దృష్ట్యా మేజిస్ట్రేటు భావించినా, లేక, ఫిర్యాది, ప్రతివాదిలలో ఏ ఒక్కరు అలా కోరినా, ఈ చట్టం కింద విచారణను ఇన్‌కెమెరాగా నిర్వహించవచ్చు.

**17. కలసి ఉండే ఇంటిలో నివశించే హక్కు ఉందా?**

(1) ప్రస్తుతం అమలులో ఉన్న మరే ఇతర చట్టంతోని వేటితో ప్రమేయం లేకుండా, కుటుంబ సంబంధంలో ప్రతి మహిళకు, ఆ ఇంటిపై ఆమెకు హక్కు, టైటిల్, లబ్ది ప్రయోజనం ఉన్నా లేకున్నా, ఆ ఇంటిలో నివశించే హక్కుఉంది.

(2) చట్టం నిర్దేశించిన ప్రకారం, బాధితురాలు ప్రతివాదిచే ఇంటి నుంచి, దానిలోని ఏ భాగం నుంచి కూడా, గెంటివేయబడకూడదు, మినహాయించబడకూడదు.

**18. రక్షణ ఉత్తర్వులు ఎలా ఉంటాయి?**

బాధితురాలు, ప్రతివాది వాదనలు వినిపించుకునే అవకాశం ఇచ్చాక, కుటుంబ హింస జరిగిందని లేదా, జరిగేందుకు అవకాశం ఉందని ప్రాథమిక సాక్ష్యాలతో మేజిస్ట్రేటుకు విశ్వాసం కలిగితే, బాధితురాలికి అనుకూలంగా రక్షణ ఉత్తర్వులు జారీ చేసి ప్రతివాదిని ఈ కింది విధంగా ఆదేశించ వచ్చు.

(a) ఎలాంటి కుటుంబ హింసకు పాల్పడరాదు

(b) కుటుంబ హింస చర్యలకు పాల్పడటాన్ని ప్రేరేపించరాదు, నెరవేర్చరాదు.

(c) బాధితురాలి ఉద్యోగతావులో ప్రవేశించరాదు, బాధితురాలు చిన్నపిల్ల అయితే, ఆమె పాఠశాలకు లేదా ఆమె తరచు వెళ్ళే ప్రదేశానికి వెళ్ళరాదు.

(d) ఏ రూపంలోనూ – వ్యక్తిగతంగా, మాటల ద్వారా, లిఖిత పూర్వకంగా, ఎలక్ట్రానిక్ రూపంలో లేక టెలిఫోన్ ద్వారా బాధితురాలితో మాట్లాడే ప్రయత్నం చేయరాదు.

(e) మేజిస్ట్రేటు అనుమతి లేకుండా ఆస్తులు అమ్మడం, ఇద్దరూ లేదా బాధితురాలు ఒక్కరే లేదా ప్రతివాది ఒక్కరే నిర్వహించే బ్యాంక్ ఎకౌంట్, బ్యాంక్ లాకర్‌లను, ఆమె స్త్రీధనంతో సహా ఇద్దరి పేరున నిర్వహించే లేదా ఇద్దరూ వేర్వేరుగా నిర్వహించే వాటిని ఉపయోగించరాదు.

(f) బాధితురాలికి కుటుంబ హింస నుంచి సహాయం అందించిన ఎవరికీ, ఆమెపై ఆధారపడిన వారికి, ఇతర బంధువులకు హింస కలిగించరాదు.

(g) రక్షణ ఉత్తర్వులో పేర్కొన్న మరే ఇతర చర్యకూ పాల్పడరాదు.

**19. నివాస ఉత్తర్వులు పొందేది ఎలా?**

(1) సెక్షన్ 12 లోని సబ్–సెక్షన్ (1) కింద దరఖాస్తును పరిష్కరించేటపుడు, మేజిస్ట్రేటు, కుటుంబ హింస జరిగిందని విశ్వసిస్తే, నివాస ఉత్తర్వులను జారీ చేయవచ్చు.

(a) కలసి ఉండే ఇంటిని బాధితురాలి నుంచి లాగేసుకోకుండా, ఆమె స్వాధీనం నుంచి మరే ఇతర విధంగాను బాధితురాలిని కలసిఉన్న ఇంటిలో ఇబ్బందికి గురిచేయకుండా ప్రతివాదిని – ఆయనకు ఆ ఇంటిపై చట్టపరమైన, సమానమైన హక్కు ఉన్నా లేకున్నా – నివారించాలి.

(b) కలసి ఉన్న ఇంటినుంచి ప్రతివాదే కదలివెళ్ళిపోవాలని ఆదేశించాలి.

(c) బాధితురాలు ఉండే ఇంటిలోని ఏభాగంలోనూ ప్రతివాది లేదా ఆయన బంధువులెవరూ ప్రవేశించకుండా నిరోధించాలి.

(d) కలసి ఉండే ఇంటిని ఇచ్చివేయడం, అమ్మేయడం, లేదా దానిని ఆక్రమించుకోవడం నుంచి నివారించాలి.

(e) మేజిస్ట్రేట్ అనుమతిలేకుండా, కలసి ఉండే ఇంటిపై తన హక్కును ప్రతివాది ప్రకటించుకోరాదు.

# కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ నిబంధనలు, 2006

(ముఖ్య నిబంధనలు)

ఈ నిబంధనలు 2006 అక్టోబర్ 26న అమలులోకి వస్తాయి.

2(b) ఫిర్యాదు అంటే, రక్షణాధికారికి, ఏవ్యక్తి అయినా మౌఖికంగా లేదా లిఖితపూర్వకంగా అందించే ఆరోపణ.

(c) 'కౌన్సిలర్' అంటే – చట్టంలోని సెక్షన్ 14 (1) కింద కౌన్సిలింగ్ ఇవ్వడానికి అధికారం కలిగిన. 'సర్వీస్ ప్రొవైడర్' సభ్యులు

**3. రక్షణాధికారుల అర్హతలు, అనుభవం :**

(i) రాష్ట్ర ప్రభుత్వం నియమించే రక్షణాధికారులు ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర సంస్థలకు చెంది ఉండవచ్చు. మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

(2) రక్షణాధికారిగా నియమితులైన వారికి సామాజిక రంగంలో కనీసం మూడేళ్ళ అనుభవం ఉండాలి.

(3) రక్షణాధికారి పదవీకాలం కనీసం మూడేళ్ళు.

(2) ఈ చట్టం, నిబంధనల ప్రకారం పని చేయడానికి అవసర మైన కార్యాలయ సహకారాన్ని ప్రభుత్వం రక్షణాధికారికి కల్పించాలి.

**4. రక్షణాధికారికి సమాచారం :**

(1) ఏదైనా కుటుంబ హింస జరుగుతూ ఉందని గాని, జరిగిందనిగాని, జరగబోతోందనిగాని నమ్మేందుకు తగిన కారణం ఉన్న ఏ వ్యక్తి అయినా రక్షణాధికారికి ఈ సమాచారాన్ని మౌఖికంగా లేదా లిఖితపూర్వకంగా తెలియ జేయవచ్చు.

(2) ఒకవ్యక్తి సమాచారాన్ని మౌఖికంగా ఇస్తే, రక్షణాధికారి దానిని లిఖితరూపంలో మలచి, సమాచారం ఇచ్చిన వ్యక్తి సంతకం తీసుకోవచ్చు. అయితే, లిఖితపూర్వక సమాచారం ఇచ్చేపరిస్థితిలో లేని వ్యక్తి నుంచి, వారి గుర్తింపు వివరాలను తీసి రికార్డులలో భద్రపరచుకోవాలి.

తాను నమోదు చేసిన సమాచారం ఒక కాపీని సమాచారం అందించిన వ్యక్తికి రక్షణాధికారి ఉచితంగా అందించాలి.

**5. కుటుంబహింస సంఘటన నివేదిక (డొమెస్టిక్ ఇన్సిడెంట్ రిపోర్ట్) :**

(1) కుటుంబ హింసకు సంబంధించిన ఒక సంఘటన జరిగినట్టు ఫిర్యాదు అందగానే, రక్షణాధికారి ఫామ్–1 లో కుటుంబ హింస సంఘటన నివేదికను తయారు చేసి దానిని మేజిస్ట్రేటుకి సమర్పించడంతో పాటు, సంబంధిత ప్రాంత పోలీసు స్టేషన్‌కు, సర్వీస్ ప్రొవైడర్‌కు కాపీలు పంపాలి.

(2) బాధితురాలు కోరితే, సర్వీస్ ప్రొవైడర్ ఫామ్–1లో కుటుంబ హింస సంఘటన నివేదికను తయారు చేసి, సంబంధిత ప్రాంత మేజిస్ట్రేట్‌కి, రక్షణాధికారికి కాపీలు పంపాలి.

**6. మేజిస్ట్రేటుకి దరఖాస్తు :**

(1) బాధితురాలు సెక్షన్ 12 ప్రకారం చేసే ప్రతి దరఖాస్తు ఫామ్-11లో, లేదా దీనికి సాధ్యమైనంత దగ్గరగా ఉండాలి.

(2) సబ్ - రూల్ (1) కింద దరఖాస్తు తయారు చేసి, సంబంధిత మేజిస్ట్రేటుకు పంపడానికి బాధితురాలు రక్షణాధికారి సహాయం తీసుకోవచ్చు.

(3) బాధితురాలు నిరక్షరాశ్యురాలైతే, రక్షణాధికారి దరఖాస్తును ఆమెకు చదివి వినిపించాలి, వివరించాలి.

(4) సెక్షన్ 23లోని సబ్-సెక్షన్ (2) కింద చేయాల్సిన అఫిడవిట్‌ను ఫామ్-111లో దాఖలు చేయాలి.

(5) సెక్షన్ 12 కింద దరఖాస్తులను, వాటిపై ఉత్తర్వులను క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 లోని సెక్షన్ 125 ప్రకారం నిర్వహించాలి.

**7. ఎక్స్‌పార్టీ ఉత్తర్వుల కోసం అఫిడవిట్ :**

ఎక్స్‌పార్టీ ఉత్తర్వుల కోసం సెక్షన్ 23 (2) కింద అఫిడవిట్లన్నీ ఫామ్-111లో నింపాలి.

**8. రక్షణాధికారుల విధులు, కార్యక్రమాలు :**

(i) బాధితురాలు ఫిర్యాదు చేయాలని కోరితే, ఫిర్యాదు చేయడంలో సహకరించాలి.

(ii) బాధితురాలికి ఈ చట్టంలో కల్పించిన హక్కులను, ఫామ్ -IV లో తెలిపినవిధంగా - ఇంగ్లీషు లేదా స్థానిక భాషలో తెలియజేయాలి.

(iii) ఈ చట్టం సెక్షన్ 12, లేక 23 (2) ప్రకారం, లేదా మరే ఇతర దరఖాస్తులు చేసుకోవడానికి సహాయం చేయాలి.

(iv) బాధితురాలికి పొంచివున్న ప్రమాదాన్ని అంచనా వేశాక, సెక్షన్ 12 కింద దరఖాస్తు చేశాక, ఆమెను సంప్రదించి, ఆమెపై ఇంకా హింస కొనసాగకుండా చూసేందుకు 'భద్రతా ప్రణాళిక' (సేఫ్టీ ప్లాన్)ను తయారు చేయాలి.

(v) రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా బాధితురాలికి న్యాయ సహాయం అందించాలి.

(vi) బాధితురాలికి, ఆమె పిల్లలకి ఒక వైద్యసేవల కేంద్రంలో వైద్య సహాయం అందించాలి, ఈకేంద్రానికి వెళ్ళేందుకు రవాణా సదుపాయం కల్పించాలి.

(vii) బాధితురాలు, ఎవరైనా పిల్లలు పునరావాస స్థలానికి వెళ్ళేందుకు రవాణా సదుపాయం కల్పించాలి.

(viii) ఈ చట్టం అమలుకు సేవలు అందించడానికి పేర్లు నమోదు చేయించుకున్న సంస్థలకు వారి సేవలు అవసరమైతే చెప్పాలి, ఈ చట్టంలోని సెక్షన్ 14 (1) ప్రకారం కౌన్సిల ర్లుగా లేదా సెక్షన్ 15 ప్రకారం సంక్షేమ నిపుణుల (వెల్ఫేర్ ఎక్స్‌పర్ట్స్) నియామకం కోసం తమ సభ్యుల వివరాలు పంపాలని సర్వీస్ ప్రొవైడర్లను ఆహ్వానించాలి.

(ix) కౌన్సిలర్లుగా నియామకం కోసం వచ్చిన దరఖాస్తులలో ఎంపిక చేసిన వాటిని మేజిస్ట్రేట్ కి పంపాలి.

(x) మూడేళ్ళ కొకసారి కౌన్సిలర్ల జాబితాను సవరించి, కొత్త జాబితాను మేజిస్ట్రేట్‌కి పంపాలి.

(xi) ఫిర్యాదు చేసినందుకు బాధితురాలు వేధింపులకు, వత్తిడులకు గురికాకుండా సాధ్యమైన అన్ని సహాయాలను అందించాలి.

(xii) బాధితురాలు / బాధితులు, పోలీసులు, సేవలు అందించే వారి మధ్య సమన్వయకర్తగా పనిచేయాలి.

2(a) బాధితులను కుటుంబ హింస నుంచి ఈ చట్టం, ఈ నిబంధనల ప్రకారం రక్షించాలి.

(b) బాధితురాలిపై హింస పునరావృతం కాకుండా ఈ చట్టం, నిబంధనల ప్రకారం అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలి.

**9. అత్యవసర పరిస్థితులలో తీసుకోవలసిన చర్య :**

ఒక బాధితురాలి నుంచి లేదా, ఎవరైనా ఒక వ్యక్తి, కుటుంబ హింస జరుగుతూ ఉందని గాని, జరగబోతున్నదనిగాని నమ్మకంగా టెలిఫోన్ లేదా ఇ-మెయిల్ ద్వారా రక్షణాధి కారికి గాని లేక సేవలు అందించేవారికి గాని సమాచారం అందిస్తే, వారు వెంటనే పోలీసుల సహాయం తీసుకుని సంఘటనా స్థలానికి వెళ్ళి సంఘటన నివేదిక తయారు చేయాలి, దానిని ఈచట్టం కింద తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మేజిస్ట్రేట్‌కు వెంటనే అందజేయాలి.

**10. రక్షణాధికారి ఇతర విధులు :**

మేజిస్ట్రేటు లిఖితపూర్వకంగా ఆదేశిస్తే, రక్షణాధికారి,

(a) ఎక్స్‌పార్టీ ఆదేశాలు జారీ చేయడం కోసం స్పష్టతకై కోర్టుకోరితే, భాగస్వామ్య కుటుంబ ప్రదేశాన్ని (ఇంటిని) సందర్శించాలి.

(b) తగిన విచారణ జరిపాక, ఆదాయం, ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, ఇతర డాక్యుమెంట్లపై నివేదికను కోర్టులో దాఖలు చేయాలి.

(c) బాధితురాలికి కుటుంబంలోని తన భాగాన్ని కానుకలు, నగలతో సహా ఆమెకు చెందిన అన్ని వస్తువులను ఆమెకు స్వాధీనం చేయించాలి.

(d) కోర్టు ఆదేశించిన ప్రకారం బాధితురాలు తన పిల్లలను తన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి, ఆయన పర్యవేక్షణలో ఉన్న వారిని కలవడానికి హక్కును పొందడంలో సహాయం చేయాలి.

(f) ఆరోపించబడిన కుటుంబ హింసా సంఘటనలో ఏదైనా ఆయుధాన్ని ఉపయోగించి ఉంటే, దానిని స్వాధీనం చేసుకోవడానికి పోలీసుల సహాయం తీసుకోవాలి.

**12. నోటీసుల జారీ విధానం :**

(1) ఈ చట్టం కింద కోర్టులో హాజరు కావాలని జారీ చేసే నోటీసులలో, కుటుంబ హింసకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల పేర్లు, వారు పాల్పడిన కుటుంబ హింస, ఆ వ్యక్తులను గుర్తించేందుకు అవసరమైన ఇతర వివరాలు ఉండాలి.

**(2) నోటీసులను ఈ కింది పద్ధతులలో జారీ చేయాలి :**

(a) ఈ చట్టంకింద నోటీసులను ఫిర్యాదుదారు లేదా బాధితురాలు తెలిపిన ప్రకారం భారతదేశంలోని ప్రతివాది ఇంటి చిరునామాకు లేదా, వారు పని చేసే కార్యాలయం

చిరునామాకు రక్షణాధికారి తరపున, రక్షణాధికారి, లేదా, వారు అధీకరించిన ఎవరైనా నోటీసులు పంపాలి.

(b) నోటీసులకు ఆ సమయంలో ఆప్రదేశానికి ఇన్‌ఛార్జిగా ఉన్న వ్యక్తి ఇవ్వాలి, అలా ఇవ్వడం సాధ్యం కానపుడు, ఆ ప్రాంగణంలో బాగా కనిపించే ప్రదేశంలో అతికించాలి.

(c) ఈచట్టం సెక్షన్ 13 లేదా, మరే ఇతర వెసులుబాటు ప్రకారం నోటీసులను సిఆర్‌పిసి, 1908లోని చాప్టర్-V లేదా సిఆర్‌పిసి, 1973లోని చాప్టర్ -VI లలో ఏది వీలైతే దాని ప్రకారం జారీ చేయాలి.

(3) ప్రతివాది హాజరు కావడానికి నిర్ణయించిన తేదీన ఒక ప్రకటన లేదా, నోటీసులు జారీ చేయడానికి అధీకరించిన వ్యక్తి సమర్పించే నివేదికపై, ఫిర్యాదుదారు, లేదా, ప్రతివాది, లేదా, ఇద్దరివాదనలు విన్నమీదట కోర్టు మధ్యంతర సహాయం (రిలీఫ్) కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుపై ఉత్తర్వులు జారీ చేయాలి.

(4) భాగస్వామ్య గృహంలోకి ప్రతివాది ప్రవేశాన్ని నిషేధిస్తూగానీ, ప్రతివాదిని దూరంగా ఉండమని గానీ, బాధితురాలితో కలవరాదని గాని రక్షణ ఉత్తర్వులు జారీ అయితే, బాధితురాలు ప్రతివాదిని ఆహ్వానించినా చెల్లుబాటుకాదు - కోర్టుజారీ చేసిన నిషేధ ఆదేశాలను రక్షణ ఉత్తర్వులలో సెక్షన్ 25 (2) కింద సవరిస్తే తప్ప.

**5. రక్షణ ఉత్తర్వుల ఉల్లంఘన :**

(1) బాధితురాలు, రక్షణ ఉత్తర్వుల, మధ్యంతర రక్షణ ఉత్తర్వుల పై రక్షణాధికారికి ఫిర్యాదు చేయవచ్చు.

(2) సబ్-రూల్ (1) ప్రకారం చేసే ప్రతి ఫిర్యాదు లిఖిత పూర్వ కంగా ఉండాలి, బాధితురాలి సంతకం ఉండాలి

(3) రక్షణాధికారి, ఈ ఫిర్యాదు నకలును, ఉల్లంఘనకు గురైనట్లు ఆరోపించిన రక్షణ ఉత్తర్వు నకలుకు జతచేసి, తగిన ఆదేశాలు కోసం మేజిస్ట్రేట్‌కి పంపాలి.

(4) బాధితురాలు కావాలనుకుంటే, రక్షణ ఉత్తర్వు లేదా మధ్యంతర రక్షణ ఉత్తర్వు ఉల్లంఘనపై నేరుగా మేజిస్ట్రేట్‌కి లేదా పోలీసులకి ఫిర్యాదు చేయవచ్చు.

(5) రక్షణ ఉత్తర్వులు ఉల్లంఘన జరిగిన తర్వాత ఎప్పుడైనా, బాధితురాలు కోరితే, రక్షణాధికారి వెంటనే పోలీసుల సహాయంతో ఆమెను రక్షించాలి, స్థానిక పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంలో సహకరించాలి.

(6) సెక్షన్ 31 కింద, లేదా, ఇండియన్ పీనల్‌కోడ్, 1860లోని సెక్షన్ 498ఎ కింద, లేదా, మరే ఇతర నేరంకింద అయినా మొత్తంగా విచారించడానికి వీలులేని విధంగా ఆరోపణలను రూపొందిస్తే, కోర్టు అలాంటి నేరాలను సిఆర్‌పిసి, 1973 కింద విచారించడం కోసం వేరుచేసి, సెక్షన్ 31 కింద రక్షణ ఉత్తర్వుల ఉల్లంఘనను సిఆర్‌పిసి, 1973లోని చాప్టర్ XXI ప్రకారం విచారణకు స్వీకరించాలి.

(7) ఈకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయడానికి ప్రతివాది లేదా ఆయన తరపున వ్యవహరించే మరెవరైనా నిరాకరిస్తే, దానిని ఈ చట్టం కింద జారీ అయిన రక్షణ ఉత్తర్వు, లేదా మధ్యంతర రక్షణ ఉత్తర్వు ఉల్లంఘనగా పరిగణించాలి.

(8) రక్షణ ఉత్తర్వు లేదా మధ్యంతర రక్షణ ఉత్తర్వు ఉల్లంఘనను వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలి, దీనిని సెక్షన్ 31, 32 కింద నిర్దేశించిన విధంగా కాగ్నిజబుల్ నేరంగా పరిగణించి చర్యతీసుకోవాలి.

(9) ఈ చట్టం కింద అరెస్ట్ అయిన వ్యక్తిని బెయిల్‌పై విడుదల చేసేటపుడు, బాధితురాలిని రక్షించడం కోసం, నిందితుడు కోర్టులో హాజరయ్యేలా చేసేందుకోసం, కోర్టు కింది షరతులను ఉత్తర్వుల రూపంలో విధించాలి :

(a) నిందితుడు కుటుంబ హింసకి పాల్పడటం లేదా పాల్పడ తానని బెదిరించడాన్ని నివారిస్తూ ఉత్తర్వు

(b) బాధితురాలిని వేధించడం, ఫోను చేయడం, లేదా ఏవిధంగానైనా కలవడాన్ని నిరోధిస్తూ ఉత్తర్వు

(c) బాధితురాలి నివాసం నుంచి ఖాళీచేసి, దూరంగా ఉండాలని, ఆమె సందర్శించే అవకాశం ఉన్న ప్రదేశాలకు దూరంగా ఉండాలని ఆదేశిస్తూ ఉత్తర్వు.

(d) ఎలాంటి ప్రమాదకర ఆయుధాన్ని కలిగి ఉండటాన్ని నిషేధిస్తూ ఉత్తర్వు

(e) మద్యం సేవించడం లేదా మరే ఇతర డ్రగ్స్ తీసుకోవడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వు

(f) బాధితురాలి రక్షణ, భద్రత తగిన ఉపశమనం కోసం మరే ఇతర ఉత్తర్వు అయినా.

**16. బాధితురాలికి ఆశ్రయం :**

(1) బాధితురాలి అభ్యర్థనపై, రక్షణాధికారి లేదా సేవలు అందించేవారు ఒక పునరావాస గృహం ఇన్‌ఛార్జికి సెక్షన్ 6 కింద ఆమెకు ఆశ్రయం కల్పించాలని లిఖితపూర్వకంగా అభ్యర్థిస్తూ, ఈ అభ్యర్థనను సెక్షన్ 6 కింద చేస్తున్నట్లు స్పష్టంగా తెలియజేయాలి.

(2) సబ్-రూల్ (1) కింద రక్షణాధికారి ఒక అభ్యర్థన చేస్తే, దానికి సెక్షన్ 9, సెక్షన్ 10 కింద నమోదు చేసిన కుటుంబ హింస సంఘటన నివేదిక కాపీని జతచేయాలి. ఈహోంలో ఆశ్రయం కోసం అభ్యర్థన చేసేముందు కుటుంబ హింస నివేదికను దాఖలు చేయలేదన్న కారణంపై బాధితురాలికి ఆశ్రయం నిరాకరించరాదు.

(3) బాధితురాలు కోరితే, ఆమె హోంలో ఉన్న విషయాన్ని వెల్లడించరాదు, ఆమె ఎవరిపై ఫిర్యాదు చేశారో వారికి సమాచారం అందించరాదు.

**17. బాధితురాలికి వైద్య సదుపాయం :**

(1) బాధితురాలు, లేదా, రక్షణాధికారి, లేదా సేవలు అందించే వారు ఒకవైద్యసేవల కేంద్రానికి సెక్షన్ 7 కింది లిఖిత పూర్వక అభ్యర్థన చేసి, ఈ అభ్యర్థనను సెక్షన్ 7 కింద చేస్తున్నట్లు స్పష్టంగా పేర్కొనాలి.

(2) రక్షణాధికారి ఈ అభ్యర్థనను చేస్తుంటే, దీనికి కుటుంబ హింస సంఘటన నివేదికను జతచేయాలి. వైద్య సహాయం లేదా పరీక్షల కోసం వైద్య సేవల కేంద్రానికి దరఖాస్తు చేసేముందు కుటుంబ హింస సంఘటన నివేదికను దాఖలు చేయలేదన్న కారణంపై బాధితురాలికి వైద్యసేవలు అందించ డానికి వైద్యసేవల కేంద్రం నిరాకరించరాదు.

(3) వైద్య పరీక్షల నివేదికను, వైద్యసేవల కేంద్రం, ఈ బాధితు రాలికి ఉచితంగా అందించాలి.

# డి.వి చట్టం ప్రకారం
# వేధింపులు-నిర్వచనాలు

## కుటుంబ హింస రకాలు

- శారీరక వేధింపులు
- లైంగిక వేధింపులు
- మాటల, భావోద్రేక (మానసిక) వేధింపులు
- ఆర్థిక వేధింపులు

స్థూలంగా పై నాలుగు రకాల వేధింపులు ఈ చట్టం పరిధిలోకి వస్తాయి.

# శారీరక వేధింపులు



శారీరక వేధింపులను డి.వి. చట్టం ఈకింది విధంగా నిర్వచించింది.

శారీరక (భౌతిక) వేధింపులు :

- కొట్టడం.
- చెంపదెబ్బ
- పిడికిలితో తన్నడం
- కొరకడం
- కాలితో తన్నడం
- మోదడం
- తొయ్యడం

మరే ఇతర విధంగానైనా శరీరంపై గాయం లేదా నొప్పి కలిగించడం.

# లైంగిక వేధింపులు



ఈ చట్టంలోని సెక్షన్ 3(ii) ప్రకారం లైంగిక వేధింపు (దుర్వినియోగం) అంటే :

మహిళకు ఇబ్బంది కలిగించే, లేక, అవమానపరిచే, కించపరిచే, లేదా, ఏవిధంగానైనా ఆమె గౌరవానికి భంగం కలిగించే ఏదైనా లైంగిక చర్యకు పాల్పడటం.

**ఉదాహరణలు :**

- ✧ బలవంతపు సంపర్కం
- ✧ బూతు సాహిత్యం, లేదా, బొమ్మలు, లేదా, వస్తువులను చూడాలని బలవంతం చేయడం.
- ✧ మహిళను అవమానపరిచే, లేక, కించపరిచే, లేక, దుర్వినియోగపరిచే ఏదైనా లైంగిక చర్య, లేదా, ఆమె గౌరవానికి భంగం కలిగించే ఏచర్య అయినా, లేక, అవాంఛనీయ శృంగార కార్యక్రమానికి పాల్పడటం.
- ✧ పిల్లలపై (అత్యాచారం) లైంగిక వేధింపులు.
- ✧ మానసిక (మాటలు, భావోద్రేక) వేధింపులు


# భావోద్వేగ వేధింపులు



సెక్షన్ 3 (iii) ప్రకారం :

- అవమానాలు
- హేళన చేయడం
- మారు పేర్లతో పిలవడం (ఉదా: గొడ్రాలు)
- పిల్లలు లేరనో, లేక, మగపిల్లలు లేరనో హేళన చేయడం, లేక, అవమానించడం.
- బాధితురాలికి ఇష్టమైన వ్యక్తి శరీరానికి నొప్పి కలిగిస్తామని పదేపదే బెదిరించడం.
- నడత, ప్రవర్తనపై నిందలు వేయడం.
- కట్నం తేనందుకు అవమానించడం, వగైరా
- ఆమెను, లేదా, పిల్లలను పాఠశాల,లేదా, కళాశాల, లేదా, మరే ఇతర విద్యాసంస్థకు వెళ్ళకుండా నిరోధించడం.
- ఆమెను ఉద్యోగం చేయనీయకుండా అడ్డుకోవడం.
- ఆమె, లేదా, పిల్లలు ఇల్లువదిలివెళ్ళకుండా నిరోధించడం.
- సాధారణ క్రమంలో ఆమె కలిసే ఏవ్యక్తినైనా కలవనీయకుండా అడ్డకోవడం.
- ఇష్టంలేని పెళ్ళికి బలవంతం చేయడం.
- ఆమెకి ఇష్టమైన వ్యక్తిని పెళ్ళి చేసుకోకుండా నిరోధించడం.
- అవతలివారికి ఇష్టమైన ఒక వ్యక్తిని పెళ్ళి చేసుకుని తీరాల్సిందేనని వత్తిడి చేయడం.
- ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించడం.
- మరే ఇతర మాటలు, లేదా, భావోద్వేగ వేధింపు.

# ఆర్థిక వేధింపులు




- ఇంటి సామాను, సరుకులు, సమకూర్చకపోవడం
- ఆమెకు, పిల్లలకు ఆహారం, దుస్తులు, మందులు వంటివి సమాకూర్చకపోవడం
- ఇంటి నుంచి గెంటివేయడం
- ఇంటిలోని ఏదైనా భాగాన్ని / వస్తువును ఉపయోగించనీయక పోవడం
- ఉద్యోగం చేయనీయకపోవడం, ఉద్యోగానికి వెళ్ళనీయకుండా అడ్డంకులు, అవరోధాలు కల్పించడం.
- ఇంటి అద్దె (కిరాయి) చెల్లించకపోవడం
- కరెంటు బిల్లు, వగైరా బిల్లులు చెల్లించకపోవడం
- కుంటుంబంలోని అందరూ ఉపయోగించుకునే వస్తువుల్ని / దుస్తుల్ని ఉపయోగించనీయకపోవడం
- ఆమె ఆదాయాన్ని గుంజుకోవడం
- అదనపు కట్నంకోసం వేధింపులు

# అమలు పరిచే యంత్రాంగం
# పాత్రలు - విధులు



# రక్షణాధికారుల పాత్ర




కుటుంబ హింస నిరోధక చట్టం అమలులో రక్షణాధికారులది కీలక పాత్ర. వీలైనంత వరకు, అర్హతలు, అనుభవం ఉన్న మహిళలను రక్షణాధికారులుగా నియమించాలని ఈ చట్టంలోని సెక్షన్ 8 ఆయా రాష్ట్రాలను నిర్దేశిస్తోంది. సామాజిక రంగంలో కనీసం మూడేళ్ళ అనుభవం ఉన్న వారినే రక్షణాధికారులుగా నియమించాలి (డి.వి. నిబంధన 3(2) ఆంధ్రప్రదేశ్‌లో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారులను రక్షణాధికారులుగా నియమించారు. వాస్తవానికి రక్షణాధికారులు గ్రామ, మున్సిపల్, మండల స్థాయిలలో అవసరం ఉన్నప్పటికీ, ప్రభుత్వం తొలిదశలో మాత్రం జిల్లాకి ఒకరిని నియమించింది. ఎక్కువ జిల్లాలలో రక్షణాధికారులు జిల్లా కేంద్రాలలో అందుబాటులో ఉన్నారు. కృష్ణా జిల్లాలో మచిలీపట్నంలో కాక విజయవాడలో ఉంటారు.

### రక్షణాధికారుల విధులు

- కుటుంబ హింస జరిగినట్టు, లేక, జరిగే అవకాశం ఉందని బాధితురాలు, లేదా, మరే ఇతర వ్యక్తి ద్వారా నిర్దిష్ట సమాచారాన్ని లిఖిత పూర్వరంగా గాని, లేక, నోటిమాటగా గాని ఇవ్వడానికి వచ్చినపుడు ఆమేరకు సమాచారాన్ని రక్షణాధికారి తీసుకోవాలి (డి.వి. నిబంధన 4(1) ప్రకారం).

- బాధితురాలు, లేక, మరే ఇతర వ్యక్తి మౌఖికంగా (నోటిమాటగా) సమాచారాన్ని ఇచ్చినపుడు, ఆ సమాచారాన్ని రక్షణాధికారి తానే పేపర్‌పై రాసి, సమాచారం ఇచ్చిన వ్యక్తి సంతకం తీసుకోవాలి. అలాగే సమాచారం ఇచ్చిన వ్యక్తి పూర్తి గుర్తింపు వివరాలను (ఐడెంటిటీ) రక్షణాధికారి తీసుకుని భద్రంగా ఉంచాలి (డి.వి నిబంధన 4(2) ప్రకారం).

- కుటుంబ హింస జరుగుతున్నట్టు, లేదా, జరిగే ప్రమాదం ఉన్నట్టు నిర్దిష్ట సమాచారాన్ని టెలిఫోన్ లేదా ఇ-మెయిల్ ద్వారా అందుకున్నపుడు, రక్షణాధికారి తక్షణమే పోలీసుల సహాయంతో సంఘటనా ప్రదేశానికి వెళ్ళి, కుటుంబ సంఘటన నివేదిక (డొమెస్టిక్ ఇన్‌సిడెంట్ రిపోర్ట్ – డిఐఆర్)ను తయారు చేసి, తగిన ఆదేశాల కోసం వెంటనే మేజిస్ట్రేటు ముందు దాఖలు చేయాలి (డి.వి.నిబంధన 9 ప్రకారం).
- రక్షణాధికారి నమోదు చేసిన సమాచార పత్రం నకలును సమాచారం అందించిన వ్యక్తికి వెంటనే, ఉచితంగా ఇవ్వాలి. (డి.వి.నిబంధన 3 ప్రకారం).
- బాధితురాలికి ఎదురైన వేధింపుననుసరించి ఆమెకు గల హక్కుల గురించి రక్షణాధికారి ఆమెకు వివరించాలి (నిబంధన 8(2) ప్రకారం).
- బాధితురాలికి శరీరంపై గాయాలు అయివుంటే, ఆమెకు వైద్య పరీక్షలు జరిపించి, పరీక్షల నివేదిక నకలును కుటుంబ హింస జరిగిన ప్రాంతపు పోలీసుస్టేషన్‌కు, మేజిస్ట్రేట్‌కు పంపాలి. (నింబంధన 9 (జి) ప్రకారం).
- బాధితురాలికి వైద్య చికిత్స అవసరమైతే ఈ చట్టం కింద గుర్తించిన ఆసుపత్రి వైద్యాధికారిని కోరడం ద్వారా రక్షణాధికారి ఆమెకు ఉచిత చికిత్స ఇప్పించాలి. బాధితురాలి పిల్లలకు వైద్య సదుపాయం అవసరమైనా రక్షణాధికారి కల్పించాలి. ఆసుపత్రికి వెళ్ళేందుకు రవాణా సదుపాయాన్ని కూడా బాధితురాలు ఆమె పిల్లలకు రక్షణాధికారి కల్పించాలి.(డి.వి చట్టం సెక్షన్ (7), డి.వి. నిబంధన 8 (6) ప్రకారం).
- బాధితురాలికి ఉచిత న్యాయ సహాయాన్ని రాష్ట్ర న్యాయసేవల సహాయ సంస్థ (స్టేట్ లీగల్ ఎయిడ్ సర్వీసెస్ అథారిటీ) ద్వారా రక్షణాధికారి ఇప్పించాలి (నిబంధన 8 (v), డి.వి. చట్టం సెక్షన్ 9 (డి) ప్రకారం).
- బాధితురాలు ఆశ్రయం కోరితే, ఆమెను, ఆమె పిల్లలను ప్రభుత్వ గుర్తింపుపొందిన గుర్తించిన షెల్టర్‌హోంలో ఉంచాలి. బాధితురాలు కోరితే, ఆమెను షల్టర్ హోంలో ఉంచిన సమాచారాన్ని సంబంధిత ప్రాంత పోలీసు స్టేషన్, మేజిస్ట్రేట్‌కి రక్షణాధికారి తెలియజేయాలి. బాధితురాలు, ఆమె పిల్లలు షెల్టర్‌హోంకు వెళ్ళేందుకు రవాణా సదుపాయం కల్పించాలి. (డి.వి.చట్టం సెక్షన్ 9 (ఎఫ్), నింబంధన 8 (vii) ప్రకారం).
- కుటుంబ హింస సంఘటన జరిగిన సమాచారం అందగానే రక్షణాధికారి కుటుంబ హింస సంఘటన నివేదిక (డి ఐఆర్)ను ఫారమ్ – 1లో నిర్దేశించిన ప్రకారం రూపొందించి, మేజిస్ట్రేట్‌కు అందజేయాలి. ఈ నివేదిక నకళ్ళను సంబంధిత ప్రాంత (హింస జరిగిన ప్రదేశపు) పోలీసుస్టేషన్ అధికారికి, సర్వీస్ ప్రొవైడర్‌కి అందజేయాలి (డి.వి చట్టం సెక్షన్ 9(బి), డి.వి.నిబంధనలు 5(1) ప్రకారం).

- ఈ చట్టం కింద బాధితురాలు రక్షణ ఉత్తర్వులు కోరితే, నిర్ణీత నమూనాతో దరఖాస్తును రక్షణాధికారి మేజిస్ట్రేట్ ఎదుట దాఖలు చేయాలి. (సెక్షన్ 9 (సి) ప్రకారం).

  ఈ చట్టం కింద మేజిస్ట్రేట్ విధులు నిర్వర్తించడంలో రక్షణాధికారి సహాయం చేయాలి. రక్షణాధికారి, మేజిస్ట్రేట్ నియంత్రణ, పర్యవేక్షణలో ఉంటారు. మేజిస్ట్రేటు, ప్రభుత్వం నిర్దేశించిన విధులను నిర్వర్తించాలి (సెక్షన్ 9(1) (ఎ), 9 (2) ప్రకారం.

- కేసు విచారణకు మేజిస్ట్రేటు నిర్దేశించిన తేదీని తెలియజేస్తూ నోటీసును రెండురోజులలో, లేదా మేజిస్ట్రేట్ చెప్పిన వ్యవధిలోపు వాది / ప్రతివాదులకు అందేలా రక్షణాధికారి చూడాలి. ఈ నోటీసులు వాది/ ప్రతివాదులకు అందజేసినట్లు రక్షణాధికారి ఇచ్చే ధృవీకరణ నోటీసులు ప్రతివాదులకు అందాయని కోర్టుకు ఆధారం (సెక్షన్ 13 ప్రకారం) చూపాలి.


- ఎక్స్ పార్టీ ఆదేశాలు జారీ చేయడం కోసం కోర్టు ఆదేశిస్తే, రక్షణాధికారి బాధితురాలు ప్రతివాది కలసివుండే ఇంటిని (షేర్డ్ హౌస్‌హోల్డ్) సందర్శించి, అవసరమైన విచారణ జరపాలి. (నిబంధన 10 (ఎ) ప్రకారం).

- బాధితురాలి సొంత వస్తువులు కానుకలు, నగలు, కలసివున్న ఇల్లు (షేర్డ్‌హౌస్ హోల్డ్) తో సహా అన్నిటినీ ఆమెకు రక్షణాధికారే ఇప్పించాలి. (నిబంధన 10 (సి) ప్రకారం).

- కోర్టు ఆదేశం ప్రకారం బాధితురాలు తనపిల్లల కస్టడీని పొందేందుకు, లేదా, ప్రతివాది కస్టడీలో ఉన్న తన పిల్లలను కలిసేందుకు రక్షణాధికారి ఆమెకు సహాయం చేయాలి. (నిబంధన 10 (డి) ప్రకారం).

- మేజిస్ట్రేటు జారీ చేసే రక్షణ ఉత్తర్వులు, నివాసపు హక్కు ఉత్తర్వులు, పిల్లల కస్టడీ ఉత్తర్వులు, ఆర్థిక ఉపశమనం ఉత్తర్వులు, పరిహారం ఉత్తర్వులు, ఎక్స్‌పార్టీ ఆదేశాలను రక్షణాధికారి అమలు చేయించాలి. నిబంధన 10 (ఇ) ప్రకారం.

# సర్వీస్ ప్రొవైడర్లు ఏంచేయాలి?



- కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005 అమలులో సర్వీస్ ప్రొవైడర్లు కూడా కీలక పాత్రధారులు. ఆయాప్రాంతాలలో మహిళల కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థలు సర్వీస్ ప్రొవైడర్లు (సేవలందించేవారు) గా రాష్ట్ర ప్రభుత్వంతో రిజిష్టర్ చేయించుకోవాలి. సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం, 1860 ప్రకారం రిజిష్టరైన స్వచ్ఛంద సంస్థలు, కంపెనీల చట్టం, 1956 కింద రిజిష్టరైన ఏదైనా కంపెనీ (మహిళల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం చట్టబద్ధంగా పని చేసేవి) సర్వీస్ ప్రొవైడర్లుగా రిజిష్టర్ కావచ్చు. (సెక్షన్ 10 (1) ప్రకారం).


- కుటుంబ హింస గురించి బాధితురాలు ఫిర్యాదు చేసినా, లేక సమాచారం అందినా, లేక సంఘటన జరిగినపుడు ఏ కారణంచేతనైనా ఆప్రాంతంలో ఉంటే, సర్వీస్ ప్రొవైడర్, ఈ చట్టం కింద ఏఏ ఉపశమనాలు కోరవచ్చో బాధితురాలికి వివరించాలి. రక్షణ ఉత్తర్వు, ఆర్థిక ఉపశమనం, పిల్లల కస్టడీ నివాసపు ఉత్తర్వు, పరిహారం ఉత్తర్వులలో ఏదైనా, లేక, కొన్ని / అన్ని ఉపశమనాలూ కోరవచ్చని ఆమెకు వివరించాలి. (సెక్షన్ 5 (ఎ) ప్రకారం).

- బాధిత మహిళ కోరితే, సర్వీస్ ప్రొవైడర్ కుటుంబ హింస నివేదిక (డి.ఐ.ఆర్) ను తయారు చేసి, సంబంధిత ప్రాంత మేజిస్ట్రేటుకి, రక్షణాధికారికి అందజేస్తారు (సెక్షన్ 10(2) (ఎ) ప్రకారం).

- బాధితురాలికి వైద్య పరీక్షలు జరిపించి, పరీక్షల నివేదిక నకళ్ళను స్థానిక రక్షణాధికారికి, పోలీసుస్టేషన్‌కి అందజేయాలి. (సెక్షన్ 10 (బి) ప్రకారం).

- బాధితురాలు కోరితే, ఆమెకు షెల్టర్‌హోమ్‌లో ఆశ్రయం కల్పించి, ఆసమాచారాన్ని కుటుంబ హింస జరిగిన ప్రదేశపు పోలీసుస్టేషన్‌కు తెలియజేయాలి (సెక్షన్ 10 (సి) ప్రకారం).
- అత్యవసరపరిస్థితులలో కుటుంబహింస జరిగిన / జరుగుతున్న / జరిగే ప్రమాదం వున్న ప్రదేశాన్ని సందర్శించి, డిఐఆర్‌ను తయారు చేసి వెంటనే మేజిస్ట్రేట్‌కు అందజేయాలి. సంఘటనా స్థలానికి వెళ్ళడానికి అవసరమైతే స్థానిక పోలీసుల సహాయం తీసుకోవచ్చు (సెక్షన్ 9).

# మేజిస్ట్రేట్లు ఏం చేయాలి ?



భాధిత మహిళ, లేదా, ఆమె తరపున రక్షణాధికారి, లేదా, మరే ఇతర వ్యక్తి అయినా ఒకటి, లేక, అంతకంటే ఎక్కువ ఉపశమనాలు కోరుతూ మేజిస్ట్రేటుకు దరఖాస్తు చేయడంతో డి.వి.చట్టం అమలు ప్రారంభమవుతుంది. అయితే, ఈ దరఖాస్తుతో పాటు రక్షణాధికారి, లేదా, సర్వీస్ ప్రొవైడర్ నుంచి కుటుంబ సంఘటన నివేదిక (డొమెస్టిక్ ఇన్సిడెంట్ రిపోర్ట్ – డి.ఐ.ఆర్) తప్పనిసరిగా జత చేయాలి.

ఉపశమనాల కోసం బాధితురాలు / ఆమె తరపు వారి నుంచి దరఖాస్తు అందుకున్న నాటి నుంచి సాధారణ పరిస్థితులలో మూడు రోజులలోగా విచారణ మొదటి వాయిదా జరిగే విధంగా మేజిస్ట్రేటు విచారణ తేదీని నిర్ణయించాలి (సెక్షన్ 12 (4) ప్రకారం).

దరఖాస్తు అందుకున్న వెంటనే, బాధితురాలికి–ఆమె పరిస్థితిని బట్టి–ఏ ఏ ఉపశమనాలు అందుతాయో మేజిస్ట్రేటు వివరించాలి (సెక్షన్ 5)

మొదటి విచారణ తేదీని నిర్ణయిస్తూ జారీ చేసే నోటీసులను ప్రతివాదికి అందించడం కోసం మేజిస్ట్రేటు రక్షణాధికారికి ఇస్తారు. మేజిస్ట్రేటు ఆదేశించిన ప్రకారం రెండు రోజులలోగా ఈ నోటీసులు ప్రతివాదికి అందేలా రక్షణాధికారి చర్యలు తీసుకోవాలి. ప్రతివాదికి నోటీసులను అందజేసినట్లు రక్షణాధికారి ఇచ్చేధృవీకరణనే నోటీసులు ప్రతివాదికి అందాయని ధృవీకరణగా కోర్టు పరిగణిస్తుంది. (సెక్షన్ 13).

విచారణ జరుగుతున్నపుడు ఏదశలోనైనా బాధితురాలు, లేదా, ప్రతివాది, లేదా ఇద్దరినీ అర్హులు, అనుభవజ్ఞులైన సర్వీస్ ప్రొవైడర్ కౌన్సెలర్ వద్ద కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని మేజిస్ట్రేటు ఆదేశించవచ్చు. కౌన్సెలింగ్ ప్రక్రియకు రెండు నెలల గడువు ఇవ్వవచ్చు. కౌన్సెలింగ్‌కి ఎంపిక చేసే వ్యక్తికి ఇరుపక్షాలతో సంబంధం ఉండరాదు (సెక్షన్ 14, నిబంధన 13 ప్రకారం).


ఈ కేసు విచారణ క్రమంలో ఏదశలోనైనా మేజిస్ట్రేటు సంక్షేమ వ్యవహారాలలో నిష్ణాతులైన వారి సహాయం తీసుకోవచ్చు. ఈనిష్ణాతులు బాధితురాలి బంధువైనా కావచ్చు, మరెవరైనా కావచ్చు సాధ్యమైనంతవరకు మహిళను ఎంపిక చేయాలి (సెక్షన్ 15).

మేజిస్ట్రేటు ఇవ్వదగిన ఉపశమన ఉత్తర్వులు :

1. ప్రతివాదితో కలసివున్న ఇంటిలో (షేర్డ్ హౌస్‌హోల్డ్) నివశించేహక్కు (సెక్షన్ 17)
2. రక్షణ ఉత్తర్వులు (సెక్షన్ 17)
3. నివాసపు ఉత్తర్వులు (వేరుగా ఉండేందుకు) (సెక్షన్ 19)
4. ఆర్థిక ఉపశమనాలు (సెక్షన్ 20)
5. పిల్లల సంరక్షణ ఉత్తర్వులు (సెక్షన్ 21)
6. పరిహారం ఉత్తర్వులు (సెక్షన్ 22)

పై ఉపశమనాలు కల్పిస్తూ మేజిస్ట్రేటు మధ్యంతర, ఎక్స్‌పార్టీ (ప్రతివాది హాజరు లేకుండా) ఆదేశాలు కూడా జారీ చేయవచ్చు. (సెక్షన్ 23).

# పోలీసుల విధులు, బాధ్యతలు



- డి.వి చట్టం అమలులో పోలీసులకు చాలా నామమాత్రపు పాత్రను కల్పించారు. ఇది దాదాపు సివిల్ చట్టం కాబట్టి పోలీసుల పాత్ర పరిమితంగా ఉంటుంది. పోలీసులు జోక్యం చేసుకునే సందర్భాలను తెలుసుకుందాం.
- ఒక బాధిత మహిళ ఫిర్యాదు ఇవ్వడానికి పోలీసుస్టేషన్‌కి వస్తే, డి.వి. చట్టంకింద ఆమెకు గల హక్కులను పోలీసులు ఆమెకు వివరించాలి. డి.వి. చట్టం గురించి వివరించడం, ఆమె ఎదుర్కొంటున్న సమస్యను బట్టి ఆమె ఈ చట్టం కింద రక్షణ ఉత్తర్వు, ఆర్థిక ఉపశమనం, పిల్లల కస్టడీ ఉత్తర్వు, నివాసపు ఉత్తర్వు, తనకు జరిగిన మానసిక / ఆర్థిక నష్టానికి పరిహారం కోసం ఉత్తర్వు వంటి ఎలాంటి ఉపశమనాలు కోరవచ్చో ఆమెకు పోలీసులు వివరించాలి. (సెక్షన్ 5).
- ఈ చట్టం కింద సర్వీస్ ప్రొవైడర్ల నుంచి ఆమెకు అందే సేవలను గురించి పోలీసులు ఆమెకు వివరించాలి (సెక్షన్)

  లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం కింద ఉచిత న్యాయసహాయం అందుకునేందుకు ఆమెకు గల హక్కును తెలియజేయాలి. (సెక్షన్ 5).
- డి.వి చట్టం కింద ఆమెకు లభించే ఉపశమనాల గురించి చెప్పడమేకాక, ఇండియన్ పీనల్‌కోడ్ (ఐపిసి) సెక్షన్ 498 ఎ కింద ఆమెకు ఫిర్యాదు చేసేందుకు ఉన్న అవకాశాలను కూడా వివరించాలి. (సెక్షన్ 5).
- కుటుంబ హింస సంఘటన జరిగినపుడు సంఘటనా ప్రదేశాన్ని చూసేందుకు వెళ్ళే రక్షణాధికారి కోరితే ఆమె/ ఆయనతోపాటు పోలీసులూ వెళ్ళాలి. అక్కడ నిందితులు, ఏమైనా ఆయుధాలను ఉపయోగించి ఉంటే, పోలీసులు వాటిని స్వాధీనం చేసుకోవాలి. (నిబంధన 10 (ఎఫ్) ప్రకారం).


- ప్రతి కుటుంబ సంఘటన నివేదిక సంబంధిత ప్రాంత పోలీసు స్టేషన్‌కు అందుతుంది. (సెక్షన్ 9(బి).

  కేసు హియరింగ్ (విచారణ) తేదీని నిర్ణయిస్తూ మేజిస్ట్రేట్ జారీ చేసే నోటీసును ప్రతివాదికి అందించడంలో మేజిస్ట్రేట్ ఆదేశిస్తే రక్షణాధికారికి పోలీసులు సహకరించాలి (నిబంధన 12 (సి) ప్రకారం).

- బాధితురాలికి కోర్టు మంజూరు చేసిన రక్షణ ఉత్తర్వును ప్రతివాది ఉల్లంఘిస్తే, బాధితురాలు మేజిస్ట్రేటు, లేదా, పోలీసుకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు (నిబంధన 15(4) ప్రకారం).

- బాధితురాలికి రక్షణ, నివాసపు హక్కు ఉపశమనాలు కల్పిస్తూ మేజిస్ట్రేట్ జారీ చేసే ఆదేశాలను అమలు చేయడంలో బాధితురాలికి సహాయం చేయాలని కోర్టు ఆదేశిస్తే, వారు సహకరించాలి. బాధితురాలు ఉండే ఇంటి నుంచి ప్రతివాదిని ఖాళీ చేయాలని కోర్టు ఆదేశించినా, బాధితురాలి ఇంటి (గది) లోకి ప్రతివాదిగాని, ఆయన తాలూకు వ్యక్తులుగాని వెళ్ళరాదని నిరోధించినా, షేర్డ్ హౌస్‌హోల్డ్‌ను ప్రతివాది అమ్మివేయకుండా, మరే ఇతర విధంగా వదిలించుకోకుండా చూసేందుకు కోర్టు, ఆదేశాలు జారీ చేసినా, వాటి అమలులో బాధితురాలికి పోలీసులు సహకరించాలి (సెక్షన్ 19(5), 19(7) ప్రకారం).

# ఫిర్యాదు చేసే విధానం-జాగ్రత్తలు



# డి.వి కేసులలో ఆడవారిని ప్రతివాదులుగా చేర్చకండి.

కుటుంబహింస నుంచి మహిళలకు రక్షణ చట్టం అమలులో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి, అపశృతులు దొర్లుతున్నాయి. ప్రాథమికంగా, కుటుంబంలోని పురుషుల నుంచి ఎదురయ్యే శారీరక, మానసిక, ఆర్థిక, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించి, మహిళకు తన ఇంటిలో, లేదా, తాను కోరుకున్న వేరే ఇంటిలో ప్రశాంతంగా జీవించే చట్టబద్ధ హక్కును కల్పించేదే ఈ డి.వి. చట్టం.

మహిళలు, రక్షణాధికారులు గుర్తించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ కేసులో మహిళలను ప్రతివాదులుగా (నిందితులుగా) చేర్చరాదు. అంటే, తల్లి, సవతితల్లి, సోదరి, అత్తగారు, ఆడపడుచులు, కోడళ్ళు, వదినలు, మనవరాళ్ళు వగైరా మహిళా బంధువులెవరిమీదా ఈ కేసులు పెట్టరాదు.

మనరాష్ట్రంలో చాలా డి.వి కేసులు బలహీనం కావడానికి ప్రధానకారణం మహిళలను ఈ కేసులలో ప్రతివాదులుగా చేర్చడమేనని ఒక విశ్లేషణ చెబుతోంది. ఈ విషయమై రక్షణాధికారులను అడిగితే "ఆడవారిని ప్రతివాదులుగా చేర్చవలసిందేనని బాధిత మహిళలు పట్టుబడుతున్నారు", అని చెప్పారు. చట్టం పూర్తిగా తెలియని కారణంగా బాధిత మహిళలు ఇలా కోరడం సహజమైనప్పటికీ, అలా చేయడం కేసుకు ఎలానష్టం కలిగిస్తుందో రక్షణాధికారులు వారికి వివరించాల్సిన అవసరం ఉంది. అలాగే, మహిళా కార్యకర్తలు, ఎన్‌జిఒ కార్యకర్తలు కూడా ఈ విషయమై విస్తృత అవగాహనకు ప్రాధాన్యం ఇవ్వాలి.

### మరి, మహిళల వేధింపులను ఎలా ఎదుర్కోవాలి

కుటుంబాలలో మహిళలకు వేధింపులు ఎదురుకావడంలో మహిళా బంధువుల ప్రత్యక్ష పాత్ర, ప్రమేయం ఉన్న కేసులను భారతీయ శాక్షాస్మృతి (ఇపిసి) సెక్షన్ల కిందగాని, పలుఇతర చట్టాల కిందగాని, నమోదు చేయాలి. ఈ కేసులను పోలీసులు, కోర్టులు చూస్తాయి తప్ప, డి.వి. చట్టంకింద నియమితులైన రక్షణాధికారులకు వీటితో సంబంధంలేదు.

# బాధిత మహిళలు కోరదగిన ప్రత్యేక ఉత్తర్వులు

ముందు చాప్టర్లలో ఉదహరించిన రక్షణ ఉత్తర్వు, నివాసపు ఉత్తర్వు, భరణం, ఆర్థిక నష్టపరిహారం, పిల్లల కస్టడీ ఉత్తర్వులతో పాటు బాధిత మహిళలు ఈ కింద ఉదహరించిన ప్రత్యేక ఉత్తర్వులను కూడా కోరవచ్చు.

- ✧ ఆమె ఉండే ప్రదేశం / పనిచేసే ప్రదేశం నుంచి అతను వైదొలగాలని లేదా దూరంగా ఉండాలని (నిబంధన 8(i) (ii) ఫారమ్ iv లోని 3(డి) ప్రకారం)
- ✧ ఆమెను కలిసే ప్రయత్నం చేయరాదని (నిబంధన 8 (i) (ii) – ఫారమ్ iv లో 3(డి) (ii) ప్రకారం).
- ✧ ఆమెకు ఫోన్లు చేయరాదని, ఉత్తరాలు, ఇ–మెయిల్ వగైరా మార్గాలలో ఆమెతో సంభాషణకు ప్రయత్నించరాదని (నిబంధన 8 (i) (ii) – ఫారమ్ iv లో 3డి (iii) ప్రకారం).
- ✧ ఆమెతో పెళ్ళి గురించి మాట్లాడరాదని, పెళ్ళి విషయమై మాట్లాడేందుకు అతనికి / వారికి. ఇష్టమైన వ్యక్తిని కలవాలని వత్తిడి చేయరాదని (8 (i) (ii) ఫారమ్ – iv లో 3డి (iv) ప్రకారం)
- ✧ ఆమె పిల్లలు చదివే పాఠశాల / ఆమె, వారు సందర్శించే ప్రదేశానికి అతను దూరంగా ఉండాలని (నిబంధన 8 (i) (ii) ఫారం – iv లో 3(డి) (v) ప్రకారం)
- ✧ ఆయుధాలు, ప్రమాదకరమైన మరే ఇతర వస్తువులను స్వాధీనం చేయాలని (నిబంధన 8 (i) (ii) – ఫారం – iv లో 3(డి) (vi) ప్రకారం)
- ✧ ఎలాంటి మారణాయుధాలు, ఆయుధాలు, ప్రమాదకరమైన పదార్థాలు వేటినీ సేకరించరాదని, కలిగివుండరాదని (నిబంధన 8(i)(ii) – ఫారం – iv లో 3(డి) (vii) ప్రకారం).
- ✧ గతంలో కుటుంబహింసకు దారితీసిన మద్యపానం లేదా డ్రగ్‌ను, అలాంటి మరే ఇతర పదార్థాన్ని తీసుకోరాదని (నిబంధన 8(i) (ii) – ఫారం – iv లో 3(డి) (viii) ప్రకారం).
- ✧ ఆమె, ఆమె పిల్లల భద్రత దృష్ట్యా మరే ఇతర జాగ్రత్త కోసమైనా ఉత్తర్వు (నిబంధన 8(i) (ii) – ఫారం – iv (3)డి (ix) ప్రకారం.

# అత్యవసర సందర్భాలు

కుటుంబంలో మహిళలపై జరిగిన, జరుగుతూవున్న వివిధ రకాల హింసలనే కాక హింస జరిగే ప్రమాదంఉన్న సందర్భాలలో కూడా రక్షణాధికారులు, సర్వీస్ ప్రొవైడర్లు, మేజిస్ట్రేటు స్పందించాలని, వేధింపును నిరోధించడంలో ఆపడంలో వీరికి పోలీసులు సహకరించాలని చట్టం నిర్దేశించింది. అత్యవసర సందర్భాలలో కుటుంబ హింస సమాచారాన్ని బాధితురాలు, లేక, ఖచ్చితమైన సమాచారం ఉన్న ఏవ్యక్తి అయినా సర్వీస్ ప్రొవైడర్‌కిగాని, రక్షణాధికారికిగాని టెలిఫోన్, లేదా, ఇ-మెయిల్, లేదా, మరే ఇతర సాధనం ద్వారానైనా సమాచారం ఇవ్వవచ్చు.

సమాచారం అందుకున్న వెంటనే సర్వీస్ ప్రొవైడర్, లేదా, రక్షణాధికారి పోలీసుల సహాయంతో సంఘటనా స్థలానికి వెళ్ళి, డొమెస్టిక్ ఇన్‌సిడెంట్ రిపోర్ట్ (డి.ఐ.ఆర్) ను రూపొందించాలి. దానిని ఎలాంటి జాప్యం లేకుండా మేజిస్ట్రేట్‌కు అందజేయాలి. (నిబంధన)

# కుటుంబ హింస నుంచి రక్షణ కల్పించే కొన్ని ఐ.పి.సి సెక్షన్లు

| సెక్షన్ | నేరం | శిక్ష | కాగ్నిజబుల్ లేక నాన్ కాగ్నిజబుల్ | బెయిలబుల్ నాన్ బెయిలబుల్ | ఏ కోర్టు |
|---|---|---|---|---|---|
| 304బి | వరకట్న హత్య | ఏడు సంవత్సరాలకు తక్కువ కాకుండా జైలు శిక్ష, కొన్ని సార్లు జీవిత ఖైదు. | కాగ్నిజబుల్ | నాన్ బెయిలబుల్ | సెషన్స్ |
| 308 | ఆత్మ హత్యకు ప్రేరేపించడం | ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా | కాగ్నిజబుల్ | నాన్ బెయిలబుల్ | సెషన్స్ |
| 302 | హత్య | మరణశిక్ష లేక జీవిత ఖైదు + జరిమానా (సందర్భాన్ని బట్టి ఈ శిక్ష మారవచ్చు) | కాగ్నిజబుల్ | నాన్ బెయిలబుల్ | సెషన్స్ |
| 313 | స్త్రీ సమ్మతి లేకుండా గర్భస్రావం చేయిస్తే | జీవితఖైదు లేక పదేళ్ళ వరకు జైలు, జరిమానా | కాగ్నిజబుల్ | నాన్ బెయిలబుల్ | సెషన్స్ |
| 323 | ఉద్దేశపూర్వకంగా తీవ్రంగా గాయపరచడం | ఏడాది వరకు శిక్ష లేక జరిమానా లేక రెండు | నాన్-కాగ్నిజబుల్ | బెయిలబుల్ | మెజిస్ట్రేట్ |
| 326 | ప్రమాదకరమైన ఆయుధాలతో, వేరే విధంగా లేక తీవ్రంగా గాయపరచడం | జీవితఖైదు లేదా పదేళ్ళ వరకు జైలు జరిమానా | కాగ్నిజబుల్ | నాన్ బెయిలబుల్ | మెజిస్ట్రేట్ |

| సెక్షన్ | నేరం | శిక్ష | కాగ్నిజబుల్ లేక నాన్ కాగ్నిజబుల్ | బెయిలబుల్ నాన్ బెయిలబుల్ | ఏ కోర్టు |
|---|---|---|---|---|---|
| 341 | అక్రమ నిరోధం (కావాల్సిన చోటుకి వెళ్ళనీయకుండా అడ్డుపడడం) | ఒక నెల సాధారణ జైలు శిక్ష లేక అయిదు వందల రూపాయల దాకా జరిమానా లేక రెండు | కాగ్నిజబుల్ | బెయిలబుల్ | మేజిస్ట్రేట్ |
| 342 | అక్రమ నిర్బంధం | సంవత్సరం వరకు జైలు శిక్ష, 1,000 దాకా జరిమానా లేక రెండూ | కాగ్నిజబుల్ | బెయిలబుల్ | మెజిస్ట్రేట్, |
| 354 | అత్యాచారం చేయాలనే ఉద్దేశంతో మహిళపై తీవ్రమైన బలాన్ని ప్రయోగించడం లేదా దౌర్జన్యం చేయడం | రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష లేక జరిమానా లేక రాష్ట్ర ప్రభుత్వం సవరణ ప్రకారం 5 ఏళ్ళు తక్కువ కాకుండా జైలు శిక్ష, దీనిని 7 ఏళ్ళ వరకు పొడిగించవచ్చు. జరిమానా కూడా విధించవచ్చు. 5 ఏళ్ళ కంటే తక్కువ జైలు శిక్ష కొన్ని ప్రత్యేక కారణాల వల్ల మాత్రమే విధించవచ్చు. అయితే ఎట్టి పరిస్థితులలో ఇది రెండేళ్ళకు తక్కువ కాకూడదు. | కాగ్నిజబుల్ | బెయిలబుల్ | మెజిస్ట్రేట్, |

| సెక్షన్ | నేరం | శిక్ష | కాగ్నిజబుల్ లేక నాన్ కాగ్నిజబుల్ | బెయిలబుల్ నాన్ బెయిలబుల్ | ఏ కోర్టు |
|---|---|---|---|---|---|
| 375 | 15 సంవత్సరాలు నిండని భార్యతో లైంగికంగా కలవడం | ఏడేళ్ళకు తక్కువ కాకుండా జైలు, లేక జీవిత ఖైదు | కాగ్నిజబుల్ | నాన్ బెయిలబుల్ | సెషన్స్ |
| 376 | అత్యాచారం | ఏడేళ్ళకు తక్కువ కాకుండా జైలు, లేక జీవిత ఖైదు. | కాగ్నిజబుల్ | నాన్ బెయిలబుల్ | సెషన్స్ |
| 376-ఎ | భార్యాభర్తలు విడిపోయినపుడు భార్యతో లైంగికంగా కలవడం | రెండు సంవత్సరాలు జైలు శిక్ష, జరిమానా | నాన్ కాగ్నిజబుల్ | నాన్ బెయిలబుల్ | సెషన్స్ |
| 406 | నమ్మక ద్రోహం (సంరక్షణలో ఉంచిన భార్య ఆస్తిని సొంత అవసరాలకు ఉపయోగించుకోవడం) | మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష లేక జరిమానా లేక రెండు విధించవచ్చు | కాగ్నిజబుల్ | నాన్ బెయిలబుల్ | ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ |
| 494 | భార్య లేక భర్త బతికుండగానే వేరే పెళ్ళి చేసుకోవడం | ఏడేళ్ళ జైలు, జరిమానా | నాన్ కాగ్నిజబుల్ | నాన్ బెయిలబుల్ | ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ |

| సెక్షన్ | నేరం | శిక్ష | కాగ్నిజబుల్ లేక నాన్ కాగ్నిజబుల్ | బెయిలబుల్ నాన్ బెయిలబుల్ | ఏ కోర్టు |
|---|---|---|---|---|---|
| 497 | భర్త బతికి ఉండగానే అతని భార్యతో వేరొక వ్యక్తి రహస్యంగా సంబంధం పెట్టుకోవడం | ఐదేళ్ళ జైలు, లేదా, జరిమానా, లేదా, రెండూ | నాన్ కాగ్నిజబుల్ | బెయిలబుల్ | ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ |
| 498 | మోసంచేసే ఉద్దేశంతో ఒక పెళ్లైన మహిళను ప్రలోభ పెట్టడం లేదా ఎత్తుకుపోవడం లేదా నిర్బంధించడం | రెండేళ్ళ జైలు, లేదా జరిమానా, లేదా రెండూ | నాన్ కాగ్నిజబుల్ | నాన్ బెయిలబుల్ | మెజిస్ట్రేట్, |
| 498-ఎ | పెళ్లైన మహిళను ఆమె భర్త, అతని బంధువులు (వేధింపులకు) క్రూరత్వానికి గురిచేయడం | మూడేళ్ళ జైలు, జరిమానా | కాగ్నిజబుల్ | బెయిలబుల్ | ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ |

# తరచూ తలెత్తే సందేహాలు



**కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005 ను ఉపయోగించుకోవాలనుకునే వారికి ఎదురయ్యే కొన్ని సందేహాలకు వివరణలు దిగువన ఇస్తున్నాం.**

*1ప్ర.* ***ఈ చట్టం కింద మైనర్ పిల్లలకు ఉపశమనం లభిస్తుందా?***

జ|| లభిస్తుంది. ఈ చట్టంలో 'పిల్లలు' అనే పదానికి ఇచ్చిన అర్థంప్రకారం మైనర్లు 'కుటుంబ సంబంధం' నిర్వచనం పరిధిలోకి వస్తారు. 18 ఏళ్ళలోపు పిల్లలెవరైనా – దత్తత తీసుకున్న పిల్లలు, సవతి పిల్లలు, సంరక్షణలో ఉన్న పిల్లలతో సహా, "పిల్లలు" అనే నిర్వచనం పరిధిలోకి వస్తారని ఈ చట్టం సెక్షన్ 2 (బి) చెబుతోంది.

*2ప్ర.* ***ఈ చట్టం కింద మైనర్ బాలురు (అబ్బాయిలు) ఉపశమనం కోరవచ్చా?***

జ|| మైనర్ పిల్లలు బాలికలైనా, బాలురైనా, వారి తరపున వారి తల్లి దరఖాస్తు చేయవచ్చు, మహిళ తన కోసం కూడా దరఖాస్తు చేస్తున్నట్లయితే, పిల్లలను తన సహ-దరఖాస్తు దారులు (Coapplicants) గా చేర్చవచ్చు. అవసరమైనపుడు వారితరపున వాదించేందుకు కోర్టుకూడా మైనర్ పిల్లలకు సంరక్షకులనో, లేక స్నేహితులనో నియమించవచ్చు.

*3ప్ర.* ***"కుటుంబ సంబంధం" నిర్వచనంలో ఉపయోగించిన "పెళ్ళితరహా సంబంధం" అంటే ఏమిటి? (సెక్షన్ 2 (ఎఫ్))***

జ|| "పెళ్ళితరహా సంబంధం" అంటే, ఇరువురి మధ్య ఎలాంటి చట్టప్రకారం పెళ్ళి జరగకుండా బాంధవ్యం కలిగి ఉండటం. పెళ్ళి కానప్పటికీ, ప్రపంచం (లోకం) దృష్టిలో వీరు భార్యాభర్తలు, వీరి మధ్య సంబంధం స్థిరమైనదీ, కొనసాగుతున్నది అని. ఇలాంటి బాంధవ్యాన్ని "కామన్ లా మ్యారేజ్" అంటారు. ఇలాంటి బాంధవ్యానికి రుజువు – ఇద్దరు ఒకే పేరు ఉపయోగించడం (కామన్ నేమ్), ఉమ్మడి రేషన్ కార్డు, ఒకే చిరునామా, వగైరా. ఇద్దరు వ్యక్తుల మధ్య సంబంధాన్ని "వివాహం తరహా సంబంధం" గా చూడాలా అన్న విషయమై దక్షిణాఫ్రికాలో నడిచిన ఎథెల్ రాబిన్సన్ విమెన్స్ లీగల్ సెంటర్‌ట్రస్ట్ వెర్సెస్ రిచర్డ్ కార్డన్ వోకాస్, ఇతరులు (కేసునెంబరు 7178/07, దక్షిణాఫ్రికా హైకోర్టు, కేప్ (ప్రావిన్స్‌డివిజన్) లో పరిగణనలోకి తీసుకున్న ఈ కింది అంశాలకు గమనించడం ఉపయోగకరం :

- ఉమ్మడి ఇంటికి ఇద్దరి కట్టుబాటు.
- ఎక్కువకాలం సహజీవనం చేయడం.
- ఇద్దరి మధ్య ఆర్థిక, ఇతర సర్దుబాట్లు, కుటుంబం ఆర్థిక, ఇతర అవసరాలు చూసుకోవడం, ఒకరిపై ఒకరు ఆర్థికంగా, ఇతరత్రా, ఆధారపడి వుండటం.
- ఇద్దరి మధ్య సంబంధంలో పిల్లలు కలగడం.
- కుటుంబ నిర్వహణ, పిల్లల పెంపకంలో భాగస్వాముల పాత్ర.

**పెళ్ళి తరహా సంబంధాలపై భారతదేశంలో కేసులు :**

1) బద్రీ ప్రసాద్ ఎఐఆర్ 1978 ఎస్‌సి 1557 :

"భాగస్వాములు భార్యాభర్తలుగా చాలా కాలంపాటు కలిసివుంటే, వారిమధ్య వివాహం జరిగిందని అనుకూలంగా బలమైన అభిప్రాయం ఏర్పడుతుంది." అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

2) సుమిత్రాదేవి (1985) 1 ఎస్‌సిసి 637 :

బాంధవ్యం వివాహం తరహా సంబంధమా అనేది నిర్ధారించేందుకు ఇరువురూ ఎంతకాలం నుంచి సహజీవనం చేస్తున్నారు, సమాజం వారిని భార్యా భర్తలుగా గుర్తిస్తోందా వంటి వాస్తవాలను పరిశీలించవలసివుంటుందని సుప్రీం కోర్టు పేర్కొన్నది.

ఈవిధంగా, కింద ఉదహరించిన కేటగిరీల మహిళలు 'పెళ్ళి తరహా సంబంధం' నిర్వచనం కిందికి వస్తారు.

3) చెల్లని, లేదా, చట్టం ప్రకారం చెల్లు బాటుకాని పెళ్ళి సంబంధంలో వుండి, మిగిలిన అన్ని బాంధవ్యాలు వున్న మహిళలు. వివాహం కాకుండా షేర్డ్ హౌస్ హోల్డ్‌లో, లేదా, దాంపత్య సంబంధంలో ఉండే మహిళ.

4) కామన్‌లా మ్యారేజెస్. ఒక జంట కొన్నేళ్ళుగా సహజీవనం చేస్తూ, సమాజానికి భార్యా భర్తలుగా పరిచయమైనవారు.

*4ప్ర. "పెళ్ళి తరహాసంబంధం" అనే ప్రయోగం ఈ సంబంధానికి పెళ్ళితో సమానమైన విలువను కల్పిస్తుందా?*

జ॥ ఈ చట్టం అందరు మహిళలకీ - వారు అక్కలు, చెల్లెళ్ళయినా, తల్లులైనా, భార్యలైనా, ఒకే ఇంటిలో కలసివుండే భాగస్వాములైనా - హింస నుంచి రక్షణ కల్పిస్తుంది. రక్షణ కల్పించడంవరకు ఈ చట్టం పెళ్ళయిన - పెళ్ళికాని అనే తేడాను చూపదు. అయితే, చెల్లని పెళ్ళి చెల్లుతుందని ఈ చట్టంలో ఎక్కడా చెప్పలేదు. ఈ చట్టం, హింస నుంచి రక్షణ, కలిసివుండే ఇంటిలో నివసించే హక్కు, పిల్లల తాత్కాలిక కస్టడీ వంటి సదుపాయాలను కల్పిస్తుంది. అయితే, పురుష భాగస్వామికి చెందిన ఆస్తికి వారసత్వం, లేదా, పిల్లల చట్టబద్ధత కోసం ఆయాప్రాంతాలలోని సాధారణ చట్టాలు లేదా ఆయా వర్గాలవారికోసం ఉన్న పర్సనల్‌లాలపై ఆధారపడాలి.

## ప్రతివాదులు

*5ప్ర. ఒక మహిళ ఎవరికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేయవచ్చు?*

జ॥ ఒక హింసా చర్యను ప్రేరేపించే ఏ మేజర్ పురుషుడిపైనైనా (సెక్షన్ 2 (క్యు)) మహిళ ఫిర్యాదు చేయవచ్చు. మహిళ వివాహితురాలు, లేదా, పెళ్ళితరహా

సంబంధంలో ఉంటే, హింసను ప్రేరేపించిన భర్త మగసహజీవి స్త్రీ – పురుష బంధువులెవరిపైనైనా ఫిర్యాదు చేయవచ్చు, పిడబ్ల్యూ డివి చట్టంలోని సెక్షన్ 2(క్యు) కు ఐపిసి సెక్షన్ 498 ఎ అంశాన్ని క్రోడీకరించిడం ద్వారా భర్త బంధువులను ఆడవారైనా, మగవారైనా – కూడా ప్రాసిక్యూట్ చేయడం సాధ్యమే, ఉదాహరణ : అత్త మామ, ఆడపడుచు, వగైరా.

***6ప్ర.*** ***సెక్షన్ 2 (క్యు) ప్రకారం 'బంధువుల' నిర్వచనం కిందికి ఎవరు వస్తారు?***

జ|| పిడబ్ల్యు డివిఎలో 'బంధువు' అన్న పదాన్ని నిర్వచించలేదు. కనుక, సాధారణంగా ఉపయోగంలో ఉన్న అర్థాన్నే అన్వయించాలి.

ఉదా: ప్రతివాది తండ్రి, తల్లి సోదరి, బాబాయి, సోదరుడు, ఐపిసి 498 ఎలో కూడా బంధువులనే పదాన్ని ఉపయోగించారుగాని, అర్థం చెప్పలేదు, కనుక, బంధువులకి సామాన్యంగా చెప్పుకునే అర్థంలో మహిళా బంధువులు కూడా ఉంటారు.

***7ప్ర.*** ***అత్త, ఆడపడుచువంటి మహిళా బంధువులపై కూడా ఒక మహిళ ఫిర్యాదు చేయవచ్చా?***

జ|| చేయవచ్చు, భర్త తాలూకు మహిళా బంధువులకు వ్యతిరేకంగా ఉత్తర్వులు జారీకావచ్చు.

***8ప్ర.*** ***కోడలి నుంచి ఉపశమనం కోరుతూ అత్తగారు దరఖాస్తు చేయవచ్చా?***

జ|| లేదు, కోడలికి వ్యతిరేకంగా అత్తగారు కేసువేయరాదు (సెక్షన్ 2(క్యు), అయితే, కొడుకు, కోడలి చేతిలో అత్తగారు హింసకు గురవుతుంటే, హింసకి పాల్పడినందుకు కొడుకుపైన, ప్రేరేపించినట్టు కోడలిపైన ఆమె దరఖాస్తు చేయవచ్చు, కానీ, కోడలు ఇంటినుంచి వెళ్ళిపోవాలని మాత్రం అత్తగారు అడిగేవీలులేదు.

**కుటుంబ హింస సంఘటన నివేదిక (డిఐఆర్) :**

***9ప్ర.*** ***డిఐఆర్ అంటే ఏమిటి?***

జ|| డిఐఆర్ ఫారమ్‌ను ఈ చట్టంలోని ఫారమ్ – I లో పొందుపరిచారు. బాధితమహిళ రక్షణాధికారి, లేదా, సర్వీస్ ప్రొవైడర్ వద్దకు తెచ్చే కుటుంబహింస ఫిర్యాదును నమోదుచేయడానికి దీనిని ఉపయోగించాలి. కుటుంబహింస గురించి ఫిర్యాదు దాఖలైందన్న వాస్తవానికి ఇది సాక్ష్యం, ఇది ఒక నాన్–కాగ్నిజబుల్ నేరం నివేదిక (ఎన్‌సిఆర్) లాంటిది. రక్షణాధికారి, లేదా, రిజిష్టర్డ్ సర్వీస్ ప్రొవైడర్ దీనిని నింపి సంతకం చేయాలి. ఇది బహిరంగపత్రం.

***10ప్ర.*** ***డిఐఆర్‌ను ఎలా నమోదు చేయాలి?***

జ|| మహిళ డిఐఆర్, మహిళ ఫిర్యాదు చేసిన హింసా చర్య ఈ చట్టం పరిధిలో ఉన్నంతవరకు ఫిర్యాదులన్నిటినీ నిష్పక్షపాతంగా నమోదు చేయాలి.

మహిళ తన గోడును వివరించలేకపోతే, రక్షణాధికారి ఆమెను డిఐఆర్ నింపడం కోసం వేరే సందర్భాలలో పిలవవచ్చు, మహిళ ప్రతి సందర్శనను 'రికార్డు' చేయడం కోసం రక్షణాధికారి రోజువారిడైరీ ఒకదానిని నిర్వహించవచ్చు.

**11ప్ర. డిఐఆర్‌ను నమోదు చేశాక ఏం చేయాలి?**

జ॥ డిఐఆర్‌ను రక్షణాధికారి మేజిస్ట్రేట్‌కి పంపాలి. దీని ఒక కాపీని సంబంధిత ప్రాంత పోలీసుస్టేషన్‌కు పంపాలి. డిఐఆర్‌ను సర్వీస్ ప్రొవైడర్ నింపితే, వారు ఆ మహిళ కోరికననుసరించి రక్షణాధికారికి, మేజిస్ట్రేట్‌కి పంపాలి.

డిఐఆర్‌ను నమోదు చేశాక, మహిళ కోరితే, రక్షణాధికారి, లేదా, సర్వీస్ ప్రొవైడర్, ఆమె ఉపశమనాలు కోరుతూ దరఖాస్తు చేయడానికి సహకరించాలి. అలాంటి సందర్భాలలో కోర్టులో దాఖలు చేసే దరఖాస్తుకు డిఐఆర్‌ను జత చేయాలి.

**12ప్ర. డిఐఆర్ అందుకున్నాక మేజిస్ట్రేట్ ఏం చేయాలి?**

జ॥ రికార్డు నిర్వహణ కోసం మేజిస్ట్రేట్ డిఐఆర్‌ను భద్రపరచాలి. బాధిత మహిళ నేరుగా దరఖాస్తు చేసినపుడు, దీనిని పరిశీలించవచ్చు. రక్షణాధికారి సహాయంతో దరఖాస్తు చేసి, తర్వాత డిఐఆర్‌ను దాఖలు చేసినపుడు కూడా దీనిని ఉపయోగించవచ్చు.

**13ప్ర. డిఐఆర్‌ను బాధిత మహిళ ఆమె న్యాయవాది దాఖలు చేయవచ్చా?**

జ ॥ లేదు, డిఐఆర్‌ను రక్షణాధికారి, లేదా, సర్వీస్ ప్రొవైడర్ మాత్రమే దాఖలు చేయాలి. ఫారమ్ I లో వారు సంతకం చేయాలి. డిఐఆర్ ఒక బహిరంగ పత్రం కాబట్టి, ప్రభుత్వోద్యోగులే దానిని నింపాలి. ఈ చట్టం కింద విధులు నిర్వర్తించేటపుడు రక్షణాధికారులు, సర్వీస్ ప్రొవైడర్లందరూ ప్రభుత్వోద్యోగులేనని (పబ్లిక్ సర్వెంట్స్) సెక్షన్ 30 చెబుతోంది.

**14ప్ర. బాధిత మహిళ డిఐఆర్ లేకుండా దరఖాస్తు చేయవచ్చా?**

జ॥ చేయవచ్చు. బాధిత మహిళ డిఐఆర్ లేకుండా ఉపశమనాలు కోరుతూ దరఖాస్తు చేయవచ్చు.

**15ప్ర. ఉపశమనాల కోసం మహిళ నేరుగా దరఖాస్తు చేసే సందర్భాలలో, కేసు దాఖలయ్యాక మేజిస్ట్రేటు డిఐఆర్ కోసం ఆదేశించాలా?**

జ॥ ఈ దశలో డిఐఆర్ అవసరం లేదు, ఎందుకంటే, మహిళ కోర్టులో దరఖాస్తు చేశాక, డిఐఆర్ 'గతం' అయిపోతుంది, దాని ప్రయోజనం (హింస జరగడాన్ని నమోదు చేయడం) తీరిపోతుంది. కోర్టులో దరఖాస్తు దాఖలయ్యాక, బాధితురాలి ఇంటిని సందర్శించాలని మేజిస్ట్రేటు రక్షణాధికారిని ఆదేశించవచ్చు, లేదా, పరిస్థితిననుసరించి మరే ఇతర నివేదికనైనా కోరవచ్చు.

***16ప్ర. డిఐఆర్ నమోదు చేసేటప్పుడు రక్షణాధికారి బాధిత మహిళ ఇంటిని సందర్శించవచ్చా?***

జ ॥ లేదు, కోర్టు ఆదేశం లేకుండా రక్షణాధికారి ఇంటిసందర్శన చేయరాదు.

## కుటుంబ హింసను నిరూపించడానికి సాక్ష్యాలు :

***17ప్ర. మాటలు, భావోద్వేగం, లైంగిక హింసను రుజువు చేయడానికి సాక్ష్యాలు ఏమి కావాలి?***

జ ॥ ఈ చట్టం కింద కోరే ఉపశమనాలు సివిల్ రూపంలోనివి కాబట్టి, సాధ్యాసాధ్యాల అంచనా మేరకు విషయాన్ని అంచనా వేస్తారు. అనవసరమైన రుజువులు అక్కరలేదు. కుటుంబ హింస నాలుగుగోడల మధ్య జరిగేది కాబట్టి బయటి వ్యక్తులెవరూ సాక్ష్యం ఉండరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఉమ్మడి కుటుంబంలో హింస జరిగినా, బాధిత మహిళ భర్త అతని బంధువులెవరూ ఆమెకు అనుకూలంగా సాక్ష్యం ఇచ్చే అవకాశం ఉండకపోవచ్చు. కనుక, ఈ చట్టం కింద కేసులకు మహిళలే ప్రధాన సాక్షులు.

ప్రత్యక్ష సాక్షి ఎవరూ లేకుండా, కేవలం మహిళ ఇచ్చిన స్టేట్‌మెంటే ఉన్నపుడు, ఆ సన్నివేశపు సాక్ష్యాలే వాస్తవాలకు ఆధారం. అందుకే, మాటలు-భావోద్వేగ దాడి జరిగిన సందర్భాన్ని వెల్లడించడం అవసరం. (వివరణII సెక్షన్ 3). పరిస్థితుల నేపథ్యాన్ని రికార్డు చేయడంలో, మహిళ, ఆమె పిల్లలపై హింస ప్రభావాన్ని పేర్కొనడంలో జాగ్రత్త వహించాలి. మాటలు, భావోద్వేగ దాడులు తరచు మహిళ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. పిల్లలు కూడా పాఠశాలలో చదువులోనో, ఇతరులతో వ్యవహరించే తీరులోనో ఈ దుష్ప్రభావానికి లోనుకావచ్చు. దీనంతటినీ కోర్టు ఎదుట సాక్ష్యంగా పేర్కొనాలి.

## ఎక్స్ పార్టీ ఉత్తర్వులు :

***18ప్ర. విచారణ ఏదశలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవచ్చు ?***

జ ॥ ఎక్స్ పార్టీ ఇంజంక్షన్ ఇవ్వడంపై నిర్ణయం తీసుకోవడానికి సుప్రీంకోర్టు మోర్గాన్ స్టాన్లీవెర్సెస్ కార్తీక్ దాస్ ((1994) 4 SCC 225) కేసులో మార్గ దర్శకాలను జారీ చేసింది. అసాధారణ పరిస్థితులలో మాత్రమే ఎక్స్‌పార్టీ ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశిస్తూ, ఇందుకు పరిగణనలోకి తీసుకోవలసిన అంశాలను సుప్రీంకోర్టు పేర్కొన్నది.

(ఎ) వాదికి సరిచేయలేని, లేదా తీవ్రమైన నష్టం వాటిల్లితే.

(బి) ఎక్స్‌పార్టీ ఆదేశాలు జారీ చేసినపుడు జరిగే అన్యాయం కంటే, వీటిని తిరస్కరిస్తే జరిగే అన్యాయం ఎక్కువగా ఉంటే.

(సి) ఒక పార్టీ పరోక్షంలో (హాజరులో లేనపుడు) వారికి వ్యతిరేకంగా అనుచితమైన

ఆదేశం జారీ చేయడాన్ని నిరోధించడంకోసం కోర్టు, సంఘటన గురించి వాది మొదట ఎప్పుడు ఫిర్యాదు చేశారో ఆసమయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటుంది.

(డి) వాదికి సమయం ఉందా అనే విషయాన్ని కూడా కోర్టుగమనంలోకి తీసుకుని, అలాంటి పరిస్థితిలో ఎక్స్‌పార్టీ ఇంజంక్షన్‌ను జారీ చేయదు.

(ఇ) ఎక్స్ పార్టీ ఇంజంక్షన్ కోసం దరఖాస్తు చేసేవారు తాము దరఖాస్తు చేయడంలోని అత్యున్నత విశ్వసనీయతను చూపాలని కోర్టు కోరుతుంది.

(ఎఫ్) ఎక్స్‌పార్టీ ఉత్తర్వు జారీ అయినా, అది పరిమిత కాలానికి మాత్రమే.

(జి) ప్రాథమిక సాక్ష్యాధారాలు, బ్యాలెన్స్ ఆఫ్ కన్వీనియన్స్ సరిచేయలేని నష్టం లాంటి సాధారణ సూత్రాలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంటుంది.

**19ప్ర.. మధ్యంతర ఉత్తర్వు ఎంతకాలం అమలులో ఉంటుంది?**

జ॥ వాది, ప్రతి వాదులలో ఎవరైనా దాని సవరణ, మార్పు, లేదా, రద్దుకోసం దరఖాస్తు చేసే వరకు మధ్యంతర ఉత్తర్వు అమలులో ఉంటుంది. అలాంటి ఉత్తర్వు కావాలంటే పరిస్థితులలో మార్పును చూపాలి (సెక్షన్ 25 (25)). కోర్టు తుది ఉత్తర్వులు వెలువడేటపుడు కూడా మధ్యంతర ఉత్తర్వులు రద్దువుతాయి.

**20ప్ర. మధ్యంతర ఉత్తర్వులపై అప్పీలు చేయవచ్చా?**

జ॥ మేజిస్ట్రేటు జారీ చేసిన ఏ ఉత్తర్వు పైనైనా సెషన్స్ కోర్టులో అప్పీలు చేసుకునే అవకాశాన్ని ఈ చట్టంలోని సెక్షన్ 29 కల్పిస్తోంది. మధ్యంతర ఉత్తర్వులపై అప్పీళ్ళను అనేక సందర్భాలలో కోర్టులు నియంత్రించాయి – సివిల్ ప్రొసీజర్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని అంశాలను అన్వయించడం ద్వారా ఏపార్టీ హక్కుకు భంగం కలిగించని, పద్ధతికి అనుగుణమైన ఉత్తర్వులపై అప్పీలు లేదు.

## ఈ చట్టంకింద దొరికే ఉపశమనాలు / నివాసపు హక్కు

**21ప్ర. 'షేర్డ్ హౌస్‌హోల్డ్' అంటే ఏమిటి?**

జ॥ కలసివున్న ఇల్లు (షేర్డ్ హౌస్‌హోల్డ్) అంటే, కుటుంబ సంబంధంలో పురుషునితో కలిసి మహిళ జీవించిన, లేదా, జీవిస్తున్న ఇల్లు. ఉపశమనం కోసం దరఖాస్తు చేస్తున్న సమయంలో ఆమె ఈ ఇంటిలో ఉండకపోవచ్చు – గతంలో ఆ ఇంటి నుంచి పంపివేసివుంటారు కాబట్టి. కుటుంబ సంబంధం ఉన్నంత కాలం ఈ మహిళలు ఈ చట్టం కింద ఉపశమనం కోరడానికి అర్హులు.

కలిసివున్న ఇల్లు అతనికో, ఆమెకో సొంతమై వుండాల్సిన అవసరం లేదు. మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఇంకా వుంది, ఇందులో ఒకటికంటే ఎక్కువ తరాలు వారి జీవిత భాగస్వాములు, పిల్లలతో కలసివుంటారు. ఒక మహిళ

భర్త ఈ ఉమ్మడి కుటుంబంలో కలిసి జీవిస్తుంటే, ఈ ఇల్లే ఆమెకు కలిసివుండే ఇల్లు అవుతుంది. తండ్రి లేదా మరే ఇతర పూర్వీకుడి పేరుతో ఉన్న ఇంటిలో నివశించే అక్క చెల్లెళ్ళకూ ఇదే ఇల్లు షేర్డ్ హౌస్‌హోల్డ్ అవుతుంది. ఇందుకోసం కావలసిన రుజువేమిటంటే మహిళ దాంపత్య సంబంధంలో గాని, లేక, కుటుంబ సంబంధంలో గాని (పైన తెలిపిన విధంగా) ఈ ఇంటిలో నివశిస్తున్నారని, లేదా, నివశించారని.

**22ప్ర. నివాసపు హక్కు ద్వారా ఆస్తి హక్కు కూడా సంక్రమిస్తుందా?**

జ॥ కుటుంబహింస నుంచి మహిళలకు రక్షణ చట్టం మహిళకు ఎలాంటి ఆస్తి హక్కును కల్పించదు, ప్రతివాదికి చెందిన ఆస్తిని బాధిత మహిళకు బదలాయించదు. నివాసపు హక్కు కేవలం ఒక మహిళ తన షేర్డ్ హౌస్‌హోల్డ్‌లో జీవించడానికి, అక్కడి నుంచి నెట్టివేయబడకుండా ఉండటానికే తోడ్పడుతుంది. తనపై హింసకు పాల్పడుతున్న వ్యక్తి ఆ ఇంటిలోకి ప్రవేశించకుండా ఈ చట్టం నిరోధిస్తుంది. (హింసకు పాల్పడరాదని కోర్టు ఉత్తర్వులు మంజూరైతే)– ఆ వ్యక్తి ఆ ఇంటి యజమాని అయినా, ప్రవేశించడానికి వీలులేకుండా చేస్తుంది. ఇంటి నుంచి పంపివేయబడిన మహిళ కూడా తిరిగి ఆ ఇంటిలో చేరడానికి ఉత్తర్వు పొందవచ్చు. (సెక్షన్ 18 రెడ్ విత్ సెక్షన్ 17(1)).

**23ప్ర. కలసివున్న ఇంటి నుంచి వెళ్ళిపొమ్మని కోర్టు ఆదేశం అందుకున్న భర్త కాపురం పునరుద్ధరణ (రెస్టిట్యూషన్ ఆఫ్ కాంజుగల్ రైట్స్) కోసం దరఖాస్తు చేయవచ్చా?**

జ॥ ఈ కింది అంశాలు రుజువైతేనే కాపురం పునరుద్ధరణ కోసం ఉత్తర్వు పొందవచ్చు:

- ఈ వ్యక్తి పిటిషనర్‌తో సాంఘిక సంబంధాలను తెంచుకున్నారని
- విడిపోవడానికి తగిన కారణం, నెపం లేవని
- జారీ అయిన ఉపశమనాలకు తగిన చట్టబద్ధ ప్రాతిపదిక లేదని.

**24ప్ర. హింస కొనసాగే అవకాశం ఉందన్న భయంతో బాధిత మహిళ షేర్డ్‌హౌస్ హోల్డ్‌లో ఉండటానికి ఇష్టంలేకపోతే, వేరే ఇంటిలో ఉంటానని ఈ చట్టం కింద కోరవచ్చా?**

జ॥ కోరవచ్చు. సెక్షన్ 19(1) (ఎఫ్) కింద. ఉద్యోగం చేసే వ్యక్తి యాజమాన్యం కల్పించిన వసతి (ప్రభుత్వ క్వార్టర్లు, వగైరా) ని ఖాళీ చేయడం, లేదా ఉద్యోగం వదిలి పెట్టడం, లేదా అద్దె ఇంటిని ఖాళీ చేయడం ద్వారా "షేర్డ్ హౌస్‌హోల్డ్" లో ఆశ్రయం కల్పించలేక పోతున్నట్టు చూపే సందర్భాలలో ఈ సదుపాయం చాలా ఉపయోగకరమైనది. మహిళకు ప్రత్యామ్నాయ వసతి సదుపాయం కల్పించాలని, లేదా, ఆమె ఉండే ఇంటికి అద్దె చెల్లించాలని కోర్టు ప్రతివాదిని ఆదేశించ వచ్చు.

హిందూ ఎడాప్షన్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్, 1956 కూడా ఒక మహిళ వేరుగా ఉండటాన్ని అనుమతిస్తుంది.

**25ప్ర. ఈ చట్టం కింద భరణం (maintenance) కోరడానికి ఎవరు అర్హులు?**

జు॥ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 125లో ఉదహరించిన అందరూ ఈ చట్టం కింద భరణం కోరడానికి అర్హులు. భార్య, మైనర్ పిల్లలు – చట్ట బద్ధత కలిగిన వారైనా, చట్టబద్ధతలేని వారైనా శారీరక, మానసిక వైకల్యం లేదా గాయాలు కలిగిన మేజర్ పిల్లలు, తల్లి. ఇతర "పర్సనల్‌లా" ల కింద అర్హత కలిగిన వారు కూడా భరణం కోరవచ్చు.

**26ప్ర. భరణం మొత్తాన్ని ఎలా నిర్ణయిస్తారు?**

జు॥ ఈ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం – భరణం, ఒక మహిళ అలవాటు పడిన జీవనస్థాయికి సరిపడేలా, సముచితంగా, న్యాయంగా ఉండాలి. భరణాన్ని లెక్కిం చేటపుడు. కోర్టులు మెయింటెనెన్స్ చట్టంలో నిర్దేశించిన ప్రమాణాలను పరిగణన లోకి తీసుకుంటారు.

భరణం మంజూరు చేసేటపుడు హిందూ ఎడాప్షన్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ ప్రకారం కోర్టు ఈ కింది అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

1) దంపతుల సాంఘిక స్థాయి : ఇందులో భర్త ఆదాయం, దంపతుల జీవన స్థాయి ఉంటాయి.
2) భార్య కనీస అవసరాలు: ఇందులో ఆమె ఆహారం, దుస్తులు, నివాసం, వైద్య ఖర్చులు కనీసంగా ఉంటాయి.
3) భార్యకు ఏమైనా ఆస్తులు ఆదాయం ఉంటే వాటి విలువ.
4) హిందూ ఎడాప్షన్ అండ్ మెయింటెనెన్స్‌యాక్ట్ కింద పోషణకోసం అతనిపై ఆధారపడిన వ్యక్తులు : ఇందులో, భార్యతో పాటు పిల్లలు, ఆమె తల్లి దండ్రులు, వితంతువైన కోడలు ఉంటారు.

**27ప్ర. భరణం నెలవారీ ఇస్తారా, లేక, ఒకే సారి ఏక మొత్తంగా వస్తుందా?**

జు॥ ఇది ఆ మహిళ చేసే అభ్యర్థన, కోర్టు నిర్ణయంపై ఆధారపడివుంటుంది. ఈ చట్టంలోని సెక్షన్ 20(3) ప్రకారం, నెలవారీ, లేదా, ఒకే సారి ఏకమొత్తం భరణం మంజూరు చేయవచ్చు.

**28ప్ర. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 125 కింద ఇప్పటికే భరణం మంజూరై వుంటే, దాని అమలు కోసం కుటుంబహింస నుంచి మహిళలకు రక్షణ చట్టం కింద మహిళ కేసువేయవచ్చా?**

జు॥ ఈ చట్టంలో నేరుగా అలాంటి అవకాశం లేదు. ఐతే సిఆర్‌పిసి సెక్షన్ 125 కింద మంజూరైన భరణం ఉత్తర్వును అమలు చేయకపోవడం "ఆర్థిక వేధింపు" కాబట్టి, దీనిని డి.వి. చట్టం కింద 'కుటుంబహింస' గా కిందికి వస్తుంది.

**29ప్ర. ఒక ముస్లిం మహిళ ఈ చట్టం కింద భరణం కోరవచ్చా?**

జ|| విడాకులు తీసుకోని ముస్లిం మహిళ ఈ చట్టం కింద ఆర్థిక ఊపశమనం (భరణం) కోరవచ్చు.

ఒక ముస్లిం మహిళ ఆర్థిక ఉపశమనం కోసం తన కొడుకుపై కూడా డి.వి.కేసు వేయవచ్చు.

**30ప్ర. ప్రతివాదికి ఆదాయమార్గాలు లేకపోతే పరిహారం, ప్రత్యామ్నాయ వసతి, ఆర్థిక ఉపశమనం ఉత్తర్వులను అతని చేత కోర్టు ఎలా అమలు చేయిస్తుంది?**

జ|| లీలావతి వెర్సెస్ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం (1982) (1) ఎస్‌సిసి 437) కేసులో సుప్రీంకోర్టు "ఒకవ్యక్తి ఆరోగ్యంగా ఉండి, శరీరక సామర్థ్యం కలిగివుంటే, అతను భార్య, పిల్లలు, తల్లిదండ్రులను పోషించడానికి సామర్థ్యం కలిగివుండాలి" అని అభిప్రాయం వ్యక్తం చేసింది. మంజూరైన భరణాన్ని అతను చెల్లించకపోతే కోర్టు సిఆర్‌పిసి సెక్షన్ 125 (3) కింద ప్రతివాదిని అరెస్ట్ చేయించవచ్చు.

**31ప్ర. ఈ చట్టం కింద మహిళ తన పిల్లల కస్టడీని కోరవచ్చా?**

జ|| కోరవచ్చు. సెక్షన్ 21 కింద. ఇతర ఉపశమనాలతో పాటు పిల్లల కస్టడీని కూడా కోరుతూ మహిళ దరఖాస్తు చేయవచ్చు. మేజిస్ట్రేటు తాత్కాలిక కస్టడీ మంజూరు చేయవచ్చు. అయితే, దీనిని అవతలిపార్టీ (ప్రతివాది) వేరే ఇతర వేదికపై వ్యతిరేకించి, శాశ్వత, లేదా, ఉమ్మడి కస్టడీకోరుతూ దరఖాస్తు చేసుకోవడాన్ని నిరోధించదు.

పిల్లల కస్టడీకి సంబంధించి ఏదైనా కోర్టులో కేసు నడుస్తూవుంటే, తాత్కాలిక కస్టడికోసం డి.వి.చట్టం కింద అదే కోర్టులో దరఖాస్తు చేసుకోవాలి.

**31ప్ర. డి.వి. కేసులో తీర్పుపై అప్పీలు చేయవచ్చా?**

జ|| చేయవచ్చు. సెక్షన్ 33 ప్రకారం మేజిస్ట్రేటు కోర్టులో వెలువడిన తీర్పు వాది లేదా ప్రతివాదికి అసంతృప్తి కలిగిస్తే, తీర్పు జారీ అయిన నాటి నుంచి 30 రోజులలోపు సెషన్స్ కోర్టులో అప్పీలు చేసుకోవాలి.

# రక్షణాధికారుల జాబితా

| జిల్లా | అధికారిపేరు | ఆఫీసు ఫోన్ నెం. | సెల్‌ఫోన్ నెం. |
|---|---|---|---|
| శ్రీకాకుళం | బి.కనకదుర్గ | 08942-221276 | 9440814582 |
| విజయనగరం | ఉషారాణి | 08922-777985 | 9440814584 |
| విశాఖపట్నం | ఎ.ఇ.రాబర్ట్స్ | 0891-2706156 | 9440814575 |
| తూర్పుగోదావరి | టి.వి.శ్రీనివాస్ | 0844-2368442 | 9440814682 |
| పశ్చిమగోదావరి | బి.కృష్ణకుమారి | 08812-242621 | 9440814587 |
| కృష్ణా | ఎం.జె.నిర్మల | 0866-2493197 | 9440814461 |
| గుంటూరు | బి.రమాదేవి | 0863-2234159 | 9440814511 |
| ప్రకాశం | ఎస్.విద్యావతి | 08592-235304 | 9440814506 |
| నెల్లూరు | ఎన్.రాఘవరావు | 0861-2329481 | 9440814522 |
| చిత్తూరు | కె.చంద్రకళ | 08572-235253 | 9440814496 |
| కడప | పి.వి.లక్ష్మయ్య | 08562-244039 | 9440814489 |
| కర్నూలు | సుహాసినిదేవి | 08518-277721 | 9440814589 |
| అనంతపురం | కె.ముత్యాలమ్మ | 08554-232337 | 9440814471 |
| ఆదిలాబాద్ | ఆర్.జ్యోతి | 08732-236630 | 9440814455 |
| | | | 9440443727 |
| నిజామాబాద్ | సరళకుమారి | 08462-238109 | 9440814550 |
| కరీంనగర్ | ఎం.సూర్యకుమారి | 0878-2254647 | 9440814450 |
| ఖమ్మం | గ్రేస్ కుమారి | 08742-255857 | 9440814441 |
| వరంగల్ | జె.ఎం.జె.కోమలి | 0870-2550359 | 9440814433 |
| మహబూబ్‌నగర్ | వి.ఇందిర | 08542-272778 | 9440814557 |
| నల్గొండ | వి.శారద | 08682-245983 | 9440814566 |
| సంగారెడ్డి | వై.శైలజ | 08455-276460 | 9440814544 |
| రంగారెడ్డి | కె.రాజ్యలక్ష్మి | 040-23240023 | 9440814537 |
| హైదరాబాద్ | ఇ.వి.స్వర్ణలత | 040-23202355 | 9440814531 |

వీరందరూ ఆయాజిల్లాల మహిళా, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమం, వికలాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి వసుధమిశ్రా జి.ఒ.ఎంఎస్ నెం.22 (తేది: 09-11-2006) ద్వారా వీరిని ఆయాజిల్లాల రక్షణ అధికారులుగా నియమించారు.

# జిల్లాలలో లీగల్ సర్వీసెస్ అథారిటీ చిరునామాలు

రాష్ట్రంలోని వివిధ జిల్లాల లీగల్ సర్వీసెస్ అధికారుల చిరునామాలు, సెల్‌ఫోన్ నెంబర్లు

| అదిలాబాద్ | నిజామాబాద్ | కరీంనగర్ |
|---|---|---|
| ఆల్. పుండరీకాక్షుడు<br>కార్యదర్శి<br>జిల్లా లీగల్ సర్వీసెస్<br>అధికారి<br>జిల్లాకోర్టు భవనం<br>ఆదిలాబాద్<br>సెల్ నెం. 9440901043 | ఎమ్. రాజేందర్<br>కార్యదర్శి<br>జిల్లా లీగల్ సర్వీసెస్<br>అధికారి<br>జిల్లాకోర్టు బిల్డింగ్<br>నిజామాబాద్<br>సెల్ నెం. 9440901059 | కె. గురప్పనాయుడు<br>కార్యదర్శి<br>జిల్లా లీగల్ సర్వీసెస్<br>అధికారి<br>జిల్లా కోర్టు బిల్డింగ్<br>కరీంనగర్<br>సెల్ నెం. 9440901049 |
| **వరంగల్** | **చిత్తూరు** | **కడప** |
| ఎమ్. కృష్ణప్ప<br>సెక్రటరీ<br>జిల్లా లీగల్ సర్వీసెస్<br>అధికారి<br>జిల్లా కోర్టు భవనం<br>వరంగల్ | సెక్రటరీ<br>జిల్లా లీగల్ సర్వీసెస్<br>అధికారి<br>జిల్లా కోర్టు భవనం<br>చిత్తూరు<br>సెల్‌నెం. 9440901045 | సెక్రటరీ<br>కడప<br><br>సెల్ నెం. 9440901049<br><br>సెల్ నెం. 9440901063 |
| అనంతపూర్<br>సెక్రటరీ<br>అనంతపూర్<br>సెల్ నెం. 9440901044 | కర్నూలు<br>సెక్రటరీ<br>కర్నూలు<br>సెల్ నెం. 9440901052 | మహబూబ్‌నగర్<br>సెక్రటరీ<br>మహబూబ్‌నగర్<br>సెల్ నెం. 9440901053 |
| **మెదక్** | **రంగారెడ్డి** | **హైదరాబాద్** |
| సెక్రటరీ<br>సంగారెడ్డి<br><br>మెదక్ జిల్లా<br><br>సెల్ నెం : 94409015054 | సెక్రటరీ<br>ఎల్.బి.నగర్<br><br>హైదరాబాద్<br>పురానిహవేలి హైదరాబాద్<br>సెల్ నెం : 9440901059 | సెక్రటరీ<br>సిటి సివిల్ కోర్ట్<br>లీగల్ సర్వీసెస్ అథారిటి<br>సిటి సివిల్ కోర్ట్ కాంప్లెక్స్<br><br>సెల్ నెం : 9440901065 |
| **నల్గొండ** | **ఖమ్మం** | **నెల్లూరు** |
| కార్యదర్శి<br>నల్గొండ<br>సెల్‌నెం. 9440901055 | కార్యదర్శి<br>ఖమ్మం<br>సెల్ నెం. 9440901050 | కార్యదర్శి<br>నెల్లూరు<br>సెల్ నెం. 9440901056 |

| ప్రకాశం | గుంటూరు | కృష్ణా |
| --- | --- | --- |
| కార్యదర్శి<br>ఒంగోలు<br>ప్రకాశం జిల్లా<br>తూర్పుగోదావరి<br>కార్యదర్శి<br>ఏలూరు<br>సెల్ నెం. 9440901064 | కార్యదర్శి<br>గుంటూరు<br>సెల్ నెం. 944090148<br>పశ్చిమ గోదావరి<br>కార్యదర్శి<br>రాజమండ్రి | మచిలీపట్నం<br>కృష్ణాజిల్లా<br>సెల్ నెం. 9440901051<br>విశాఖపట్నం<br>కార్యదర్శి<br>విశాఖపట్నం<br>సెల్ నెం. 9440901061 |
| **విజయనగరం** | **శ్రీకాకుళం** | **కార్యదర్శి** |
| కార్యదర్శి<br>విజయనగరం<br>సెల్ నెం. 9440901062 | కార్యదర్శి<br>శ్రీకాకుళం<br>సెల్ నెం. 9440901060 | రాష్ట్ర న్యాయసేవాసహాయ సంస్థ<br>పురానిహవేలి<br>హైదరాబాద్. |

# నమూనా దరఖాస్తులు

(ముఖ్యమైనవి)

**ఫారమ్ -I**

కుటుంబహింస సంఘటన నివేదిక (డిఐఆర్)

**ఫారమ్ -II**

ఉపశమనాలు కోరుతూ మేజిస్ట్రేట్‌కి చేసే దరఖాస్తు / పిటిషన్

**ఫారమ్ -III**

లీగల్ సర్వీసెస్ అథారటీస్ చట్టం కింద
ఉచిత న్యాయ సహాయం కోసం దరఖాస్తు

**ఫారమ్ -IV**

బాధిత వ్యక్తికి ఈ చట్టం కింది లభించే హక్కులపై సమాచారం

**ఫారమ్ -V**

సర్వీస్ ప్రొవైడర్ల రిజిస్ట్రేషన్ దరఖాస్తు

## ఫారమ్ –I

(నిబంధన 5 (1), (2), 17(3) చూడుము)

**కుటుంబ హింసనుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005 (43 ఆఫ్ 2005)లోని 9 (బి) 37(2) (సి) సెక్షన్ల కింద కుటుంబ హింస సంఘటనా నివేదిక.**

**1. ఫిర్యాది / బాధిత వ్యక్తి వివరాలు :**

(1) ఫిర్యాది / బాధిత వ్యక్తి పేరు : ______________________________

(2) వయసు : ______________________________

(3) కలసివున్న ఇంటి చిరునామా : ______________________________

(4) ప్రస్తుత చిరునామా : ______________________________

(5) ఫోన్ నెంబరు (ఉంటే) : ______________________________

2. ప్రతివాదుల వివరాలు :

| వరుస సంఖ్య | పేరు | బాధితవ్యక్తితో సంబంధం | చిరునామా | టెలిఫోన్ నెంబర్ (ఉంటే) |
|---|---|---|---|---|
| | | | | |
| | | | | |

**3. బాధిత వ్యక్తికి పిల్లలు ఉంటే, వారి వివరాలు**

(ఎ) పిల్లల సంఖ్య

(బి) పిల్లల వివరాలు

| పేరు | వయసు | జెండర్ | ప్రస్తుతం ఎవరి వద్ద ఉంటున్నారు |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |

4. **కుటుంబ హింస సంఘటనలు**

| వరుస సంఖ్య | హింస జరిగిన తేదీ సమయం, ప్రదేశం | కుటుంబహింస జరిపిన వ్యక్తి | హింస రకం | మార్కులు |
|---|---|---|---|---|
| | | | (i) శారీరకహింస ఎలాంటి గాయమైనా చేయడం దయచేసి స్పష్టంగా పేర్కొనండి. | |
| | | | (ii) లైంగిక హింస దిగువ వాటిలో సరైన చోట (✓) టిక్కుపెట్టండి. | |

☐ సెక్స్ కోసం వత్తిడి చేశారు.

☐ బూతు బొమ్మలు, లేక, ఇతర అసభ్య వస్తువును చూడాలని బలవంతం చేశారు.

☐ ఇతరులను ఆనందపరచడం కోసం మిమ్మల్ని బల వంతంగా ఉపయోగించారు.

☐ మరే ఇతర లైంగిక చర్య అయినా, లైంగిక దోపిడి, అవమానం, మీగౌరవాన్ని దిగజార్చడం, లేక దానికి అగౌరవపరచడం దయచేసి కింద ఇచ్చిన ఖాళీ స్థలంలో దానిని స్పష్టంగా పేర్కొనండి)

(iii) మాటలు, భావోద్వేగ దుర్వినియోగం

☐ నిందించడం / మీ నడత లేక నడవడికకు తప్పులు ఆపాదించడం.

☐ కట్నం, వగైరా తేనందుకు అవమానించడం.

☐ పిల్లలు లేరని అవమానించడం.

☐ కించపరిచే / అవమానించే/గౌరవం తగ్గించే వ్యాఖ్యలు / ప్రకటనలు చేయడం.

☐ హేళన చేయడం.

- ☐ మారుపేర్లతో పిలవడం.
- ☐ బడికి, కాలేజీకి లేక మరే ఇతర విద్యాసంస్థకైనా వెళ్ళవద్దని మీపై వత్తిడి చేయడం.
- ☐ మిమ్మల్ని ఉద్యోగం చేయనీయకుండా అడ్డుకోవడం.
- ☐ ఇల్లు వదిలి వెళ్ళ కుండా మిమ్మల్ని నిరోధించడం. ఎవరైనా నిర్దిష్ట వ్యక్తిని కలవకుండా మిమ్మల్ని నిరోధించడం.
- ☐ మీనడత / నడవడికకు తప్పులు ఆపాదించడం.
- ☐ మీ ఇష్టానికి వ్యతిరేకంగా పెళ్ళి చేసుకోవాలని వత్తిడి చేయడం.
- ☐ మీ ఇష్టమైన వ్యక్తిని పెళ్ళి చేసుకోనీయకుండా నిరోధించడం.
- ☐ ఆయనకు / వారికి ఇష్టమైన వ్యక్తిని పెళ్ళి చేసుకోవాలని బలవంతం చేయడం.
- ☐ మరే ఇతర మాటలు, లేక, భావోద్వేగ బాధ కలిగించడం.

(దయచేసి కింద ఉన్న ఖాళీలో స్పష్టంగా పేర్కొనండి).

## ఆర్థిక హింస

- ☐ మిమ్మల్ని, లేక, మీపిల్లల్ని పోషించడానికి డబ్బు సమకూర్చకపోవడం.
- ☐ మీకు, లేక, మీ పిల్లలకు ఆహారం, దుస్తులు, మందులు, వగైరా ఇవ్వకపోవడం.
- ☐ మీరు ఉండే ఇంటినుంచి మిమ్మల్ని గెంటివేయడం.
- ☐ ఇంటిలోని ఏ భాగాన్నైనా మీరు ఉపయోగించకుండా, ప్రవేశించకుండా అడ్డుకోవడం.
- ☐ మీరు ఉద్యోగం చేయకుండా అవరోధాలు కల్పించడం / అడ్డగించడం.

☐ ఉద్యోగంలో చేరడానికి మిమ్మల్ని అనుమతించక పోవడం.

☐ అద్దె ఇంట్లో ఉంటుంటే, అద్దె (కిరాయి) చెల్లించక పోవడం.

☐ ఇంటిలోని అందరికీ ఉపయోగించే దుస్తులు, లేదా, వస్తువులను ఉపయోగించనీయకుండా మిమ్మల్ని అడ్డుకోవడం.

☐ మీకు చెప్పకుండా, లేదా, మీ అనుమతి లేకుండా మీ స్త్రీ ధనాన్ని, లేక, మరే ఇతర వస్తువును అమ్మివేయడం, లేక, తాకట్టుపెట్టడం.

☐ మీ జీతం, ఆదాయం, లేక, వేతనాన్ని బలవంతంగా గుంజుకోవడం.

☐ విద్యుత్ బిల్లు మరే ఇతర బిల్లు చెల్లించక పోవడం.

మరే ఇతర ఆర్థిక హింస (దిగువ ఇచ్చిన ఖాళీలో స్పష్టంగా పేర్కొనండి).

**(V)** కట్న సంబంధమైన వేధింపులు

☐ కట్నం కోసం డిమాండ్ చేయడం (దయచేసి స్పష్టంగా పేర్కొనండి)

☐ కట్నానికి సంబంధించిన మరే ఇతర వివరాలైనా (దయచేసి స్పష్టంగా తెలుపండి.)

కట్న కానుకలు, స్త్రీధనం వివరాలు ఈ ఫారమ్‌తో

☐ జత చేశారా

☐ అవును

☐ కాదు

**(Vi) మీపైన, లేక, మీ పిల్లలపైన జరిగిన కుటుంబ హింసకు సంబంధించి మరే ఇతర సమాచారమైనా**

ఫిర్యాది / బాధిత వ్యక్తి సంతకం

లేక, వేలిముద్ర.

## 5. జతచేసిన పత్రాల జాబితా

| డాక్యుమెంట్ పేరు | తేదీ | ఇతర వివరాలు |
|---|---|---|
| మెడికోలీగల్ సర్టిఫికెట్ డాక్టర్ సర్టిఫికెట్, లేదా, ప్రిస్క్రిప్షన్ | | |
| స్త్రీధనం జాబితా | | |
| ఇతర డాక్యుమెంట్ | | |

## 6. కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005 కింద మీకు కావలసిన ఉత్తర్వులు

| సంఖ్య | ఉత్తర్వులు | కావాలి/వద్దు | ఇతరములు |
|---|---|---|---|
| 1. | సెక్షన్ 18 ప్రకారం రక్షణ ఉత్తర్వు. | – | – |
| 2. | సెక్షన్ 19 ప్రకారం నివాసపు ఉత్తర్వు | – | – |
| 3. | సెక్షన్ 20 ప్రకారం మనోవర్తి (పోషణ) ఉత్తర్వు | – | – |
| 4. | సెక్షన్ 21 ప్రకారం పిల్లల కస్టడీ ఉత్తర్వు. | – | – |
| 5. | సెక్షన్ 22 ప్రకారం నష్టపరిహారం ఉత్తర్వు | – | – |
| 6. | ఇతర ఉత్తర్వు (స్పష్టంగా పేర్కొనండి. | | |

## 7. మీకు కావలసిన సహాయం

| వరుస సంఖ్య | లభించే సహాయం | కావాలి / వద్దు | సహాయ రకం |
|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) |
| (1) | కౌన్సెలర్ | | |
| (2) | పోలీసు సహాయం | | |
| (3) | క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి సహాయం | | |
| (4) | షెల్టర్‌హోమ్ | | |
| (5) | వైద్య సదుపాయం | | |
| (6) | న్యాయ సహాయం | | |

## 8. కుటుంబ హింస సంఘటన నివేదికను రూపొందించడంలో తోడ్పడే పోలీసు అధికారికి సూచనలు

ఈ ఫారమ్‌లో నింపిన సమాచారమేదైనా ఇండియన్ పీనల్‌కోడ్ లేక, మరే ఇతర చట్టం కిందికి వచ్చేలా ఉంటే, పోలీసు అధికారి –

(ఎ) క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 (2 ఆఫ్ 1973) ప్రకారం ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) ఇవ్వడం ద్వారా క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవచ్చని బాధితురాలికి తెలియజేయాలి.

(బి) క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి బాధిత వ్యక్తి ఇష్టపడకపోతే, కుటుంబ హింస సంఘటన నివేదికలో పేర్కొనిన ప్రకారం సమాచారాన్ని రోజువారీ డైరీలో రాసి, నిందితునితో ఉన్న సన్నిహిత సంబంధం రీత్యా బాధిత మహిళ కుటుంబ హింస నుంచి రక్షణ కోసం సివిల్ పరిష్కారాలనే కోరుతున్నారని, తనకు అందిన సమాచారం మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందు తగిన విచారణను పెండింగ్‌లో ఉంచడమైనదని 'రిమార్క్' రాయాలి.

(సి) శరీరంపై ఏదైనా నొప్పి లేదా గాయం అయినట్లు బాధిత వ్యక్తి తెలిపితే, తక్షణ వైద్య సహాయం అందుతుందని తెలిపి, బాధిత వ్యక్తికి వైద్య పరీక్షలు జరిపించాలి.

ప్రదేశం : రక్షణాధికారి / సర్వీస్ ప్రొవైడర్ కౌంటర్ సంతకం.

తేదీ : పేరు :

చిరునామా :

(సీలు)

కాపీలు కింది వారికి పంపడమైనది :-

1. స్థానిక పోలీసు స్టేషన్
2. సర్వీస్ ప్రొవైడర్ / రక్షణాధికారి.
3. బాధిత వ్యక్తి.
4. మేజిస్ట్రేటు

# ఫారమ్ –II

## కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005 (43 ఆఫ్ 2005) సెక్షన్ 12 కింద మేజిస్ట్రేటుకు దరఖాస్తు.

టు

మేజిస్ట్రేటు కోర్టువారికి,

____________________

____________________

____________________,

కుంటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005 (43 ఆఫ్ 2005)లోని సెక్షన్ కింద దరఖాస్తు.

—

1. కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005లోని సెక్షన్ కింద ఈ దరఖాస్తును కుటుంబ హింస సంఘటన నివేదికతో సహా ఈ కింది వారు సమర్పించుచున్నారు.

   (ఎ) బాధిత వ్యక్తి ☐

   (బి) రక్షణాధికారి ☐

   (సి) బాధిత వ్యక్తి తరపున ఇతర వ్యక్తి ☐

2. ఈ ఫిర్యాదు/ కుటుంబహింస సంఘటన నివేదికను పరిగణనలోకి తీసుకుని, కేసు పూర్వాపరాల దృష్ట్యా ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా గౌరవ కోర్టు వారిని ప్రార్థించడమైనది.

   (ఎ) సెక్షన్ 18 కింద రక్షణ ఉత్తర్వులు జారీ, మరియు/లేదా

   (బి) సెక్షన్ 19 కింద నివాసపు ఉత్తర్వు మరియు/లేదా

   (సి) సెక్షన్ 20 కింద నగదు ఉపశమనం చెల్లించాలని ప్రతి వాదికి ఉత్తర్వు మరియు/లేదా

   (డి) సెక్షన్ 21 కింద ఉత్తర్వు మరియు/లేదా

   (ఇ) సెక్షన్ 22 కింద నష్టపరిహారం చెల్లించాలని ప్రతివాదికి ఆదేశం. మరియు/లేదా

(ఎఫ్) కోర్టు న్యాయము, సముచితమని భావించిన ప్రకారం ఉత్తర్వు.

మరియు/లేదా

(జి) కేసు పూర్వాపరాల దృష్ట్యా సవ్యమని భావించిన ఉత్తర్వుల జారీ.

## 3. అవసరమైన ఉత్తర్వులు

### (I) సెక్షన్ 18 ప్రకారం రక్షణ ఉత్తర్వు.

- ☐ దరఖాస్తులోని కాలమ్ 4 (ఎ) / (బి) / (సి) / (డి) / (ఇ) / (ఎఫ్) / (జి) లో పేర్కొనిన హింసా చర్యలు వేటినీ ప్రతివాది (లు) పునరావృతం చేయకుండా ఇంజంక్షన్ ఉత్తర్వు జారీ.
- ☐ ఫిర్యాది పాఠశాల/కళాశాల/ పని ప్రదేశానికి ప్రతివాది (లు) రాకుండా నిరోధిస్తూ ఉత్తర్వు.
- ☐ ఫిర్యాది ఉద్యోగ ప్రదేశానికి వెళ్ళడాన్ని, ప్రతివ్యాది (లు) అడ్డు కోవడాన్ని నిరోధిస్తూ ఉత్తర్వు.
- ☐ ఫిర్యాది పిల్లల పాఠశాల /కళాశాల/ ఇతర ప్రదేశానికి ప్రతివాది (లు) వెళ్ళడాన్ని నిరోధిస్తూ ఉత్తర్వు.
- ☐ ఫిర్యాది తన పాఠశాలకు వెళ్ళడాన్ని ప్రతివాది (లు) అడ్డగించ కుండా ఉత్తర్వు.
- ☐ ఫిర్యాదితో ప్రతివాది(లు) ఏరూపంలోనైనా సంభాషణలు జరపడాన్ని నిరోధిస్తూ ఉత్తర్వు.
- ☐ ప్రతివాది (లు) ఆస్తులను అమ్మివేయడాన్ని నిరోధిస్తూ ఉత్తర్వు
- ☐ జాయింట్ బ్యాంక్ ఎక్కౌంట్లు, లాకర్లను ప్రతివాది ఉపయో గించకుండా, బాధితురాలు ఉపయోగించడానికి అనుమతిస్తూ ఉత్తర్వు.
- ☐ బాధితురాలిపై ఆధారపడినవారు / బంధువులు / మరే ఇతర వ్యక్తులపై ప్రతివాది హింస జరపకుండా నిరోధించేందుకు. వారందరికీ దూరంగా ఉండాలని ప్రతివాదికి ఆదేశం.
- ☐ మరే ఇతర ఉత్తర్వులైనా, స్పష్టంగా పేర్కొనండి.

**(II) సెక్షన్ 19కింద నివాసపు ఉత్తర్వు :**

ప్రతివాది(లు) ఈకింది చర్యలకు పాల్పడకుండా నివారిస్తూ ఉత్తర్వులు.

- ☐ కలిసివుండే ఇంటిని నాకు చెందకుండా చేయడం / నన్ను గెంటివేయడం.
- ☐ కలసివుండే ఇంటిలో నేను ఉండే భాగంలోకి ప్రవేశించడం.
- ☐ కలిసివుండే ఇంటిని అమ్మి వేయడం / ధారాదత్తం చేయడం/ వదిలించుకోవడం.
- ☐ కలిసివుండే ఇంటిలో అతని హక్కును. ____________
- ☐ నాకు చెందిన వస్తువులను నేను ఎప్పుడైనా ఉపయోగించుకునే హక్కు కల్పించేలా ఉత్తర్వు.
- ☐ ప్రతివాదులను కింది విధంగా ఆదేశిస్తూ ఉత్తర్వు
- ☐ కలిసివుండే ఇంటినుంచి అతను/వారు బయటకు వెళ్ళిపోవాలని.
- ☐ అదే స్థాయికి చెందిన ప్రత్యామ్నాయ వసతి కల్పించాలని లేదా దానికి అద్దె (కిరాయి) చెల్లించాలని.
- ☐ మరే ఇతర ఉత్తర్వులైనా, స్పష్టంగా పేర్కొనండి.

**(III) సెక్షన్ 20 కింద ఆర్థిక ఉపశమనం**

- ☐ ఆదాయం కోల్పోవడం: కోరుతున్న మొత్తం ____________
- ☐ వైద్య ఖర్చులు: కోరుతున్న మొత్తం ____________
- ☐ బాధితురాలికి చెందిన ఆస్తి ధ్వంసం /నష్టం/ తీసేసుకోవడం, కోరుతున్న మొత్తం ____________
- ☐ క్లాజ్ 10 (డి)లో పేర్కొన్న, శారీరక/మానసిక గాయం, మరే ఇతర నష్టం.

  కోరుతున్న మొత్తం ____________

  అన్నీ కలిపికోరుతున్న మొత్తం ____________
- ☐ ఇతర ఉత్తర్వు ఏదైనా, స్పష్టంగా పేర్కొనండి.

**(IV) సెక్షన్ 20 కింద ఆర్థిక ఉపశమనం**

☐ కింది ఖర్చులకు చెల్లించాలని ప్రతివాదికి ఆదేశం.

☐ ఆహారం, దుస్తులు, వైద్య అవసరాలు, ఇతర కనీస అవసరాలు

మొత్తం / నెలకు ____________

☐ స్కూలు ఫీజు, సంబంధిత ఖర్చులు / నెలకు ____________

☐ కుటుంబ ఖర్చులు / నెలకు ____________

☐ ఇతర ఖర్చులు / నెలకు ____________

అన్నీ కలిపి మొత్తం / నెలకు

☐ ఇతర ఆదేశమేదైనా, స్పష్టంగా పేర్కొనండి.

**(V) సెక్షన్ 21 ప్రకారం కస్టడీ ఉత్తర్వు**

పాప /బాబు / పిల్లల కస్టడీని ఈ కింది వారికి అప్పగించాలని ప్రతివాదికి ఆదేశం :

☐ ఆమె తరపున వేరే వ్యక్తికి, (స్పష్టంగా పేర్కొనండి.)

**(VI) సెక్షన్ 22 కింద పరిహారం ఉత్తర్వు**

____________________________________________

**(VII) మరే ఇతర ఉత్తర్వు, (స్పష్టంగా పేర్కొనండి)**

____________________________________________

4. గతంలో ఉన్న కేసులు - ఏవైనా ఉంటే, వాటివివరాలు :

(ఎ) భారతీయ శిక్షా స్మృతి సెక్షన్ ____________________ కింద, ____________________ కోర్టులో కేసు తీర్పు వెలువడితే, లభించిన ఉపశమనాలు ____________________

(బి) క్రిమినల్ ప్రోసీజర్ కోడ్ (సిఆర్‌పిసి) సెక్షన్ ______________ కింద ____________________ కోర్టులో

తీర్పు వెలువడివుంటే, లభించిన ఉపశమనాలు ______________

(సి) హిందూ వివాహచట్టం, 1956లోని సెక్షన్ కింద, ________________
కోర్టులో విచారణలో ఉన్నది.

తీర్పు వెలువడితే, లభించిన ఉపశమనం ________________

(డి) హిందూ ఎడాప్షన్స్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్, 1956లోని సెక్షన్ ________________ కింద ________________ కోర్టులో విచారణ జరుగుతోంది.

తీర్పు వెలువడితే, లభించిన ఉపశమనం వివరాలు ________________

(ఇ) ________________ చట్టంలోని ________________ సెక్షన్ కింద భరణం కోసం దరఖాస్తు.

మధ్యంతర భరణం రూ॥ ________________ నెలకు.

భరణం మంజూరైనది రూ॥ ________________ నెలకు.

(ఎఫ్) ప్రతివాది జుడిషియల్ కస్టడీకి పంపబడినారా?

☐ వారంలోపు కాలానికి

☐ నెల రోజులలోపు కాలానికి

☐ నెలకుపైబడిన కాలానికి.

ఎంత కాలమో స్పష్టంగా తెలుపండి ________________

(జి) ఇతర ఉత్తర్వు ఏదైనా ________________

**ప్రార్థన**

పై పరిస్థితుల దృష్ట్యా, ఇందులో కోరిన ఉపశమనాలను మంజూరు చేయాలని, వాస్తవ పరిస్థితుల దృష్ట్యా బాధితురాలిని కుటుంబ హింస నుంచి రక్షించి, న్యాయం చేయడం కోసం ఈ గౌరవ కోర్టు అవసరమని భావించిన ఇతర ఉత్తర్వులు జారీ చేయాలని గౌరవ కోర్టువారిని సవినయంగా ప్రార్థించడమైనది.

ప్రదేశం : ఫిర్యాది / బాధితవ్యక్తి

తేదీ : కౌన్సిల్ద్వారా.

నిరూపణ :

పై దరఖాస్తులోని 1 నుంచి 12 పేరాల వరకు పేర్కొన్న అంశాలు నాకు తెలిసినంత వరకు నిజమూ, వాస్తవమని, ఏ విషయాన్ని దాచలేదని ప్రదేశంలో ఈ దినము నాడు సరి నిరూపణ చేయడమైనది.

ఫిర్యాది
రక్షణాధికారి కౌంటర్ సంతకం,
(తేదీతో)

## ఫారమ్ -III

## (నిబంధన 6(4) మరియు 7 చూడండి)

కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005 లోని సెక్షన్ 23 (2) ప్రకారం అఫిడవిట్.

_____________ ఎం ఎం _____________ కోర్టు ఎదుట

పోలీసు స్టేషన్ _____________

శ్రీమతి _____________ ఇతరులు

వర్సెస్ _____________ ఫిర్యాది

శ్రీ _____________ ఇతరులు

_____________ ప్రతివాది

అఫిడవిట్

గారి భార్య, _____________ నివాసి,

_____________ గారి కుమార్తె _____________

సత్యప్రమాణంగా,

ఈ క్రింది విధంగా ప్రకటించుచున్నాను, మరియు ప్రమాణం చేయుచున్నాను.

1. _____________ కొరకు నా తరపున, నాకుమార్తె/ కూమారుడి తరపున ఇందులో దాఖలు చేసిన దరఖాస్తుకు నేను దరఖాస్తు దారును.

2. _____________ కు నేను సహజ సంరక్షకురాలిని.

3. ఈ కేసు వాస్తవాలు, పూర్వాపరాలు క్షుణ్ణంగా తెలిసివుండటం ద్వారా ఈ అఫిడవిట్ దాఖలు చేయుటకు నేను అర్హురాలిని.

4. ప్రతి వాదితో కలసి _____________ వద్ద_____________ నుంచి _____________ వరకు కలిసి జీవించుచున్నాను.

5. ఈ దరఖాస్తులో సెక్షన్ (ల) కింద ఉపశమనాల కోసం వివరాలను నేనే పొందుపరిచాను/ నా సూచనల మేరకు పొందుపరచడమైనది.

6. దరఖాస్తులోని అంశాలను నాకు ఇంగ్లీషు హిందీ_____________ స్థానిక భాష. (భాషను ఉదహరించండి)లో చదివి వివరించారు.

7. దరఖాస్తులోని అంశాలను ఈ అఫిడవిట్‌లో భాగంగా పరగణించవలెను, ____________ కోసం వాటిని ఇక్కడ తిరిగి ప్రస్తావించలేదు.

8. తాను ఏ కుటుంబహింస నుంచి రక్షణ కోరుతున్నదో, అదే హింసకు ప్రతివాది (లు) మళ్ళీ మళ్ళీ పాల్పడవచ్చుని దరఖాస్తుదారు భయపడుతున్నారు.

9. ప్రతివాది, దరఖాస్తు దారును ________________________

________________________

________________________ అని

బెదిరించారు.

10. దీనితో జతపరచిన దరఖాస్తులో దరఖాస్తుదారు కోరిన ఉపశమనాలను ఎక్స్‌పార్టీ అడ్ - ఇంటెరిమ్ ప్రాతిపదికన మంజూరు చేయకపోతే, దరఖాస్తు దారు భారీ ఆర్థిక కష్టాలను ఎదుర్కోవడం, ప్రతివాదులు తమహింసా చర్యలను పునరావృతం చేయడం లేదా పెంచడం వంటి ప్రమాదాలకు దారి తీయకుండటం కోసం ఇందులో కోరిన ఉపశమనాలు అత్యవసరమైనవి.

11. పైన పేర్కొన్న విషయాలన్నీ నాకు తెలిసినంతవరకు, నా విశ్వాసం మేరకు వాస్తవాలు, ఏ విషయాన్ని దాచలేదు.

**నిరూపణ :**

పై అఫిడవిట్‌లోని అంశాలు నాకు తెలిసిన మేరకు, నా విశ్వాసంలో సత్యమని, ఏ భాగమూ అబద్ధముకాదని, ఏ అంశాన్ని దాచలేదని ______________ వద్ద దినము, ____________ 20 ____________ నాడు సరినిరూపణ చేయడమైనది.

వాది

## ఫారమ్ - VII

(నింబంధన 11 (I) చూరండి)

కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం, 2005లోని సెక్షన్ 13 (1) ప్రకారం కోర్టులో హాజరు కోసం నోటీసు.

మహారాజశ్రీ ——————————— కోర్టులో

పోలీసు స్టేషన్ : ———————————

శ్రీమతి ——————————— ఫిర్యాది

వెర్సెస్

శ్రీ. ——————————— ప్రతివాది

విషయంలో

శ్రీ ———————————

శ్రీ ——————————— గారి కుమారుదు

చిరునామా ———————————

———————————

——————————— కు

కుటుంబ హింస నుండి మహిళలకు రక్షణ చట్టం, 2005లోని ——————— ———సెక్షన్ (ల) కింద ఫిర్యాది దరఖాస్తు(లు) చేసియున్నందున దరశాస్తుదారు మీకు వ్యతిరేకంగా కోరిన ఉపశమనాలు ఎందుకు జారీ చేయరాదో కారణం తెలిపేందుకు ది ——————— , 20 ——————— సంవత్సరం నాడు స్వయంగా లేదా మీరు అధీకరించిన న్యాయవాది ద్వారాగాని గంటలకు మీరు ఈ కోర్టు ఎదుట హాజరు కావలసిందిగా ఆదేశించడమైనది, లేనిచో, కోర్టు మీపై ఎక్స్‌పార్టీ ఉత్తర్వులు జారీ చేస్తుంది.

——————— తేదీ ——————— నాడు, 20 ——————— సంవత్సరం నా సంతకం, అధికార ముద్రతో జారీ చేయడమైనది.

కోర్టు సీలు

సంతకం